ఈ పేపర్ కోసం
www.visionandhra.in
చూడండి



# విజన్ ఆంధ్ర

తెలుగు దినపత్రిక

VISION ANDHRA TELUGU DAILY

అక్రిడేషన్ లు కలవు
విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
తెలుగుదిన పత్రికలో రిపోర్టర్లు కావలెను
తెలంగాణ రాష్ట్రంలోని అన్ని జిల్లాలు, నియోజకవర్గాలు, మండలాల వారిగా రిపోర్టర్లు కావలెను
సంప్రదించవలసిన ఫోన్ నంబర్స్ :
9440897445, 8074636674

గురువారం 25 జూన్ 2026 | సంపుటి: 28 సంచిక: 83
Thursday 25 June 2026 | Vol.No 28 Issue No .83
హైదరాబాద్ | Hyderabad
పేజీలు: 12+12
వెల: రూ.1.00
PUBLISHED FROM: HYDERABAD,NALGONDA, VIJAYAWADA
www.visionandhra.in

# సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

- నిర్లక్ష్యంగా వ్యవహరించే వారిని క్షమించం
- పార్టీకోసం పనిచేయని వారిని వదులుకుంటాం
- బాధ్యత లేని నాయకులను తప్పించడానికి వెనకాడం
- సర్‌తో బిజెపి రాజకీయ కుట్రలకు తెరతీస్తోంది
- జూమ్ మీటింగ్‌లో సిఎం రేవంత్ ఘాటు హెచ్చరిక

హైదరాబాద్,జూన్24 : ఎస్ఐర్ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరించే నాయకులను క్షమించే ప్రసక్తి లేదని, పనిచేయకుండా పార్టీకి నష్టం కలిగిస్తామంటే చూస్తూ ఊరుకోం అని సీఎం రేవంత్‌రెడ్డి హెచ్చరించారు. పని చేయని వారికి 10 రోజుల సమయం ఇచ్చి చూస్తాం.. లేకుంటే వారి స్థానంలో మరొకరిని నియమిస్తామని స్పష్టం చేశారు. ఎస్ఐఆర్‌పై సర్పంచ్‌లతో గ్రామాల్లో ప్రచారం చేయించాలని సూచించారు. తెలంగాణలో గురువారం నుంచి ఓటరు జాబితా ప్రత్యేక సవరణ కార్యక్రమం ఎస్ఐఆర్ ప్రారంభం కానుండడంతో కాంగ్రెస్ పార్టీ అప్రమత్తమైంది. ఈ సందర్భంగా నిర్వహించిన జూమ్ మీటింగ్‌లో.. టీపీసీసీ అధ్యక్షుడు మహేష్ కుమార్ గౌడ్, ముఖ్యమంత్రి, ఏఐసీసీ ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, ఏఐసీసీ కార్యదర్శి సచిన్ సావంత్, మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు పాల్గొన్నారు. ఎస్ఐఆర్ పక్రియలో ఎలాంటి నిర్లక్ష్యానికి తావులేకుండా ఎమ్మెల్యేలు, నియోజకవర్గ ఇన్‌ఛార్జులు, బూత్ స్థాయి నాయకులు అప్రమత్తంగా వ్యవహరించాలని మహేశ్ కుమార్ గౌడ్ సూచించారు. ఓటర్ల హక్కులను కాపాడటంలో పార్టీ శ్రేణులు కీలక పాత్ర పోషించాలని పిలుపునిచ్చారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని, దేశవ్యాప్తంగా భాజపా రాజకీయ వ్యూహాలను గమనించాల్సిన అవసరం ఉందన్నారు. అయితే సర్ విషయంలో సీరియస్‌గా



లేకపోవడం పట్ల పలువురు ఎమ్మెల్యేలపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎన్నిసార్లు చెప్పినా వినడం లేదని ఆగ్రహం చెందారు సర్ పేరిట బీజేపీ కుట్ర చేస్తోందని.. అప్రమత్తంగా లేకపోతే ఇబ్బందులు తప్పవన్నారు. ఎమ్మెల్యేలు నియోజకవర్గంలోనే ఉంటూ మానిటరింగ్ చేయాలని ఆదేశించారు. తనకి ఒక

మిగతా 2లో..

## ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

- బిఆర్ఎస్ నేతల మాటలు నమ్మితే అధోగతే
- ఇచ్చిన హామీలు అమలు చేస్తూ పోతున్నాం
- ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమం
- మీడియా సమావేశంలో మంత్రులు భట్టి, తుమ్మల

ఖమ్మం,జూన్24 : కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమ ప్రభుత్వమని డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క అన్నారు. ఇందిరమ్మ రాజ్యంలో ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తామన్నారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణను అప్పుల రాష్ట్రంగా మార్చారని విమర్శించారు. ఆనాడు జవహర్‌లాల్ నెహ్రూ, ఇందిరమ్మ హయాంలో నిర్మించిన ప్రాజెక్టులు నేటికీ చెక్కుచెదరలేదని గుర్తుచేశారు. బుధవారం వైరా నియోజకవర్గ ఎమ్మెల్యే క్యాంపు



కార్యాలయంలో రైతు ఆశీర్వాద సభ సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉపముఖ్యమంత్రి మాట్లాడుతూ.. గత బీఆర్ఎస్

మిగతా 2లో..

## సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

- రేషన్ నిరాకరణపై సుప్రీం ఆశ్చర్యం



న్యూఢిల్లీ,జూన్24 : ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ నుంచి తొలగించబడిన వారికి రేషన్ నిరాకరిస్తూ పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని సవాలు చేస్తూ దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో బుధవారం విచారణ జరిగింది. ఎస్ఐఆర్‌లో పేరు తీసేస్తే రేషన్ ఇవ్వరా అంటూ సుప్రీంకోర్టు ఆశ్చర్యం వ్యక్తం చేసింది. ఇది రాష్ట్ర పరిధిలోని ప్రత్యేక

మిగతా 2లో..

## నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

- లాంఛనంగా ప్రారంభించిన మంత్రి కోమటిరెడ్డి



నల్లగొండ,జూన్24 : నల్లగొండలో సిటీ బస్సు సేవలను రాష్ట్ర రోడ్డు, భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

మిగతా 2లో..

## తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాల పండుగ

- గతంలో ఒకే కార్పోరేషన్ పరిధిలో ఆషాఢ బోనాలు
- ఈ యేడు మూడు కార్పోరేషన్ల పరిధిలో నిర్వహణ
- అన్ని శాఖలు సమన్వయంతో బోనాలను విజయవంతం చేయాలి
- భక్తులకు సౌకర్యాల కల్పనతో పటిష్ట చర్యలు చేపట్టాలి
- ఆషాఢమాస బోనాల సమన్వయ సమావేశంలో మంత్రి కొండా సురేఖ
- బోనాల ఉత్సవాల నిర్వహణకు రూ. 20 కోట్లు కేటాయింపు




హైదరాబాద్,జూన్24 : తెలంగాణ ప్రజల ఆధ్యాత్మిక విశ్వాసాలు, సాంస్కృతిక సంప్రదాయాలు, జానపద వారసత్వానికి ప్రతీకగా నిలిచిన ఆషాఢ మాస బోనాల ఉత్సవాలను అత్యంత వైభవోపేతంగా నిర్వహించేందుకు ప్రభుత్వం సమగ్ర కార్యాచరణతో ముందుకు సాగుతున్నదని రాష్ట్ర అటవీ, పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ తెలిపారు. ప్రస్తుతం లండన్‌లో పర్యటనలో ఉన్న మంత్రి సురేఖ గారు బుధవారం జూమ్ వేదికగా ఎంసిఆర్ హెచ్ఆర్ డిలో నిర్వహించిన బోనాల

మిగతా 2లో..

## వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

- ప్రధాని మోడీని ఆహ్వానించిన ఇరాన్

న్యూఢిల్లీ,జూన్24 :ఇరాన్ మాజీ సుప్రీం లీడర్ దివంగత ఆయతుల్లా అలీ ఖమేనీ అంత్యక్రియలకు హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీకి ఆహ్వానం అందింది. ఈ ఏడాది ఫిబ్రవరిలో అమెరికా-ఇజ్రాయెల్ జరిపిన దాడుల్లో ఖమేనీ మరణించిన సంగతి తెలిసిందే. వచ్చే

మిగతా 2లో..



## తుంగభద్ర జలాలపై కేంద్రం జోక్యం కోరిన సీఎం

- తెలంగాణకు పూర్తిస్థాయి నీటి వాటా అందడం లేదన్న ఆందోళన,
- ఆర్డీఎస్‌కు నీటి సరఫరాపై ప్రత్యేక దృష్టి
- తుంగభద్ర బోర్డు బలోపేతానికి విజ్ఞప్తి,
- ఆర్డీఎస్ ఆనకట్ట భద్రతపై కీలక సమీక్ష
- రూ.59 కోట్ల పనులు నిలిచిపోవడంపై అసంతృప్తి,
- ప్యాకేజీ-1, 2 పనులు వెంటనే ప్రారంభించాలని ఆదేశం
- మల్లమ్మకుంట రిజర్వాయర్ సామర్థ్య పెంపుపై సీఎం రేవంత్‌రెడ్డి ఆదేశాలు

హైదరాబాద్,జూన్24 :మూడు రాష్ట్రాల సమావేశంలో సమస్యల ప్రస్తావనకు నిర్ణయం తుంగభద్ర నుంచి మన రాష్ట్రానికి రావాల్సిన నికర వాటా జలాల వినియోగానికి.. భాగస్వామ్య రాష్ట్రలతో సమన్వయ సాధనకు కేంద్ర ప్రభుత్వం జోక్యం చేసుకోవాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు. తుంగ భద్ర డ్యామ్, నది ప్రవాహం నుంచి తెలంగాణకు హక్కుగా 15.9 టీఎంసీల నీరు రావాల్సి ఉంది.

మిగతా 2లో..



## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

- కర్నాటక అక్రమ ప్రాజెక్టులతో పాలమూరు ఎడారి
- ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలు కాపాడాలి
- నీటి వాటాల కోసమే తెలంగాణ పోరాడి గెలిచింది
- కర్నాటక దురాగతాలను అడ్డుకోకుంటే మళ్లీ పోరాటం తప్పదు
- సిఎం రేవంత్‌కు హరీష్ రావు బహిరంగ లేఖ

హైదరాబాద్,జూన్24 : తుంగభద్ర జలాల్లో తెలంగాణ హక్కులను తాకట్టు పెట్టే కుట్రలను తక్షణమే విరమించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బీఆర్ఎస్ ఎమ్మెల్యే మాజీ మంత్రి టి. హరీశ్ రావు స్పష్టం చేశారు. తుంగభద్రపై కర్ణాటక అక్రమ ప్రాజెక్టులను అడ్డుకుని ఆర్డీఎస్, తుమ్మిళ్ల, భీమా ప్రాజెక్టుల ప్రయోజనాలను కాపాడాలని సీఎంకు ఆయన

మిగతా 2లో..



## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు



- కెసిఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారు
- కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ఆగమైన రాష్ట్రం
- జిల్లా ప్రాజెక్టులపై మంత్రుల నిర్లక్ష్యం
- సత్తుపల్లి పర్యటనలో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

ఖమ్మం,జూన్24 : రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదని.. రెన్యువల్ సీఎం అని మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు సెటైర్లు వేశారు. కేసీఆర్ మళ్లీ అధికారంలోకి రావాలని రాష్ట్ర ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. కాంగ్రెస్ గెలిస్తే రాష్ట్రం ఆగమవుతుందని కేసీఆర్ అనాడే చెప్పారని అన్నారు. బీఆర్ఎస్ ఓటమితో రాష్ట్రం నష్టపోయిందని చెప్పుకొచ్చారు. సీఎం రేవంత్‌రెడ్డి 72సార్లు ఢిల్లీ వెళ్లి ఏం సాధించారని ప్రశ్నించారు. బుధవారం సత్తుపల్లిలో కేటీఆర్ పర్యటించి, పలు కార్యక్రమాల్లో

మిగతా 2లో..

## ఒకరికి ఒకే ఓటును అమలు చేయండి

- బోగస్ ఓట్లను మాత్రమే తొలగించాలి
- ఎన్నికల ప్రధానాధికారికి బిఆర్ఎస్ వినతి

హైదరాబాద్,జూన్24 : బీఆర్‌కే భవన్‌లో రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డిని బీఆర్ఎస్ నాయకులు కలిశారు. ప్రత్యేక సవివర ఓటరు జాబితా సవరణపై ఎమ్మెల్సీ దాసోజ్ శ్రవణ్ కుమార్, మాజీ ఎంపీ రావుల చంద్రశేఖర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్‌తోపాటు బీఆర్ఎస్ నాయకుడు కురువ విజయ్ సీఈవో సుదర్శన్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. 'ఒక వ్యక్తి ఒక ఓటు' సూత్రాన్ని కచ్చితంగా అమలు చేసి, ద్వంద్వ ఓటరు నమోదులను గుర్తించి

మిగతా 2లో..

## అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

- ఘనంగా స్వాగతించిన స్థానిక నేతలు
- మోపిదేవిలో ప్రత్యేక పూజలు
- కొక్కిలిగడ్డ జడ్పీ పాఠశాల భవనానికి ప్రారంభం



మచిలీపట్టణం,జూన్24 : అవనిగడ్డ నియోజకవర్గంలో మంత్రి నారా లోకేశ్ పర్యటించారు. కొక్కిలిగడ్డ నుంచి మోపిదేవి

మిగతా 2లో..




## రాజకీయాల్లో మహిళా వివక్ష

- ఆడవాళ్లు రాజీకీయల్లోకి వస్తే టార్గెట్
- ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష

హైదరాబాద్, జూన్24 :రాజకీయాల్లో ఏది మాట్లాడినా తన మీద సోషల్ మీడియాలో విపరీతంగా ట్రోలింగ్

మిగతా 2లో..

## ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది

- రాయలసీమ రతనాలసీమగా మారబోతోంది
- జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయి
- భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుంది
- శరవేగంగా సీమ సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం
- గొడ్డలి పార్టీ కుల రాజకీయాలతో అప్రమత్తంగా ఉండాలి
- జొన్నగిరి గోల్డ్ మైన్స్ ప్రారంభంలో సిఎం చంద్రబాబు



కర్నూలు,జూన్24: ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైందని.. రాయలసీమ రతనాలసీమగా మారబోతోందని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అన్నారు. బుధవారం జొన్నగిరిలో గోల్డ్ మైన్స్ ప్లాంట్‌ను సీఎం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జొన్నగిరి గోల్డ్ మైన్‌తో ఇక్కడి ప్రజల జీవితాలు మారుతాయన్నారు. గతంలో జొన్నగిరిని స్వర్ణగిరిగా పిలిచేవారని.. మన దగ్గర కూడా బంగారం ఉత్పత్తి కాబోతోందని తెలిపారు. భవిష్యత్‌లో దేశమంతా జొన్నగిరి గురించే మాట్లాడుతుందని వెల్లడించారు. ఒకప్పుడు కెజిఎఫ్... ఇప్పుడు జెజిఎఫ్ అని ముఖ్యమంత్రి

మిగతా 2లో..

## రాజకీయాల్లో మహిళా వివక్ష

చేస్తున్నారని టీఆర్ఎస్ చీఫ్ కవిత అన్నారు. ఆడవాళ్లు రాజకీయాల్లోకి వస్తే ఇలానే టార్గెట్ చేస్తారనే భావనతోనే కొందరు కావాలనే ఈ ట్రోలింగ్స్‌కు పాల్పడుతున్నారని చెప్పారు. ఇప్పటికీ ప్రపంచంలో లింగ వివక్ష కొనసాగుతోంది. అనేక రంగాల్లో మగవారికే ప్రాధాన్యత లభిస్తోంది' అని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజంలో కులాల కంటే.. మగవారి కులం, ఆడవారి కులం అనే రెండు మాత్రమే ఉన్నాయనిపిస్తోందని కవిత వ్యాఖ్యానించారు. హైదరాబాద్ జూబ్లీహిల్స్‌లో జరిగిన వేట విమెన్ ఎంపవర్‌మెంట్ సమ్మిట్‌లో మాట్లాడిన కవిత.. సమాజంలో, రాజకీయాల్లో మహిళలు ఎదుర్కొంటున్న వివక్షపై ఆమె ఎమోషనల్ అయ్యారు. తెలంగాణ వచ్చాక పోలీస్ డిపార్ట్‌మెంట్‌లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్ తెచ్చుకున్నా.. ఇప్పటికీ అది పూర్తిస్థాయిలో అమలు కావడం లేదన్నారు. జీన్-జెడ్ జనరేషన్‌లోనూ అమ్మాయిలు ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, మహిళలు ఎదగాలని చూస్తే వెంటనే తొక్కేసే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు. ఐటీ, బ్యాంకింగ్, మీడియా రంగాల్లో ఎంత సత్తా చాటుతున్నా.. పెళ్లి, కుటుంబ బాధ్యతల వల్ల మళ్లీ కెరీర్‌ను మొదటి నుంచి ప్రారంభించాల్సి వస్తోందని, అందుకే మహిళలకు ప్రభుత్వాలు, కుటుంబం, సమాజం సపోర్ట్ ఇవ్వాలని కోరారు. బాల్య వివాహాలపై కవిత షాకింగ్ గణాంకాలను బయటపెట్టారు. 2026 లో కూడా తెలంగాణ గ్రామాల్లో బాల్య వివాహాలు జరుగుతున్నాయని.. పె÷-లళైన 15-19 ఏళ్ల మధ్యలోనే అమ్మలవుతున్న టీనేజర్ మదర్స్ గ్రామీణ ప్రాంతాల్లో 7.2 శాతం ఉంటే, హైదరాబాద్ లాంటి మహానగరంలోనే 2.7 శాతం మంది ఉన్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థినులకు పిలుపునిస్తూ.. సోషల్ మీడియాలో లైకులు, ఫాలోవర్స్ రాలేదని నిరుత్సాహపడొద్దని, మహిళలంతా ఒక మంచి టా÷-గ్గ÷ట్ పెట్టుకొని, దాన్ని సాధించే దిశగా బలమైన గొంతుకతో ముందుకు సాగాలని కవిత పిలుపునిచ్చారు.

## వచ్చే నెలలో ఖమేనీ అంత్యక్రియలు

నెలలో ఖమేనీ అంత్యక్రియలు ఘనంగా జరగబోతున్నాయి. ఈ కార్యక్రమానికి హాజరు కావాల్సిందిగా ప్రధాని మోదీని ఇరాన్ అధ్యక్షుడు మసూద్ పెజెష్కియాన్ ఆహ్వానించారు. జులై 5 నుంచి 9వ తేదీ వరకు ఖమేనీ అంత్యక్రియలను ఇరాన్ ప్రభుత్వం అధికారికంగా నిర్వహించనుంది. మొదట టెహ్రాన్, ఖోమ్ పట్టణాల్లో అంతిమ సంస్కారాలకు సంబంధించిన కార్యక్రమాలను నిర్వహించనున్నారు. అనంతరం ఖమేనీ స్వస్థలమైన మషాద్‌లో ఖననం చేయనున్నారు. ఈ కార్యక్రమానికి వివిధ దేశాల నాయకులను, ప్రతినిధి బృందాలను ఇరాన్ ఆహ్వానిస్తోంది. కాగా, ఇరాన్ నుంచి వచ్చిన ఆహ్వానంపై భారత ప్రభుత్వం ఇంకా అధికారిక ప్రకటన చేయలేదు. ప్రధాని మోదీ స్వయంగా హాజరవుతారా లేదా భారత తరపున ప్రత్యేక ప్రతినిధిని పంపుతారా అనే అంశంపై దౌత్య వర్గాల్లో చర్చ జరుగుతోంది. భారత్-ఇరాన్ మధ్య ఇంధనం, వాణిజ్యం, ప్రాంతీయ భద్రత, చాబహార్ నౌకాశ్రయం వంటి కీలక అంశాల్లో సహకారం కొనసాగుతోంది.

## ఒకరికి ఒకే ఓటును అమలు చేయండి

తొలగించాలని బీఆర్ఎస్ నేతలు ఎన్నికల సంఘాన్ని కోరారు. అనంతరం ఎమ్మెల్సీ దాసోజు శ్రవణ్ కుమార్ మీడియాతో మాట్లాడుతూ.. ప్రజాస్వామ్య పునాదులను విధ్వంసం చేసేటటువంటిది.. రాజ్యాంగ స్ఫూర్తిని సర్వనాశనం చేసేటటువంటిది. పవిత్రమైన ఎన్నికల పక్రియను పూర్తిగా భ్రష్టు పట్టించే పక్రియ డూప్లికేట్ ఓటర్లు అని అన్నారు. ఈ బోగస్ ఓటర్లు, డూప్లికేట్‌ఓటర్ల వల్ల పవిత్రమైన ప్రజాస్వామ్య యుత ఎన్నికల పక్రియను సర్వనాశనం చేస్తున్నారో దాన్ని సరిదిద్దడం కోసమే మేం ముందుకొచ్చామని కేంద్ర ఎన్నికల సంఘం పలు మార్లు చెబుతూ ఎస్ఐఆర్ అనే పక్రియను మనముందుకు తీసుకొచ్చింది. కేసీఆర్, బీఆర్ఎస్, ఇతర రాజకీయ పార్టీలు ప్రజలంతా పెద్ద ఎత్తున ఈ ఎస్ఐఆర్ పక్రియలో భాగస్వామ్యులవుతున్నారు. అయితే దీంట్లో కొలిక్కిరాని అందరూ అర్థం చేసుకోవాల్సిన విషయం ఏంటంటే.. బోగస్ ఓట్ల విషయంలో మేం గతంలో జూబ్లీహిల్స్ ఎన్నిక జరిగినప్పుడు చెప్పినం. నిన్న కూడా చెప్పినం. ఇవాళ కూడా చెప్తున్నం. వివిధ రాష్టాల్లో్ర వ్యక్తులకు సంబంధించిన డూప్లికేట్ ఓట్లను డిలీట్ చేసే మెకానిజం ప్రస్తుతం కేంద్ర ఎన్నికల సంఘం దగ్గర లేదు. ఇది పూర్తిగా కూడా ఎస్ఐఆర్ పక్రియను నష్టపరిచేది.. భ్రష్టు పరిచేదే. ఈ విషయాన్ని కేసీఆర్ ఆదేశాల మేరకు చీఫ్ ఎలక్రోరల్ ఆఫీసర్‌కు బీఆర్ఎస్ తరపున మేం విజ్ఞప్తి చేశామన్నారు.

## అవనిగడ్డలో లోకేశ్ పర్యటన

శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయానికి చేరుకున్న మంత్రి.. అక్కడ ప్రత్యేక పూజలు చేశారు. ఆలయానికి చేరుకునే ముందు గ్రామస్తులను ఆప్యాయంగా పలకరించారు. 'బాగున్నారా' అంటూ కరచాలనం చేశారు. 'లోకేశ్ అన్నా' అంటూ ప్రేమతో మంత్రిని స్థానిక ప్రజానీకం పలకరించింది. అనంతరం, వేద ఆశీర్వచనాలతో లోకేశ్‌కు దేవాదాయ శాఖ అధికారులు, ఆలయ అర్చకులు స్వాగతం పలికారు. శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన మంత్రి.. స్వామివారి పుట్టలో పాలు పోసి మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వామివారి ఫొటో, లడ్డూ ప్రసాదాన్ని అందించి లోకేశ్‌ను అధికారులు సత్కరించారు. లోకేశ్ వెంట ఎంపీ బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడే ప్రసాద్, వెనిగండ్ల రాము, కాగిత దర్శించుకున్నారు. అనంతరం మోపిదేవిలో ఏర్పాటు చేసిన ప్రత్యేక శిబిరంలో టీడీపీ కార్యకర్తలు, నేతల సమన్వయ సమావేశంలో మంత్రి లోకేశ్ పాల్గొన్నారు. పెదప్రోలులో మంత్రికి మచిలీపట్నం పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు వీరంకి గురుమూర్తి, అవనిగడ్డ నియోజకవర్గ పరిశీలకులు కనపర్తి శ్రీనివాస్ ఆధ్వర్యంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. మోపిదేవి మండలంలో ఆధునీకరించిన కొక్కిలిగడ్డ జడ్పీ ఉన్నత పాఠశాల నూతన భవనాన్ని ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో మొక్కలు నాటారు. పాఠశాల ఆవరణలో గ్రామస్తులకు మంత్రి అభివాదం చేశారు. ఈ కార్యక్రమంలో మంత్రి వాసంశెట్టి సుభాష్, ఎంపీ వల్లభనేని బాలశౌరి, ఎమ్మెల్యేలు మండలి బుద్ధప్రసాద్, బోడె ప్రసాద్, వెనిగండ్ల రాము, ఎమ్మెల్సీ అశోక్ బాబు పాల్గొన్నారు. లోకేశ్ పర్యటన సందర్భంగా పెద్దఎత్తున టీడీపీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలివచ్చారు. ప్రతిఒక్కరికీ అభివాదం చేస్తూ మంత్రి ముందుకు సాగారు.

## నల్లగొండకు సిటీ బస్సు సర్వీసులు

ప్రారంభించారు. పట్టణంలోని మహిళలు షాపింగ్, ఇతర అవసరాల కోసం రాకపోకల్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, వారి సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని సిటీ బస్సు సేవలను ప్రారంభించినట్లు తెలిపారు. అలాగే మెడికల్ కాలేజీ విద్యార్థులు ఆస్పత్రికి చేరుకోవడానికి ఆటోలపై ఆధారపడాల్సి వచ్చేదని, ఇకపై వారు సిటీ బస్సుల్లో ఉచితంగా ప్రయాణించే అవకాశం ఉంటుందని చెప్పారు. బుధవారం కోటి 20 లక్షల రూపాయలతో చేపట్టనున్న నల్లగొండ ఆర్టీసీ బస్టాండ్ విస్తరణ, ఆధునికీకరణ పనులకు ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా తొలుత 2 సిటీ బస్సులను ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. సిటీ బస్సు సర్వీసులు చెరువుగట్టు-ఎస్ఎల్‌బీసీ మార్గంతో పాటు ధర్వేశిపురం నుండి దుప్పలపల్లి వరకు నడిచేలా చర్యలు తీసుకుంటామని మంత్రి తెలిపారు. నల్లగొండకు అదనంగా 30 బస్సులు కేటాయించడం జరిగిందని, 56 మహిళా సంఘాల ఆధ్వర్యంలో ఎస్-ఎల్‌బీసీ వద్ద పెట్రోల్ పంపు, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్, రెస్టారెంట్ ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు. బస్టాండ్ విస్తరణలో భాగంగా కొత్త కౌంటర్లు, వెయిటింగ్ గా÷-డ్గ÷న్, బాత్రూంలు, టాయిలెట్లు, ఆధునిక ఎ÷-లాట్‌ఫారాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. ఈ పనుల కోసం అదనంగా రూ.5 కోట్ల నిధులు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. పట్టణ అభివృద్ధికి రూ.83 కోట్ల రూపాయలతో తాగునీటి శుద్ధి (వాటర్ ఫిల్టర్) వ్యవస్థను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు, పట్టణాన్ని సుందరంగా తీర్చిదిద్ది మోడల్ సిటీగా రూపొందిస్తామని మంత్రి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కురిసిషా ఖాన్, మేయర్ బుర్రి చైతన్య శ్రీనివాస్ రెడ్డి, రాష్ట్ర ప్రణాళిక ఆర్థిక శాఖ సెక్రెటరీ గౌరవ్ ఉప్పల్, జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్, జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, ఆర్టీసీ ఆర్ఎం జ్యోత్స్న, డిప్యూటీ మేయర్ అమీర్ అలీ, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, మాజీ జడ్పీటీసీ గుమ్మల మోహన్ రెడ్డి, కార్పొరేటర్ కవిత, రమేశ్, లైజన్ ఆఫీసర్ ప్రభాకర్ పాల్గొన్నారు.

## రేవంత్‌రెడ్డి రెగ్యులర్ సీఎం కాదు

పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రంలో ఏవర్గాన్ని వదిలిపెట్టకుండా కాంగ్రెస్ సర్కార్ వేధిస్తోందని ధ్వజమెత్తారు. సత్తుపల్లి విలేకర్లకు మండల రిపోర్టర్లుగా అక్రిడిటేషన్ జారీ చేసి రేవంత్‌రెడ్డి సర్కార్ అన్యాయం చేసిందని మాజీ మంత్రి కేటీఆర్ ఆగ్రహించారు. మొన్న జరిగిన మున్సిపల్ ఎన్నికల్లో కల్లూరు మున్సిపాల్టీ బీఆర్ఎస్ గెలిచేదని.. సత్తుపల్లిలో కూడా స్వల్ప ఓట్లతో ఈ స్థానం చేజార్చుకున్నామని తెలిపారు. ఆయా ఎన్నికల్లో బీఆర్ఎస్ గెలిస్తే పార్టీ శ్రేణులు పొంగిపోకూడదని.. ఓడితే కృంగిపోకూడదని పేర్కొన్నారు. తెలంగాణ మారుమూల ప్రాంతాలు ఎక్కడకు వెళ్లినా దుర్మార్గపు కాంగ్రెస్ పాలన పోవాలని.. కేసీఆర్ పాలన రావాలని ప్రజలు కోరుకుంటున్నారని తెలిపారు. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం సిద్ధించిన తర్వాత కేసీఆర్ హయాంలోని మొదటి పదేళ్లు పునాది రాళ్లు వేసుకున్నామని వివరించారు. రాష్ట్రంలో మళ్లీ అభివృద్ధి జరగాలంటే కేసీఆర్ రావాలని ప్రజలే అంటున్నారని తెలిపారు. కేసీఆర్ ఓటములు, గెలుపులు చూశారని.. అనాడు తెలుగుదేశం పార్టీలో అన్నగారితో కలిసి నడిచారని ప్రస్తావించారు. అన్నదాతలకు రైతుబంధు పూర్తిగా చేయకుండా వేధిస్తోందని ధ్వజమెత్తారు. నిరుద్యోగులకు ఉద్యోగాలు కల్పించడంలోనూ రేవంత్‌రెడ్డి సర్కార్ విఫలమైందని మాజీ మంత్రి కేటీఆర్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసీఆర్ ప్రభుత్వంలో ఇదే ఖమ్మం జిల్లాకు, కొత్త గూడెం జిల్లాకు, ఉమ్మడి ఖమ్మం జిల్లాకు గోదావరిలోని నీటిని ఒడిసిపట్టి మొత్తం సస్యశ్యామలం కావాలి.. ఖమ్మం జిల్లా రూపు రేఖలను మార్చాలనే ప్రయత్నం కేసీఆర్ బలంగా చేశారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. కాంగ్రెస్ వాళ్లు జల యజ్ఞంలో భాగంగా రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్ అనే రెండు ప్రాజెక్టులకు రాళ్లు వేసి పోయారు. కానీ చేసింది పెద్దగా ఏం లేదు. కానీ కేసీఆర్ ఎవరో సంబంధం లేని నాయకుల పేర్లు ఎందుకని ఆలోచన చేసి మీ జిల్లా మొత్తం తెలంగాణకు ఆరాధ్య దైవమైన భద్రాద్రి సీతారామ స్వామి వారి పేరు మీద సీతారామ ప్రాజెక్టు అని పెట్టి మన జిల్లాకు 7 లక్షల ఎకరాలకు.. కొత్తగా నాలుగురన్నర లక్షల ఎకరాలకు కొత్త ఆయకట్టు.. ఎన్ఎస్‌పీల కింద కాలువల కింద ఉండే వ్యవసాయాన్ని స్థిరీకరించడానికి 2.50 లక్షల ఎకరాలకు మొత్తంగా 7 లక్షల ఎకరాలకు సాగునీరందించే బృహత్తర యజ్ఞానికి శ్రీకారం చుట్టారు. అందులో మీ సత్తుపల్లిలో 90 వేల ఎకరాల స్థిరీకరణ 40 వేల ఎకరాలు మొత్తం కలిపి లక్షా 30 వేల ఎకరాలు సీతారామ ప్రాజెక్టు పూర్తయితే మొట్టమొదటి ఫలితం అందుకునే నియోజకవర్గం మీ సత్తుపల్లి అని కేటీఆర్ అన్నారు.

# తెలంగాణ ఆత్మను ప్రతిబింబించే మహోత్సవం బోనాల పండుగ

ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొని ఏర్పాట్లపై మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఇతర ఉన్నతాధికారులతో నిర్వహించిన బోనాల ఉత్సవాల సమన్వయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో మంత్రులు పొన్నం ప్రభాకర్, అజారుద్దీన్, ఎమ్మెల్సీలు బొగ్గారపు దయానంద్, ఎమ్మెల్యేలు నవీన్ యాదవ్, దానం నాగేందర్, డిజిపి సి.వి. ఆనంద్, దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి శైలజా రామయ్యర్, డైరెక్టర్ హనుమంతరావు, హైదరాబాద్ పోలీస్ కమిషనర్ సి.వి. సజ్జనార్, ధార్మిక సలహాదారు గోవింద హరి, ఉన్నతాధికారులు, జీహెచ్ఎంసీ, పోలీసు, విద్యుత్, ఆర్/బీ, వాటర్ వర్క్స్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, ఆర్టీసీ, మెట్రో, పర్యాటక, సమాచార పౌరసంబంధాల శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతిలో బోనాల పండుగకు ప్రత్యేక స్థానం ఉందన్నారు. ఈ ఏడాది ఆషాఢ జాతర ఉత్సవాలు జూలై 16 నుంచి ఆగస్టు 13 వరకు హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, మేడ్చల్-మల్కాజిగిరి జిల్లాల పరిధిలోని దేవాలయాల్లో నిర్వహించే బోనాల ఉత్సవాలకు సౌకర్యాల కల్పనలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. బోనాల ఉత్సవాలకు శ్రీకారం చుట్టే గోల్కొండ శ్రీ జగదాంబ మహంకాళి దేవాలయంలో జూలై 16న ప్రారంభమయ్యే ఉత్సవాలు ఆగస్టు 13 వరకు అట్టహాసంగా నిర్వహిస్తామని మంత్రి తెలిపారు. ప్రస్తుతం తాను లండన్ పర్యటనలో వున్నందున ఇక్కడి నుంచే జూమ్ మీటింగ్ ద్వారా అధికారులకు సూచనలివ్వాల్సి వస్తున్నదని అన్నారు. ఉత్సవాల సందర్భంగా నిర్వహించే ఘటోత్సవాలు, బోనాల సమర్పణ, సాక సమర్పణ, తొ÷-టటెల ఊరేగింపులు, పోతురాజుల వీరంగాలు, రంగం కార్యక్రమాలు, గావుపట్టడం, సాగనంపు వంటి సంప్రదాయ కార్యక్రమాలు తెలంగాణ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబిస్తాయని మంత్రి పేర్కొన్నారు. ఈ సంప్రదాయాల పరిరక్షణ కోసం ప్రభుత్వం నిష్టతో కార్యాచరణను అమలు చేస్తున్నదని మంత్రి తెలిపారు. గత కొన్నేళ్లుగా బోనాల ఉత్సవాలకు ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయం గణనీయంగా పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. ఈ నిధులను ఆలయాల మౌలిక వసతుల మెరుగుదల, భక్తులకు సౌకర్యాల కల్పన, విద్యుత్ దీపాలంకరణలు, పుష్పాలంకరణలు, సీసీ కెమెరాలు, క్యూలైన్లు, తాగునీటి సదుపాయాలు, పారిశుధ్య నిర్వహణ, వైద్య శిబిరాల ఏర్పాట్లకు సమర్థవంతంగా వినియోగించాలని సూచించారు. భక్తుల సౌకర్యార్థం దేవాదాయ శాఖ, జీహెచ్ఎంసీ, పోలీస్ శాఖ, విద్యుత్ శాఖ, రోడ్లు-భవనాల శాఖ, వాటర్ వర్క్స్, ఆర్టీసీ, రైల్వే, వైద్య ఆరోగ్య శాఖ, అగ్నిమాపక శాఖ, పర్యాటక శాఖ, సమాచార పౌరసంబంధాల శాఖలు సమన్వయంతో పనిచేయాలని మంత్రి స్పష్టం చేశారు. ముఖ్యంగా భారీ రద్దీ ఉండే దేవాలయాల వద్ద ప్రత్యేక ట్రాఫిక్ ప్రణాళికలు, అదనపు బస్సులు, వైద్య బృందాలు, భద్రతా ఏర్పాట్లు చేపట్టాలని ఆదేశించారు. వృద్ధుల కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలన్నారు. గర్భిణులు, బాలింతల కోసం లాక్టేషన్ రూమ్ లను ఏర్పాటు చేయాలని అధికారులకు సూచించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న మహాలక్ష్మీ ఉచిత బస్సు ద్వారా బోనాల ఉత్సవాలు జరిగే ప్రాంతాలకు రాష్ట్రం నలుమూలల నుంచి తాకిడి వుండే పరిస్థితుల నేపథ్యంలో ఈ దిశగా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని మంత్రి సురేఖ రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ గారిని కోరారు. ÷ఖ్యమంత్రి రేవంత్ రెడ్డిగారు దేవాదాయశాఖ పై, దేవాలయాల అభివృద్ధి పై ప్రత్యేక శ్రద్ధతో కోట్లాది రూపాయల నిధులు అందిస్తున్నారని మంత్రి తెలిపారు. ఈ ఏడాది బోనాల ఉత్సవాల నిర్వహణకు ప్రభుత్వం రూ.20 కోట్ల నిధులను కేటాయించినందుకు సీఎంకు మంత్రి సురేఖ ధన్యవాదాలు తెలిపారు.

## తుంగభద్ర జలాలపై కేంద్రం జోక్యం కోరిన సీఎం

ఇప్పుడు అయిదారు టీఎంసీలకు మించి రావడం లేదని ముఖ్యమంత్రి ఆందోళన వ్యక్తం చేశారు.ఆర్డీఎస్ కింద జోగులాంబ గద్వాల జిల్లాలో దాదాపు 75 గ్రామాల్లో 83,987 ఎకరాల ఆయకట్టుకు నీరు అందాల్సి ఉంది. మూడు రాష్ట్రాల భాగస్వామ్యం ఉన్నందున కేంద్ర జల సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ, ఏపీ, కర్ణాటక నీటి వాటాల సమర్థ వినియోగానికి కేంద్ర జల సంఘం (ఎఙఎ) సారథ్యంలో తుంగ భద్ర బోర్డ్ ను పటిష్టం చేయాలని కోరారు. బుధవారం సాయంత్రం జలసౌధ లో తుంగభద్ర ప్రాజెక్టు, ఆర్డీఎస్ , అంతర్రాష్ట్ర నదీ జల వివాదాలపైన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఎంపీ మల్లు రవి, ప్రభుత్వ సలహాదారు జితేందర్ రెడ్డి, నీటి పారుదల శాఖ సలహాదారు ఆదిత్య నాథ్ దాస్, సీఎంఓ కార్యదర్శి మాణిక్ రాజ్,ఇరిగేషన్ సెక్రటరీ శ్రీధర్,ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్ మిట్టల్ ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులు ఈ సమావేశం లో పాల్గొన్నారు. ఆర్డీఎస్ ఆనకట్ ప్రమాదకరంగా మారిందని, భద్రత దృష్ట్యా చేపట్టాల్సిన పనులను అత్యవసరంగా గుర్తించాలని కోరారు. రాజోలి బండ డైవర్షన్ కెనాల్ ఆధునీకీకరణకు సంబంధించి ఇప్పటికే తెలంగాణ ప్రభుత్వం రూ. 59 కోట్లు డిపాజిట్ చేసిందని, పనులు ఇప్పటికీ పూర్తి కాలేదని అన్నారు. ప్యాకేజీ 1,2 పనులు ఇప్పటికీ చేపట్టలేదని, ప్యాకేజీ 3, 4 పనులు మాత్రం పూర్తి అయ్యాయని అధికారులు ముఖ్యమంత్రికి వివరించారు. నిలిచిపోయిన మొదటి రెండు ప్యాకేజీల పనులు వెంటనే చేపట్టాలని రేపు కేంద్ర జలశక్తి మంత్రి ఆధ్వర్యంలో ముగ్గురు సీఎంల తో జరిగే సమావేశం లో ప్రధానంగా ప్రస్తావించాలని నిర్ణయించారు. ఆర్డీఎస్ వద్ద తెలంగాణ భూభాగం వైపు పూడిక నిండిపోవడం వల్ల ఆశించిన విధంగా నీటిని మళ్లింపు సాధ్యం కావడం లేదని ఇంజనీర్లు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. 2004 లో నిపుణుల కమిటీ పూడిక తొలిగించాలని సూచించింది. ఆ కమిటీ ఇచ్చిన సిఫారసులు ఇప్పటికి అమలు కాలేదని చర్చ జరిగింది. వెంటనే పూడిక తీసేందుకు చర్యలు చేపట్టాలని కేంద్రాన్ని కోరాలని నిర్ణయించారు. పూడిక పేరుకున్న భూభాగం కర్ణాటకలో ఉండటంతో ఆ రాష్ట్ర సహకారం కోరాలని నిర్ణయం తీసుకున్నారు. పూడికతీత తో పాటు 2004లో నిపుణుల కమిటీ ఇచ్చిన సూచనలను అమలు చేయాలని కేంద్రానికి వినతి పత్రం అందించాలని ముఖ్య మంత్రి సూచించారు. అప్పటి నివేదికకు ఇప్పుడున్న వాస్తవ పరిస్థితిని విశ్లేషించుకోవాలని సూచించారు. వెంటనే పూర్తి వివరాలతో నివేదికను తయారు చేయాలని ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులను ఆదేశించారు. తుంగభద్ర ఎత్తిపోతల పథకంలో భాగంగా సాధ్యమైనంత నీటిని వినియోగించుకునే ప్రత్యామ్నాయాలు పరిశీలించాలని ముఖ్యమంత్రి అధికారులను అదేశించారు. తుమ్మిళ్ల నుంచి నీటిని వినియోగించుకునేందుకు కీలకమైన మల్లమ్మకుంట బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కెపాసిటీ పెంచాలని, వీలైనంత వేగంగా పనులను చేపట్టాలని ముఖ్యమంత్రి అదేశించారు.

## సర్ ప్రక్రియలో పేరు తొలగింపు

కారణాలతో కూడిన అంశం కాబట్టి.. ఆర్టికల్ 32 కింద నేరుగా సుప్రీంకోర్టుకు రాకుండా ముందుగా కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించాలని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. దీంతో పిటిషనర్ తరఫు న్యాయవాది ఎస్. ప్రసన్న తన పిటిషన్‌ను ఉపసంహరించుకుని హైకోర్టుకు వెళ్లేందుకు అనుమతి కోరారు. రేషన్ నిరాకరణ వివాదంపై కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్‌కు స్వేచ్ఛనిస్తూ జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీలతో కూడిన వెకేషన్ బెంచ్ ఆదేశాలు జారీ చేసింది.

## సర్ ప్రక్రియపై అప్రమత్తం కండి

నియోజకవర్గం కేటాయిస్తే వెళ్లి పనిచేస్తానని ఈ సందర్భంగా సీఎం అన్నారు. ఎమ్మెల్యేలు తీరు మారితే ఒకే అని.. వారం రోజుల్లో తీరు మారకపోతే ఎమ్మెల్యేల స్థానంలో యాక్టివ్‌గా ఉన్న మరోవ్యక్తిని ఇన్‌ఛార్జిగా నియమిస్తామని సీఎం స్పష్టం చేశారు. పార్టీ కోసం పనిచేయని వాళ్లు పార్టీకి అవసరం లేదని తేల్చిచెప్పారు. సర్ విషయంలో ఎవరినీ ఉపేక్షించేది లేదన్నారు. పార్టీలో ఏ పదవిలో ఉన్నా సర్ విషయంలో గ్రౌండ్ లెవల్‌కు వెళ్లి పనిచేయాల్సిందే అని అన్నారు. 'ఎవరెవరు పని చేయడం లేదో నా దగ్గర రిపోర్ట్ ఉంది. పద్ధతి మార్చుకోకపోతే వచ్చే మీటింగ్‌లో పేర్లు చెప్పాల్సి వస్తుంది. పేర్లు చెప్పించుకునే పరిస్థితి తెచ్చుకోవద్దని అన్నారు. ఇన్‌ఛార్జి మంత్రులు కూడా బాధ్యత తీసుకోవాలని.. పనిచేయకపోతే ఇన్‌ఛార్జి మంత్రులను కూడా మారుస్తామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హెచ్చరించారు. పశ్చిమ బెంగాల్‌లో ఓట్ల నిర్వహణ విషయంలో జరిగిన పరిణామాలను పీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ప్రస్తావించారు. తమకు అనుకూలంగా ఉన్న ఓట్లను తొలగించే ప్రయత్నాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. లౌకికవాద ఓట్లను లక్ష్యంగా చేసుకుని కుట్రలు జరిగే ప్రమాదం ఉందని, ప్రతి అర్హత కలిగిన ఓటు జాబితాలో ఉండేలా పార్టీ శ్రేణులు చర్యలు తీసుకోవాలన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు అత్యంత కీలకంగా పని చేయాలని సూచించారు. సర్ పక్రియలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోన్న ఎమ్మెల్యేలపై ఫైర్ అయ్యారు. ఈ విషయంలో చాలా మంది ఎమ్మెల్యేలకు వార్నింగ్ ఇచ్చారు. ఇప్పటికైనా తీరు మారాలని సూచించారు. ప్రతి ఓటునూ కాపాడుకోవాలని ఆదేశించారు. లౌకికవాదుల ఓట్ల తొలగింపు కుట్ర జరుగుతోందన్నారు. గద్వాల, మల్కాజిగిరి, భువనగిరి, నిజామాబాద్‌లో వీక్‌గా ఉన్నామని చెప్పారు. మెజారిటీ ఎమ్మెల్యేలు ఈ కార్యక్రమాలకు దూరంగా ఉండడం సబబు కాదని మహేష్ గౌడ్ పేర్కొన్నారు. ఓటు హక్కు రాజకీయాల కోసం మాత్రమే కాదని మీనాక్షి నటరాజన్ అన్నారు. జూమ్ మీటింగ్‌లో మాట్లాడుతూ.. మనిషికి ఆక్సిజన్ ఎంత అవసరమో ఓటు హక్కు అంతే అవసరమన్నారు. ఓటు అనేది ప్రతి మనిషికి సోషల్ స్టేటస్ అని చెప్పుకొచ్చారు. ఎంతో కష్టపడితే ఎస్సీ, ఎస్టీ, బీసీలకు ఓటు హక్కు వచ్చిందని తెలిపారు. ఓటు హక్కును కాపాడవలసిన బాధ్యత అందరిది అని మీనాక్షి నటరాజన్ వెల్లడించారు. జూమ్ మీటింగ్‌లో మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, పార్లమెంట్, అసెంబ్లీ ఇన్‌ఛార్జిలు పాల్గొన్నారు.

## ఆ నలుగురూ దేశం మీద పడి దుష్ప్రచారాలు

ప్రభుత్వ హయాంలో లక్ష కోట్లతో కట్టిన కాళేశ్వరం ప్రాజెక్టు పది సంవత్సరాలలోనే కుంగిపోయిందని భట్టి విమర్శించారు. కేసీఆర్ చేసిన అప్పులను కాంగ్రెస్ ప్రభుత్వం వడ్డీతో చెల్లిస్తోందన్నారు. తండ్రి, కొడుకు, అల్లుడు, కూతురు మాయమాటలతో రాష్ట్రంలో తిరుగుతున్నారని.. ప్రజలు నమ్మవద్దన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో రెండున్నర సంవత్సరాల కాలంలో ఎన్నికలలో ఇచ్చిన వాగ్దానాలు నెరవేర్చుతూ వచ్చామని తెలిపారు. కోటి పది లక్షల కుటుంబాలకు ఉచితంగా సన్నబియ్యం అందిస్తున్నామని ఉపముఖ్యమంత్రి తెలిపారు. ప్రతి కుటుంబానికి 10 లక్షల రూపాయల ఆరోగ్య బీమా ఇస్తున్నామన్నారు. మహిళా సంఘాలకు వడ్డీ లేని రుణాలు, నిరుపేదలకు 22 వేలకోట్ల రూపాయలతో ఇందిరమ్మ ఇళ్లు నిర్మించామని చెప్పారు. రైతు రుణమాఫీ, రైతుభరోసా కింద వేలకోట్ల రూపాయలు చెల్లించామని తెలిపారు. మహిళల ఉచిత బస్సుకు 13వేల కోట్ల రూపాయలు చెల్లించామన్నారు. కేంద్ర ఎన్నికల సంఘం ప్రవేశపెట్టిన 'సర్' ప్రమాదకరమైందని అన్నారు. బూత్ లెవల్ ఏజెంట్లు ఓటు హక్కుపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఓటు హక్కు ఎంతో విలువైనదన్నారు. పోలింగ్ సిబ్బందికి సమగ్రమైన సమాచారం అందించాలన్నారు. జూన్ 30వ తేదీన మధిర నియోజకవర్గం చింతకాని మండలం జగన్నాధపురంలో జరిగే రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలని ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పిలుపునిచ్చారు. రెండున్నర సంవత్సరాల కాలంలో రైతు భరోసాకు 36 వేల కోట్ల రూపాయలు అందించిన ఘనత రేవంత్ రెడ్డి ప్రభుత్వానిది అని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. రైతులు పండించిన వరి, మొక్కజొన్న పంటలకు గిట్టుబాటు ధర కల్పించి రైతులను ఆదుకున్న ప్రభుత్వం కాంగ్రెస్ ప్రభుత్వమన్నారు. కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చి రైతులకు అవసరమైన ఎరువులను అందించామని చెప్పారు. ఈ నెల 30వ తేదీన డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ఆధ్వర్యంలో జరిగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రైతు ఆశీర్వాద సభను విజయవంతం చేయాలన్నారు. రైతులను ఆదుకోవడంలో గత బీఆర్ఎస్ ప్రభుత్వం విఫలమైందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు విమర్శించారు. ఈ సమావేశంలో ఎమ్మెల్యే మాలోత్ రాందాసు నాయక్, రాష్ట్ర కళల సంస్థ చైర్మన్ నాయుడు సత్యనారాయణ, గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు, జిల్లా అధ్యక్షుడు నూత సత్యనారాయణ, సుడా చైర్మన్ పువ్వాళ్ల దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

## తుంగభద్ర జలాల్లో తెలంగాణకు అన్యాయం

సూచించారు. ఈ మేరకు బుధవారం సీఎం రేవంత్ రెడ్డికి రాసిన లేఖను హరీశ్ రావు విడుదల చేశారు. 'సమైక్య పాలనలో తెలంగాణకు జరిగిన అతిపెద్ద అన్యాయాల్లో నీళ్ల దోపిడీ ఒకటన్నారు. కృష్ణా, గోదావరి జలాల్లో తెలంగాణకు రావాల్సిన వాటాను దశాబ్దాల పాటు దోచుకోవడంతో లక్షల ఎకరాలు బీడు భూములుగా మారాయి. ఆ అన్యాయాలకు వ్యతిరేకంగా పోరాడి తెలంగాణ రాష్ట్రాన్ని సాధించుకున్నాం. రాష్ట్రం ఏర్పడిన తర్వాత బీఆర్ఎస్ ప్రభుత్వం గోదావరి, కృష్ణా జలాలను తెలంగాణ భూములకు మళ్లించి కరవును పారద్రోలి, పాలమూరు వంటి వలసల జిల్లాలను పచ్చని పంటలతో కళకళలాడేలా చేసిందన్నారు. అయితే కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత తెలంగాణ జల హక్కులను పరిరక్షించాల్సిన బాధ్యతను విస్మరించి, రాష్ట్ర ప్రయోజనా లను పక్క రాష్ట్రాల వద్ద తాకట్టు పెట్టే ప్రమాదకరమైన విధానాలను అవలంబిస్తోంది. నదుల అనుసంధానం పేరుతో గోదావరి జలాలను తమ రాష్ట్రానికి మళ్లించే ప్రయత్నం చేస్తున్న ఆంధ్రప్రదేశ్‌కు పూర్తి సహకారం అందిస్తున్న మీరు, ఇప్పుడు తుంగభద్రపై కర్ణాటక ప్రభుత్వం చేపడుతున్న అక్రమ ప్రాజెక్టుల విషయంలో కూడా అదే ద్రోహ బుద్ధితో వ్యవహరిస్తున్నారని పేర్కొన్నారు. పాలమూరు బిడ్డనని చెప్పుకునే మీరు, అదే ప్రాంతంలోని రైతాంగం భవిష్యత్తును ప్రమాదంలోకి నెట్టడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. తుంగభద్రపై కర్ణాటక నిర్మిస్తున్న కురిడి , చిక్కాలపర్వి, చిక్కాలమంచి బ్రిడ్జ్-కమ్-బరాజ్‌లకు మీ ప్రభుత్వం సమ్మతి తెలిపిందా? 2025 జులై 18న కొడంగల్ లిఫ్ట్‌కు కర్ణాటక ఎన్‌వోసీ ఇవ్వడం వెనుక జరిగిన మతలబు ఏమిటి? ఏడాది కాలంగా కర్ణాటక అక్రమ నిర్మాణాలపై అభ్యంతరం చెప్పలేదంటే పరోక్షంగా వాటికి మీరు అనుమతించినట్లేనా? తెలంగాణ నీటిని కర్ణాటకకు తాకట్టు పెట్టే అధికారం మీకు ఎవరు ఇచ్చారని నిలదీసారు. రాజోలిబండ డైవర్షన్ స్కీమ్ (ఆర్డీఎస్) ఎగువన కర్ణాటక చేపడుతున్న కురిడి ఎత్తిపోతల పథకం చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే ఆర్డీఎస్‌కు రావాల్సిన ప్రవాహాలు తీవ్రంగా తగ్గిపోతాయన్న విషయం మీకు తెలియదా? రాయచూర్ జిల్లాలో 2 టీఎంసీల నీటిని తరలించే కురిడి ఎత్తిపోతల పథకాన్ని రూ.85 కోట్లతో కర్ణాటక అక్రమంగా నిర్మిస్తున్నంటే ఎందుకు అడ్డుకోవడం లేదు? ఇప్పటికే ఈ ప్రాజెక్టు ఇన్టేక్ నిర్మాణాలు 60 శాతం వరకు పూర్తి అయితే మీరు, మీ ప్రభుత్వం మొద్దు నిద్ర పోతున్నదా? ఈ అక్రమ ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ కనీసం ఒక్క లేఖ కూడా ఎందుకు రాయలేదని నిలదీసారు. సెంట్రల్ వాటర్ కమిషన్ (సీడబ్ల్యూసీ), కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ), తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల అనుమతులు లేకుండానే కర్ణాటక తుంగభద్రపై ఇష్టారాజ్యంగా ప్రాజెక్టులు నిర్మిస్తుంటే మీరు, మీ ప్రభుత్వం ఎందుకు అడ్డుకోవడం లేదన్నారు. కర్ణాటక తనకు కేటాయించిన పరిమితులను దాటి అదనపు సాగు చేస్తోంది. ఆర్డీఎస్‌లో కర్ణాటక వాటా1.2 టిఎంసి మాత్రమే. కాని సగటున 5 టీఎంసీల నీటిని వినియోగిస్తున్నట్లు గణాంకాలు తెలియజేస్తున్నాయి. ప్రస్తుతం రాజోలిబండ ఆనకట్టకు 100 మీటర్ల ఎగువన అక్రమంగా కర్ణాటక నిర్మిస్తున్న కురిడి లిఫ్ట్, చిక్కాల పర్వి, చిక్కాలమంచి బ్యారేజీలు పూర్తయితే తెలంగాణ వాటా మరింత తగ్గిపోతుంది. ఆర్డీఎస్ పూర్తిగా నిర్వీర్యమయ్యే ప్రమాదం ఏర్పడుతుంది.

**LOST PASSPORT**

I DALLI RAMASWAMY, Passport No. B7781964 was lost at Quthbullapur on 21.06.26, whoever finds it, Please contact me as per the details in the Passport or sumit it at Passport office, Hyderabad.

Contact: 9059247935

## ఏపీలో సువర్ణ అధ్యాయం మొదలైంది

అన్నారు. చమురు తర్వాత దేశంలో ఎక్కువ దిగుమతి అయ్యేది బంగారమే అని తెలిపారు. రాయలసీమలో సిరులు పండించేందుకు శరవేగంగా సాగునీటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నామని చెప్పారు. ఏడాదికి టన్ను బంగారం ఉత్పత్తి అవుతుందని తెలిపారు. ప్రస్తుతం 400 కిలోల సామర్థ్యంతో బంగారం ఉత్పత్తి అవుతుందని, భవిష్యత్‌లో 1000 కిలోల బంగారం ఉత్పత్తి చేయనున్నట్లు వెల్లడించారు. రెండో యూనిట్‌తో కలిపి 50 టన్నుల బంగారం ఉత్పత్తి అవుతుందన్నారు. ఇప్పటికే 800 మందికి ఉద్యోగాలు లభించాయని.. త్వరలో మరో 1500 మందికి ఉపాధి లభించనుందన్నారు. భవిష్యత్‌లో 5 వేల మందికి స్వర్ణగిరి గోల్డ్ మైన్స్‌లో ఉపాధి లభిస్తుందని సీఎం పేర్కొన్నారు. గోల్డ్ మైనింగ్‌తో జొన్నగిరిలో పూర్వ వైభవానికి శ్రీకారం చుట్టామని అన్నారు.రాయలసీమను రతనాల సీమగా మార్చడం జొన్నగిరి నుంచే ప్రారంభమవుతుంది. ఈ ప్రాంతాన్ని గతంలో సువర్ణగిరి అని పిలిచేవారు. అశోకుడి నాలుగో రాజధాని ఇది. జొన్నగిరిని సువర్ణగిరిగా మార్చుకుందామా? వందల ఏళ్ల క్రితమే ఈ ప్రాంతం బంగారం, రత్నాలతో నిండింది. అశోకుడి శాసనాలు ఈ ప్రాంత వైభవాన్ని చాటి చెబుతున్నాయి. సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి సీమను కాపాడాలనే ఆలోచన చేసిన వ్యక్తి ఎన్టీఆర్. ఆయన నిర్ణయంతో రాయలసీమ ప్రాంతానికి ప్రాణం పోశాం అని అన్నారు. ఇప్పటికి 400 కిలోల సామర్థ్యంతో ప్రారంభమైంది. భవిష్యత్తులో వెయ్యి కిలోలకు చేరుతుంది. ఇప్పటికే 800 ఉద్యోగాలు వచ్చాయి. త్వరలో 1500 మందికి ఉపాధి కల్పిస్తాం. భవిష్యత్తులో 5వేల మందికి ఈ గోల్డ్ మైన్స్‌లో ఉపాధి దొరుకుతుంది. జొన్నగిరి రాష్ట్రానికి ఆదర్శంగా తయారవుతుంది. ఈ ప్రాంతానికి గ్రోత్ ఇంజిన్‌గా మారుతుంది. ఇక్కడ నగల తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని కోరుతున్నా. స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌కు ఆంధ్రప్రదేశ్ చిరునామాగా మారింది. రాయలసీమకు ఇన్ని పరిశ్రమలు వస్తాయని అనుకున్నారా?దేశంలోనే అతిపెద్ద డ్రోన్ సిటీ కర్నూలులో వస్తోంది. వీలైనంత త్వరగా కర్నూలుకు హైకోర్టు బెంచ్ తీసుకొస్తాం. 2028 నాటికి రాయలసీమలో స్టీల్ ప్లాంట్ ప్రారంభిస్తాం అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రంలో విధ్వంస పాలన నడిచింది. వేంకటేశ్వరస్వామికి అపచారం జరిగితే శిక్షించాలా..లేదా? స్వామివారి ప్రసాదంలో కల్తీ నెయ్యి కలిపారు. ఇప్పుడు దేవుడి దగ్గరకు వెళ్లి దండాలు పెడుతున్నారు. దేవుడిని నమ్మే ఏ వ్యక్తి కూడా వాళ్లను క్షమించడు. ప్రజలకు ఏవిధంగా మంచి చేయాలనేదే నా ఆలోచన. గొడ్డలి పార్టీ విషాన్ని చిమ్ముతోంది. నేరాలు చేయడంలో ఆ పార్టీ నేతలు సమర్థులు. సాయికృష్ణ ఘటనకు కూడా కులం రంగు పులిమారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌పై నోరుపారేసుకుంటున్నారు.

అలాంటి వారి నోరు మూయించే శక్తి మాకుంది. మెగా డీఎస్సీ పూర్తయిన ఏడాది తర్వాత పేపర్ లీకైందని ఆరోపణలు చేస్తున్నారు. దీనిపై చర్చకు రమ్మని మంత్రి లోకేశ్ సవాల్ విసిరితే రాలేదు. ఎన్నికల్లో హామీ ఇవ్వకపోయినా దాదాపు 11వేల మంది ఉద్యోగులను సీపీఎస్ నుంచి ఓపీఎస్‌కు తీసుకొచ్చి వారి జీవితాల్లో వెలుగులు నింపాం' అని చంద్రబాబు అన్నారు. కులమతాల పేరుతో గొడ్డలి పార్టీ విషం చిమ్ముతోందన్నారు. నేరాలు, ఘోరాలు చేసి రాజకీయ రంగు పులుముతున్నారని ÷ర్ అయ్యారు. రప్పా రప్పా రాజకీయం తప్ప గొడ్డలి పార్టీ చేసిందేమీలేదన్నారు. మళ్లీ వస్తాం.. గొడ్డలితో రప్పా రప్పా ఆడిస్తామంటున్నారని సీఎం చంద్రబాబు తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.

విజన్ ఆంధ్ర
తెలుగు దినపత్రిక
VISION ANDHRA TELUGU DAILY

## సంపాదకీయం

# అయోధ్య రామయ్యా..ఏమిటీ అపచారం !

అందరి బంధువయ్యా...అయోధ్య రామయ్యా అంటూ పాడుకునే హిందువులకు అయోధ్య అన్నా, రాముడన్నా విడదీయరాని బంధం ఉంది. ఎవరికి వారు అయోధ్య రాముడు తమవాడని భావిస్తారు. అందుకే అయోధ్య ఆలయ నిర్మాణం కోసం ఏళ్లుగా ఎదురు చూశారు. కోట్ల రూపాయలు ఆలయం కోసం విరాళంగా ఇచ్చారు. ఇంతటి పవిత్ర కార్యక్రమం జరిగి, ఆలయ నిర్మాణం పూర్తయిన తరవాత ఇప్పుడు నిధుల దారిమళ్లింపు గోల అందరినీ కలచి వేస్తోంది. నిజంగానే ఇది ఘోరమైన అపచారంగానే భావించాలి. రాముడిని నమ్మి భక్తులు భక్తితో సమర్పించిన కానుకులను కాజేస్తే ఎలా? రాముడి తిరిగొచ్చాడంటూ.. దేశవ్యాప్తంగా జరిగిన సంబరాలను అప్పుడే మరచిపోలేదు.అయోధ్య రామాలయానికి భక్తులు సమర్పించిన విరాళాలు, కానుకల నిర్వహణలో భారీ అక్రమాలు జరిగినట్లు వెల్లడయ్యింది. ఈ వ్యవహారంపై విచారణ జరుపుతున్న ప్రత్యేక దర్యాప్తు బృందం విరాళాల సొమ్ము చోరీకి గురైనట్లు బలమైన ఆధారాలను కనుగొంది. దీనికి సంబంధించిన ప్రాథమిక నివేదికను త్వరలో ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్‌కు సిట్ సమర్పించనుంది. కొన్ని రోజులుగా అయోధ్యలో సిట్ బృందం ముమ్మరంగా విచారణ జరిపింది. ఆలయ హుండీల నుంచి సేకరించిన నగదును లెక్కించే సమయంలో సీసీటీవీ ఫుటేజ్‌పై చేతివాటం ప్రదర్శించినట్లు దర్యాప్తులో తేలింది. కొన్ని కీలకమైన సీసీటీవీ దృశ్యాలను కావాలనే డిలీట్ చేశారనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. భక్తులు సమర్పించిన బంగారం, వెండి, వజ్రాభరణాల ను నకిలీ వాటితో మార్చేసారనే ఆరోపణలపై సిట్ లోతుగా విచారించింది. నిర్లక్ష్యంతో పాటు దీని వెనుక పెద్ద కుట్ర కోణం దాగి ఉందనే దిశగా అధికారులు దర్యాప్తు సాగిస్తున్నారు.అయోధ్య రామాలయానికి రోజూ పెరుగు తున్న భక్తుల తాకిడి చూసి.. పులకిస్తున్న మనసులు ఇంకా పూర్తిగా తేరుకోలేదు. ఇంతలోనే మహాపచారం జరిగిపోయిందన్న వార్త కలవరపెడుతోంది. భక్తులు ఎంతో భక్తిశ్రద్ధలతో సమర్పిస్తున్న విరాళాలు, కానుకలు మాయమయ్యా యన్న ఆరోపణలు అయోధ్యలో కలకలం రేపాయి. మొదట్లో ఇవి ఉట్టి ఆరోపణలే అని భావించిన వారు కూడా..తర్వాత సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించడంతో అంతా దిగ్భ్రమకు గురయ్యారు. చివరకు సిట్ ప్రాథమిక విచారణలోఅడుగడుగునా నిర్లక్ష్యం నిజమేనని బయటపడటం.. సీసీ టీవీ ఫుటేజ్‌లో మార్పులు.. అన్నీ కలిసి రామభక్తుల మనోభావాల్ని తీవ్రంగా దెబ్బతీశాయనే చెప్పాలి. ఎంతో భక్తితో, నమ్మకంతో, విశ్వాసంతో రాముడి ఆలయానికి ఉపయోగపడతాయనే ఉద్దేశంతో ఇచ్చిన విరాళాలు కొందరు స్వార్థపరుల చేతిలోకి వెళ్లిపోయాయని, ఆలయ వ్యవహారాలు చూసే ట్రస్టే.. కంచే చేను మేసిన చందంగా వ్యవహరి స్తోందని తెలిసి.. భక్తులు నిర్ఘాంతపోతున్నారు. దీనిపై పెద్దగా ప్రచారం రాకుండా చూస్తున్న తీరు ఇంకా కలచివేస్తోంది. ఐదు వందల సంవత్సరాల తర్వాత రామాలయం కొలువుదీరిందని ఓవైపు భక్తులో సంతోషపడుతుంటే.. మరోవైపు ఆలయంలో జరిగిన నిధుల గోల్‌మాల్ వ్యవహారం హిందువుల మనోభావా లను దెబ్బతీసే వ్యవహారంగానే చూడాలి. మొదట్లో నిధులు దారిమళ్లాయనే ఆరోపణలు వచ్చినప్పుడు.. వాటిని రాజకీయ ప్రేరేపితంగా కొట్టిపారేసే ప్రయత్నం జరిగింది. కానీ భక్తుల నుంచి అభ్యంతరాలు రావడంతో.. యూపీ సర్కారు సిట్ దర్యాప్తుకు ఆదేశించింది. యోగి ఆదిత్యనాథ్ కూడా ఈ విషయంలో సీరియస్‌గానే ఉన్నట్లుగా కనిపిస్తోంది. సిట్ దర్యాప్తులో అన్నీ తెలుస్తాయని, కొంచెం ఓపిక పట్టాలని ఆయన చేసిన విజ్ఞప్తిని బట్టి తెలుసుకోవచ్చు. అయితే ఇదంతా ఒక ఎత్తయితే..వచ్చేయేడు యూపి ఎన్నికలకు ముందు జరిగిన ఈ వ్యవహారం యోగా ప్రభుత్వానికి మచ్చలాంటిదే. మరోవైపు రాముడి పేరు చెప్పి.. పెద్ద మొత్తంలో సొమ్ము స్వాహా చేశారని ప్రతిపక్షాలు విరుచుకుపడుతున్నాయి. వచ్చే ఏడాది యూపీ ఎన్నికల తరుణంలో..రామాలయంలో నిధుల గోల్‌మాల్ వ్యవహారం..సంచలనం సృష్టిస్తోంది. ఈ భారీ అక్రమాలకు సంబంధించి సిట్ ఇప్పటివరకు ట్రస్ట్ అధికారులు, మేనేజ్‌మెంట్ సిబ్బంది, బ్యాంక్ ఉద్యోగులతో సహా దాదాపు 150 మందిని ప్రశ్నించింది. ట్రస్ట్ కార్యనిర్వాహకుడు అనిల్ మిశ్రా, కన్‌స్ట్రక్షన్ ఎయిడ్ గోపాల్ రావు పాత్రలపై తీవ్ర అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ట్రస్ట్ ప్రధాన కార్యదర్శి చంపత్ రాయ్ కూడా ప్రస్తుతం నిఘా నీడలో ఉన్నారు. లెక్కింపు ప్రక్రియలో పాల్గొన్న ఎస్‌బీఐ, టీసీఎస్‌లకు చెందిన ఆరుగురు ఉద్యోగుల ను కూడా ప్రశ్నించారు. ఈ వ్యవహారంలో తిన్ను యాదవ్ అనే వ్యక్తితో పాటు కొందరు బ్యాంక్ సిబ్బందిపై ఎఫ్ఐఆర్‌లు నమోదయ్యే అవకాశం ఉంది. భక్తులు ఎంతో భక్తి శ్రద్ధలతో సమర్పించే నగదు, బంగారం, వెండి, ఇతర ఖరీదైన విరాళాలు అక్రమార్కుల భోజ్యం అయినట్టు దర్యాప్తు సంస్థ గుర్తించింది. ముఖ్యంగా ఇంత ప్రతిష్టాత్మకమైన పెద్ద ఆలయ నిర్వహణలో ముఖ్య విభాగాలు నిర్వహించే అధికారులు, ఉద్యోగులకు జవాబుదారీతనం లేకపోవడం, వారిపై పర్యవేక్షణ, నిఘా లోపించడం, సీసీటీవీ ఫుటేజీలు అదృశ్యం కావడం దర్యాప్తు సంస్థను ఆశ్చర్యపరిచింది.ట్రస్ట్‌కు చెందిన కీలక అధికారులు దర్యాప్తు పూర్తయ్యే వరకు అయోధ్య విడిచి వెళ్లకూడదని సిట్ ఆదేశించింది. ఆలయ నిర్వహణలో పారదర్శకత కోసం కాశీ విశ్వనాథ్ ఆలయం తరహాలోనే ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌ను నియమించాలని, ప్రభుత్వ అధికారుల పర్యవేక్షణను పెంచాలని సిట్ సూచించనుంది. అలాగే విరాళాల లెక్కింపునకు బ్యాంకులు కేవలం రెగ్యులర్ ఉద్యోగులను మాత్రమే నియమించాలని, క్రమం తప్పకుండా ఆడిటింగ్ నిర్వహించాలని నివేదికలో సిఫార్సు చేయనున్నట్లు చెబుతున్నారు. అయోధ్య విరాళాలపై ఏర్పడిన వివాదంపై యూపీ సీఎం యోగి ఆదిత్యానాథ్ స్పందించారు. ప్రజలు 15 రోజులు ఆగాలని కోరారు. నిధుల దుర్వినియోగానికి బాధ్యులు ఎవరైనా, ఎంతటివారైనా వదిలిపెట్టబోమంటూ హామీనిచ్చారు. మొత్తంగా రాముడి పేరు చెప్పి నిర్వాహకులే టోపీ పెట్టడం ఇప్పుడు తీవ్ర చర్చగా మారింది.

## నూతన కలెక్టరేట్లో పలు నిర్మాణాలకు శంకుస్థాపన

**- హాజరైన ఎమ్మెల్యే, మేయర్, సుడా చైర్మన్**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో) జూన్ 24..శాతవాహన అర్బన్ డెవలప్మెంట్ కరీంనగర్ ఆధ్వర్యంలో సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం వద్ద హెలిప్యాడ్ నిర్మాణం, సర్వీస్ రోడ్డు, హెలిప్యాడ్ కు ప్రవేశ ద్వారం ఏర్పాటు చేసేందుకు బుధవారం శంకుస్థాపన కార్యక్రమం నిర్వహించారు. 53 లక్షల రూపాయల సుడా నిధులతో చేపట్టనున్న ఈ నిర్మాణాలకు ఎమ్మెల్యే గంగుల కమలాకర్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్, కూడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి శంకుస్థాపన చేశారు. అదేవిధంగా కొత్త కలెక్టరేట్ నుండి ఈశాన్యం గేట్ వరకు రహదారి అభివృద్ధి పనులు గార్డెన్ సుందరీకరణ పనులకు శంకుస్థాపన చేశారు. ఈ రెండు పనులను కోటి ఇరవై లక్షలతో చేపట్టనున్నారు. ఈ సందర్భంగా శంకుస్థాపన కార్యక్రమానికి హాజరైన ప్రజా ప్రతినిధులు మాట్లాడుతూ నిర్ణీత కాలవ్యవధిలోగా నాణ్యతా ప్రమాణాలతో పనులు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. కరీంనగర్ సమగ్ర అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నామని తెలిపారు. కరీంనగర్ జిల్లా వాసులకు ఇలాంటి మౌలిక వసతుల కల్పన ఎంతో దోహదపడుతుందని పేర్కొన్నారు. పనుల్లో ఎక్కడా నాణ్యత లోపించకుండా, పారదర్శకంగా, నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. అభివృద్ధి పనులకు ప్రజలు కూడా సహకరించాలని ఆయన కోరారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా, అడిషనల్ కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ ఆర్టిఏ మెంబర్ పడాల రాహుల్ ఆర్ అండ్ బి ఈ నరసింహ చారి పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా మెరుగైన వైద్య సేవలే లక్ష్యం

**- ప్రత్యేక అధికారి డా.గౌరవ్ ఉప్పల్**



ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జూన్ 24,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ ఆసుపత్రుల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక శాఖ కార్యదర్శి,ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక నల్గొండ జిల్లా స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ గౌరవ్ ఉప్పల్ అన్నారు.ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణ సమీక్ష నిమిత్తం బుధవారం జిల్లాకు వచ్చిన ఆయన నల్గొండ ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రిని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ-ఔషధి మెడిసిన్,టీ-హబ్ డయాగ్నస్టిక్,రేడియాలజీ,మేల్ సర్జికల్ వార్డ్,ఐసీయూ,సీటీ స్కాన్ విభాగాలను పరిశీలించి యంత్రాల పనితీరు,రోగుల వివరాలు అడిగి తెలుసుకున్నారు.వార్డుల్లో రోగులతో నేరుగా మాట్లాడి సమస్యలు అడిగారు.రైల్వే స్టేషన్ సమీపంలోని స్టోర్‌ను తనిఖీ చేసి మందుల సరఫరా,నిల్వ,పంపిణీ విధానాన్ని రికార్డుల ద్వారా పరిశీలించారు.పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేసి ఓపీ,ఈ-ఆరోగ్యం, హెచ్ ఎం ఎస్,ఈ-ఔషధ ద్వారా మందుల పంపిణీ,డేటా ఎంట్రీ వివరాలను మెడికల్ ఆఫీసర్ డా.ఫిరధౌసి,ఫార్మసిస్ట్ ద్వారా తెలుసుకున్నారు.సేవలపై పూర్తి నివేదిక ఇవ్వాలని ఆదేశించారు."నేను ఎం ఎస్ ఐ డి సి,ఎండి గా పనిచేస్తున్నందున ఆసుపత్రుల్లో వైద్య సదుపాయాలు,పరికరాలు,మందుల సరఫరా పరిశీలిస్తున్నాను.ఇక్కడి సేవలు తెలుసుకుని ఇంకా మెరుగైన సేవలకు అవసరమైన పరికరాలు గుర్తించి సరఫరా చేస్తాం.నల్గొండ ప్రధాన ఆసుపత్రిలో ఎమ్మారై స్కానింగ్ కావాలని డాక్టర్లు కోరారు,సిటీ స్కాన్ రిపేర్ అవసరమని తెలిపారు.కలెక్టర్ నుంచి నివేదిక తెప్పించుకుని తగు చర్యలు తీసుకుంటాం.వివరాలన్నీ రాష్ట్ర ప్రభుత్వానికి సమర్పిస్తాం"అని మీడియాతో అన్నారు.ఆయన వెంట బియ్యం& డా.రాహుల్, ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి డాక్టర్ నగేష్ తదితరులు ఉన్నారు.

## కష్టానికి తగిన ఫలితం ఇచ్చిన టీ ఎస్ రాష్ట్ర ఆర్యా వైశ్య మహాసభ.

**- పెండ్యాల విజయభాస్కర్ ను సత్కరించిన కొదుమూరి శ్రీనివాసరావు.**



జూలూరుపాడు జూన్ 25 విజన్ ఆంధ్ర తెలంగాణ రాష్ట్ర ఆర్యవైశ్య మహాసభ కార్యదర్శిగా నియమితులై ఇటీవల పదవి ప్రమాణ స్వీకారం చేసిన పెండ్యాల విజయభాస్కర్ ను బుధవారం కొత్తగూడెం జిల్లా కాంగ్రెస్ పార్టీ కోశాధికారి కొత్తగూడెం పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కొ దుమూరి శ్రీనివాసరావు శాలువతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాసరావు మాట్లాడుతూ నూతన కార్యవర్గంలో పదవి లభించడం అయన చేసిన కష్టానికి ఫలితంగాచెప్పుకోవచ్చు అన్నారు మనప్రాంతం నుండి పదవిని అందుకోవడం అభినందనీయమని, భవిష్యత్తులో మరెన్నో ఉన్నతమైన పదవులు అధిరోహించాలని ఆయన కోరారు ఆర్యవైశ్య మహాసభ అభివృద్ధితోపాటు పేద ఆర్యవైశ్యుల సంక్షేమానికి కృషి చేయాలని ఆకాంక్షించారు.

## తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు మంజూరు:



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 24 (విజన్ ఆంధ్ర (ప్రతినిధి): తెలంగాణ ప్రభుత్వం నుండి బీరప్ప మల్టీ పర్పస్ హాల్ నిర్మాణానికి రూ.1 కోటి నిధులు, మంత్రి, దుద్దిళ్ల శ్రీధర్ బాబు ద్వారా, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి సహకారంతో మంజూరు కావడం పట్ల, ఈరోజు బాచుపల్లి కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి ని మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సత్కరించి కృతజ్ఞతలు తెలియచేసిన కురుమ సంగం కమిటీ సభ్యులు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కె.ఎం. గౌరీష్, కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కుర్మ సంఘ అధ్యక్షులు బట్ట బాలకృష్ణ, సూరారం విలేజ్ చైర్మన్ బట్ట నర్సింహా, ఆలయ అధ్యక్షులు బాలయ్య, పెంటయ్య, సెల్విర్రోజి సత్తయ్య, చిన్న సత్తయ్య, బాలరాజ్, కుమార్, చంద్రశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

# కరీంనగర్ జిల్లాను ప్రభుత్వ పథకాల అమలులో అగ్రభాగాన నిలపండి

**- మానవీయ కోణంలో ప్రజల సమస్యలు పరిష్కరించండి..**

**- నిత్యం ప్రజలతో మమేకం కావాలి..**

**- అర్హులైన వారందరికీ వివిధ అభివృద్ధి , సంక్షేమ పథకాలు అందించాలి..**

**- ప్రజలకు సేవ చేయడం అధికారుల అదృష్టంగా భావించాలి**

**- సమస్యలను గుర్తించడం, పరిష్కరించడం నిరంతర ప్రక్రియగా కోన సాగాలి..**



కరీంనగర్ (విజన్ ఆంధ్ర బ్యూరో),జూన్ 24: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వివిధ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల అమలులో కరీంనగర్ జిల్లాను అగ్రభాగాన నిలపాలని రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా అధికారులను ఆదేశించారు.బుధవారం నాడు రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ సందీప్ కుమార్ సుల్తానియా హైదరాబాద్ నుండి నేరుగా కరీంనగర్ కలెక్టరేట్ కి చేరుకున్నారు అనంతరం కలెక్టరేట్ లో రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి, జిల్లా స్పెషల్ ఆఫీసర్ అధ్యక్షతన ప్రజాపాలనప్రగతి ప్రణాళిక జిల్లా స్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో మమేకమై వారి సమస్యలను గుర్తించి పరిష్కరించడమే అధికారుల ప్రధాన లక్ష్యంగా ఉండాలని అన్నారు. ప్రజలకు సేవలు అందించడం అధికారుల అదృష్టంగా బావించాలని అన్నారు. ప్రజాపాలన కార్యక్రమం ద్వారా గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని అన్నారు . జిల్లా యంత్రాంగం సమన్వయంతొ పని చేయాలని సమస్యల పరిష్కారం ఒక నిరంతర ప్రక్రియగా కొనసాగాలని అని అన్నారు ,రాష్ట్ర ప్రభుత్వం అనేక వినూత్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ప్రవేశపెట్టిందని, ప్రజలకు పాలనను చేరువ చేసేందుకే ప్రజాపాలనప్రగతి ప్రణాళికను అత్యంత ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని తెలిపారు.ప్రభుత్వ పథకాల అమలులో అధికారులు విజయవంతం చేయడమే కాకుండా , అధికారులు పథకాల సద్వినియోగం పై విస్తృత అవగాహన కల్పించాలని సూచించారు. రాష్ట్రా స్థాయి లో ప్రభుత్వ పథకాల అమలు పై నిరంతరం పర్యవేక్షించడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో పాటు కాంట్రాక్ట్, ఔట్‌సోర్సింగ్ సిబ్బందికి కూడా ప్రతి నెల ఒకటో తేదీన జీతాలు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని తెలిపారు. ప్రజాపాలనప్రగతి ప్రణాళికను కరీంనగర్ జిల్లాలో విజయవంతంగా నిర్వహించిన జిల్లా యంత్రాంగాన్ని ఆయన అభినందించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు, కలెక్టర్, అధికారులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా పూర్తి చేశారని కొనియాడారు అర్హులైన ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు చేరేలా కృషి చేయాలని సూచించారు. మహిళల సాధికారతకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని, ఇందిరా మహిళా శక్తి క్యాంటీన్లు, సోలార్ పవర్ ప్లాంట్లు, పెట్రోల్ బంకులు, అద్దె బస్సుల నిర్వహణ వంటి కార్యక్రమాల ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధికి తోడ్పడుతోందని తెలిపారు. గ్రామాలు, పట్టణాల్లో తాగునీరు, పారిశుద్ధ్యం, విద్యుత్, ఇతర మౌలిక వసతుల కల్పనకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు ఎలాంటి ఇబ్బందులు పడకుండా చూడాల్సిన బాధ్యత అధికార యంత్రాంగానిదేనని స్పష్టం చేశారు. అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలుకు నిధుల కొరత లేదని, రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పింఛన్లు, ఇందిరమ్మ ఇండ్లు తదితర పథకాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా అధికారులు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా 99 రోజుల ప్రజాపాలనప్రగతి ప్రణాళిక కార్యక్రమంపై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మార్చి 6 నుంచి జూన్ 12 వరకు 10 ప్రధాన అంశాలపై జిల్లాలో కార్యక్రమాలు విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు. పరిశుభ్రత, ఫైళ్ల పరిష్కారంలో భాగంగా 4,290 ఫైళ్లు పరిష్కరించగా, 3,835 దరఖాస్తులు స్వీకరించామని, అరైవ్‌అలైవ్ కార్యక్రమంలో 318 గ్రామపంచాయతీల్లో రోడ్డు భద్రత కమిటీలు ఏర్పాటు చేయడం జరిగింది అని అన్నారు . వ్యవసాయ రంగంలో 1.93 లక్షల మంది రైతులకు రూ.143.35 కోట్లు రైతు భరోసా, 206 రైతు కుటుంబాలకు రూ.14 కోట్ల రైతు బీమా అందించగా, 319 కొనుగోలు కేంద్రాల ద్వారా మూడు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.554 కోట్లు రైతుల ఖాతాల్లో జమ చేయడం జరిగింది అని అన్నారు . సంక్షేమ పథకాల కింద 45,920 కొత్త రేషన్ కార్డులు మంజూరు చేయగా, 96,775 కొత్త సభ్యుల పేర్లు చేయడం జరిగింది అని అన్నారు . మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు రూ.334 కోట్ల ప్రయోజనం, గృహజ్యోతి ద్వారా రూ.153.10 కోట్ల లబ్ధి కల్పించామని , ఇందిరమ్మ ఇండ్ల పథకంలో 10,209 మంది లబ్ధిదారులను ఎంపిక చేయగా, 7,220 ఇళ్లు నిర్మాణ దశలో ఉన్నాయి అని అన్నారు. మెగా జాబ్ మేళాలో 292 మంది యువతకు ఉద్యోగ అవకాశాలు లభించాయాని, ప్రజావాణి ద్వారా వచ్చిన 2,995 దరఖాస్తుల్లో 2,144 దరఖాస్తులు పరిష్కరించినట్లు కలెక్టర్ వివరించారు. బడిబాట కార్యక్రమం ద్వారా 9435 మంది ని ప్రభుత్వ పాఠశాల విద్యార్థులను చేర్పించడం జరిగింది అని అన్నారు. ప్రజలు, ప్రజాప్రతినిధులు, అధికారుల సమన్వయంతో జిల్లాలో ప్రజాపాలనప్రగతి ప్రణాళిక విజయవంతమైందని, కలెక్టర్ తెలిపారు. కలెక్టర్ పవర్ ప్రజెంటేషన్ విశేషంగా ఆకట్టుకుంది.పోలీస్ కమిషనర్ గౌష్ ఆలం , నగరపాలక సంస్థ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తో పాటు ఆయా శాఖల అధికారులు తమ తమ శాఖలకు సంబంధించి 99 రోజుల కార్యక్రమం పై ప్రజెంటేషన్ ఇచ్చారు.

# చర్ల మండలంలో ఘోర ప్రమాదం

**- మర్రిచెట్టును ఢీకొట్టిన లారీ, - క్యాబిన్‌లో చిక్కుకున్న డ్రైవర్**



చర్ల, జూన్ 24 (విజన్ ఆంధ్ర): భద్రాద్రి కొత్తగూడెం జిల్లా చర్ల మండలంలోని దేవరపల్లి గ్రామ సమీపంలో బుధవారం ఘోర రోడ్డు ప్రమాదం సంభవించింది, వేగంగా దూసుకువచ్చిన ఒక అశోక్ లేలాండ్ లారీ అదుపు తప్పి, రోడ్డు పక్కన ఉన్న భారీ మర్రిచెట్టును బలంగా ఢీకొట్టింది, క్యాబిన్‌లోనే నలిగిపోయిన డ్రైవర్ ఈ ప్రమాద తీవ్రతకు లారీ ముందు భాగం (క్యాబిన్) పూర్తిగా నుజ్జునుజ్జయింది ఈ ప్రమాదంలో లారీ డ్రైవర్ మహేష్ క్యాబిన్ లోపలే ఇరుక్కుపోయి బయటకు రాలేని పరిస్థితిలో ఉండడం ప్రమాదం ధాటికి తీవ్రంగా గాయపడిన డ్రైవర్‌కు అధిక రక్తస్రావం కావడంతో, అతని పరిస్థితి అత్యంత విషమంగా మారింది , ప్రమాద సమాచారం తెలియగానే దేవరపల్లి గ్రామస్తులు ఘటనా స్థలానికి పరుగులు తీశారు, డ్రైవర్ ప్రాణాలను కాపాడేందుకు వారు చేసిన ప్రయత్నాలు అందరినీ కదిలించాయి. నలిగిపోయిన క్యాబిన్‌ను తొలగించి మహేష్‌ను సురక్షితంగా బయటకు తీసేందుకు స్థానికులు జెసిబిలు, ట్రాక్టర్ల సహాయంతో శతవిధాలా ప్రయత్నం చేసి బయటికి తీసి అంబులెన్స్ ద్వారా చర్ల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాగా, వైద్యులు పరీక్షలు నిర్వహించారు, పరిస్థితి విషమించడంతో భద్రాచలం ఏరియా ఆసుపత్రికి అంబులెన్స్ ద్వారా తరలించారు, విషయం తెలుసుకున్న చర్ల మండల సిఐ రాజు వర్మ ఘటనకు సంబంధించిన వివరాలు సేకరిస్తున్నారు.

## యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న మహమ్మారి 'డ్రగ్స్'

**- వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా**

**- ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు ప్రత్యేక అవగాహన సదస్సు**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : మాదకద్రవ్యాలు అనే మహమ్మారి యువత భవిష్యత్తును నాశనం చేస్తూ సమాజానికి తీవ్రమైన ముప్పుగా మారుతోందని వనపర్తి జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా ఆందోళన వ్యక్తం చేశారు. వనపర్తి జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు జిల్లాలో నిర్వహిస్తున్న 'డ్రగ్స్, మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాల్లో' భాగంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం జరిగింది. షీ టీం, భరోసా కేంద్రం, ఏహెచ్‌టీయూ సంయుక్త ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాలలో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, చిత్రలేఖన పోటీలను ఆయన పరిశీలించి, విద్యార్థులతో స్నేహపూర్వకంగా సంభాషించారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి ఆయన ప్రసంగించారు. నేటి విద్యార్థులే రేపటి భారతదేశ నిర్మాతలని, అందుకే ప్రతి విద్యార్థి డ్రగ్స్‌కు పూర్తిగా దూరంగా ఉండటంతో పాటు తన స్నేహితులను, కుటుంబ సభ్యులను కూడా ఈ మహమ్మారి బారిన పడకుండా కాపాడే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు. పుస్తకాలు, క్రీడలు, కళలు, సృజనాత్మక కార్యక్రమాలు యువతను విజయ మార్గంలో నడిపిస్తాయని.. డ్రగ్స్ వ్యసనం మాత్రం నేరాలు, హింస, మానసిక ఒత్తిడి వైపు నెడుతుందని స్పష్టం చేశారు. ఎవరైనా డ్రగ్స్ వినియోగిస్తున్నట్లు లేదా విక్రయిస్తున్నట్లు తెలిస్తే వెంటనే పోలీసు శాఖకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని అదనపు ఎస్పీ భరోసా ఇచ్చారు. ప్రతి విద్యార్థి 'నా కలలు నా భవిష్యత్తు నా బాధ్యత' అనే భావనతో ముందుకు సాగాలన్నారు. డ్రగ్స్




రహిత సమాజ నిర్మాణం కేవలం పోలీసుల బాధ్యత మాత్రమే కాదని.. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, ప్రజాప్రతినిధులు అందరూ కలిసి పనిచేసినప్పుడే ఈ సామాజిక సమస్యను పూర్తిగా నిర్మూలించగలమని పేర్కొన్నారు. వనపర్తి జిల్లాను డ్రగ్స్ రహిత జిల్లాగా తీర్చిదిద్దేందుకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు. 'డ్రగ్స్‌కు నో చెప్పండి... జీవిత విజయాలకు యెస్ చెప్పండి' అంటూ విద్యార్థుల్లో ఉత్తేజం నింపారు. ఈ అవగాహన కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్‌బీ డీఎస్పీ బాలాజీ నాయక్, ఏహెచ్‌టీయూ ఎస్సై అంజద్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు శివాజీ, ఉపాధ్యాయ బృందం, అలాగే భరోసా, ఏహెచ్‌టీయూ, షీ టీం సిబ్బంది మరియు పెద్ద సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్య

**- ప్రొసీడింగ్ అందజేసిన డీఈఓ**



గద్వాల జూన్ 24 ( విజన్ ఆంధ్ర బ్యూరో) : జోగులాంబ గద్వాల జిల్లాలో వర్కింగ్ జర్నలిస్టుల పిల్లలకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించుటకు జిల్లా విద్యాశాఖ అధికారిని విజయలక్ష్మి ప్రొసీడింగ్ ను బుధవారము జర్నలిస్టులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జిల్లాలోని అనేక మంది జర్నలిస్టులు నిరుపేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందినవారని, పత్రికలు, టీవీ యాజమాన్యాల నుంచి తగిన ఆర్థిక సహాయం అందకపోవడంతో కుటుంబ పోషణతో పాటు పిల్లల విద్యాభారం మోయడం కష్టంగా మారిందని తెలిపారు.దప్రస్తుత పరిస్థితుల్లో విద్యా ఖర్చులు గణనీయంగా పెరిగిపోవడంతో జర్నలిస్టుల పిల్లల చదువులు కొనసాగించడం భారంగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. సమాజానికి సేవలందిస్తున్న జర్నలిస్టుల కుటుంబాలను ఆదుకునే దిశగా ప్రైవేట్ పాఠశాలల్లో చదువుతున్న వారి పిల్లలకు ఉచిత విద్యను అందించే విధంగా ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలకు ఆదేశాలు జారీ చేయాలని డీఈఓను కోరాగా జర్నలిస్టు పిల్లలకు ఒకరికి ఉచితంగా, మరొకరికి 50 శాతం ఫీజులో రాయితీ ప్రొసీడింగ్ ను జర్నలిస్టులకు అందజేశారు. ప్రొసీడింగ్ కాఫీ, అక్రిడేషన్ కార్డు జిరాక్స్ కాపీలను సంబంధిత పాఠశాలలో ఇవ్వాలని, ఈ అవకాశాన్ని ప్రతి అక్రిడేషన్ కలిగిన జర్నలిస్టులు వినియోగించుకోవాలని ఆమె అన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ జర్నలిస్టులు పెద్ద ఇస్మాయిల్, ముకుందరావు, బలరాం, కృష్ణ, మహేష్, సత్యం, తదితరులు పాల్గొన్నారు.

# పార్టీ అభివృద్ధికి యువత శక్తి కీలకం బండి రమేష్

**- కూకట్‌పల్లిలో యూత్ కాంగ్రెస్ జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం,**



మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా జూన్ 24 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): కూకట్‌పల్లి కాంగ్రెస్ పార్టీ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు సలీం ఆధ్వర్యంలో జిల్లా ఎగ్జిక్యూటివ్ కమిటీ సమావేశం బుధవారం కేపీహెచ్‌బీ కాలనీలోని శ్రీ వాసవి కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ఉపాధ్యక్షులు, కమ్మ కార్పొరేషన్ చైర్మన్ బండి రమేష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన యువతను ఉద్దేశించి మాట్లాడుతూ, ఏ రాజకీయ పార్టీకి అయినా యువతే వెన్నెముకగా నిలుస్తుందని అన్నారు. దేశాభివృద్ధిలోనూ, పార్టీ అభివృద్ధిలోనూ యువత పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. పార్టీ కోసం నిబద్ధతతో కష్టపడి పనిచేసే కార్యకర్తలకు గుర్తింపు, గౌరవం తప్పక లభిస్తాయని చెప్పారు. పార్టీ అభివృద్ధి కోసం ప్రతి కార్యకర్త తన బాధ్యతను సమర్థవంతంగా నిర్వర్తించాలని, నాయకులను గుర్తించి అవకాశాలు కల్పించే బాధ్యతను పార్టీ తీసుకుంటుందని ఆయన అన్నారు. ప్రజా సమస్యలను పార్టీ వేదికగా పరిష్కరించడం ద్వారా ప్రజలకు మరింత చేరువ కావచ్చని, తద్వారా భవిష్యత్తులో మరిన్ని అవకాశాలు లభిస్తాయని పేర్కొన్నారు. తన రాజకీయ ప్రస్థానంలో కృషి, పనితీరు ఆధారంగానే పార్టీ తనకు సముచిత స్థానం కల్పించిందని బండి రమేష్ తెలిపారు. రాష్ట్రంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, దేశంలో రాహుల్ గాంధీ నాయకత్వాన్ని మరింత బలోపేతం చేయాలని పిలుపునిచ్చారు. ఆర్‌ఆర్‌ఆర్ (రేవంత్ రెడ్డి రాహుల్ గాంధీ) నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసి విజయపథంలో నడిపించేందుకు ప్రతి నాయకుడు, ప్రతి కార్యకర్త నేటి నుంచే కృషి చేయాలి అని సూచించారు. ఈ కార్యక్రమంలో యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ఇన్‌చార్జ్ భవ్య, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా ఇన్‌చార్జ్ రామ్ ప్రసాద్, రాష్ట్ర కార్యదర్శి రమ్య, మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక అజయ్ తదితర యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియ విజయవంతానికి రాజకీయ పార్టీలు సహకరించాలి

**- జిల్లా కలెక్టర్ అంకిత్**



కొత్తగూడెం బ్యూరో, జూన్ 25(విజన్ ఆంధ్ర) : జిల్లాలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సమర్థవంతంగా, పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ పిలుపునిచ్చారు. బుధవారం ఐడీఓసీ కార్యాలయ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులకు ఎస్ఐఆర్ ప్రక్రియపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. కార్యక్రమంలో మాస్టర్ ట్రైనర్ పూసపాటి సాయి కృష్ణ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఎస్ఐఆర్ ప్రక్రియపై సమగ్ర అవగాహన కల్పించారు. బూత్ లెవల్ అధికారులు (బీఎల్‌వోలు) ఇంటింటికి వెళ్లినప్పుడు అనుసరించాల్సిన విధానాలు, ఫారాల సమర్పణ విధానం, ఆన్‌లైన్‌ఆఫ్‌లైన్ ప్రక్రియలు, ఎన్యుమరేషన్ ఫారాల సమర్పణ దశలు, సాంకేతిక సమస్యల పరిష్కార మార్గాలు తదితర అంశాలను వివరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ఓటర్ల జాబితా ప్రక్షాళన ప్రక్రియ విజయవంతం కావడానికి రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజలకు అవగాహన కల్పిస్తూ సహకరించాలని కోరారు. ఇప్పటికే బీఎల్‌వోలు, బీఎల్ఏలు, అసెంబ్లీ నియోజకవర్గ స్థాయి అధికారులు క్షేత్రస్థాయి శిక్షణ కార్యక్రమాలను పూర్తి చేసినట్లు తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు బీఎల్‌వోలు ప్రతి ఇంటిని సందర్శించి ఎన్యుమరేషన్ ఫారాల ద్వారా ఓటర్ల వివరాలను సేకరిస్తారని చెప్పారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా కుటుంబ సభ్యుల వివరాలను ధృవీకరించి నమోదు చేయనున్నట్లు తెలిపారు. జూలై 24 నుంచి 30 వరకు ప్రతి పోలింగ్ కేంద్రంలో గరిష్ఠంగా 1,200 మంది ఓటర్లు ఉండేలా హేతుబద్ధీకరణ చేపడతామని పేర్కొన్నారు. జూలై 31న ముసాయిదా ఓటర్ల జాబితా విడుదల చేసి, అనంతరం అభ్యంతరాల స్వీకరణ, పరిశీలన కొనసాగుతుందని తెలిపారు. అక్టోబర్ 1న తుది ఓటర్ల జాబితాను అధికారికంగా విడుదల చేయనున్నట్లు వెల్లడించారు. వలస వెళ్లిన, మరణించిన, డూప్లికేట్ ఓటర్ల పేర్లను తొలగిస్తామని, ప్రస్తుత జాబితాలో పేరు లేని అర్హులైన కొత్త ఓటర్లు ఫారం6 ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి మారిన వారు ఫారం8 ద్వారా వివరాల సవరణ చేసుకోవచ్చన్నారు. ప్రతిరోజు బీఎల్‌వోలు గరిష్ఠంగా 50 ఫారాల వరకు సమర్పించవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు మొత్తం ప్రక్రియ పూర్తిగా పారదర్శకంగా కొనసాగుతుందని పేర్కొన్నారు. 2026 అక్టోబర్ 1 నాటికి 18 సంవత్సరాలు పూర్తి చేసుకునే యువత కొత్త ఓటరుగా నమోదు చేసుకునే అవకాశం ఉందన్నారు. ఎస్ఐఆర్ ప్రక్రియకు సంబంధించిన సందేహాల నివృత్తి కోసం టోల్ ఫ్రీ నంబర్ 1950ను సంప్రదించాలని సూచించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ప్రజల్లో విస్తృత అవగాహన కల్పించి ఓటర్ల జాబితా ప్రక్షాళన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్నికల శాఖ సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, టీఆర్ఎస్ పార్టీ ప్రతినిధి వెంకటేశ్వర నాయక్, అన్వర్, కాంగ్రెస్ పార్టీ నుంచి లక్ష్మణ్ అగర్వాల్, సీపీఐ పార్టీ నుంచి అన్నవరపు సత్యనారాయణ, బీజేపీ పార్టీ నుంచి రవి నాయక్‌తో పాటు ఎన్నికల శాఖ సిబ్బంది నవీన్, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పథకాలు లబ్ధిదారులకు చేరేలా చూడాలి

**- ప్రత్యేక అధికారి డా.గౌరవ్ ఉప్పల్**




ఉమ్మడి నల్గొండ జిల్లా బ్యూరో,జూన్ 24,(విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ ప్రాధాన్య పథకాలు క్షేత్రస్థాయిలో ప్రతి లబ్ధిదారునికి అందేలా చూడాల్సిన బాధ్యత అధికారులపై ఉందని రాష్ట్ర ఆర్థిక,ప్రణాళిక శాఖ కార్యదర్శి, ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక నల్గొండ జిల్లా ప్రత్యేక అధికారి డా.గౌరవ్ ఉప్పల్ అన్నారు. బుధవారం నల్గొండ జిల్లా కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్‌తో కలిసి ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమంపై ఆయన సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వ అభివృద్ధి,సంక్షేమ పథకాలు లబ్ధిదారులకు చేరాయా లేదా తెలుసుకోవడం,ప్రజలకు అవగాహన కల్పించి సమస్యలు గుర్తించేందుకే 99 రోజుల ప్రజా పాలన–ప్రగతి ప్రణాళిక చేపట్టామని తెలిపారు.విద్య, వైద్యం,ఆరోగ్య రంగాల్లో సమస్యలు గుర్తించి పరిష్కరించడం,లబ్ధిదారుల నుంచి వినతులు స్వీకరించి పరిష్కరించడం,పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు.నల్గొండ జిల్లాలో 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు జిల్లా కలెక్టర్,అధికారులను అభినందించారు.నిధులు లేకున్నా సమర్థంగా కార్యక్రమాలు చేపట్టారన్నారు. వినూత్నంగా ఆలోచించి ఇతర ప్రాంతాల్లో అమలవుతున్న ఉత్తమ పద్ధతులు అధ్యయనం చేసి ప్రజలకు ఎక్కువ లాభం చేకూర్చాలి.సమర్థవంతమైన షెడ్యూల్,ప్రణాళికతో పనిచేయాలి.కేంద్ర, రాష్ట్ర నిధులను సద్వినియోగం చేసుకోవాలి.చిన్న మరమ్మతుల కు డి ఎం ఎఫ్ టి, సి ఎస్ ఆర్ నిధులను వినియోగిం చాలి.పాఠశాలలు,హాస్టళ్లలో దోమ తెరలు,డోర్లు,చిన్న మరమ్మతులు చేపట్టాలి. పథకాల అమలులో శాఖలన్నీ సమన్వయంతో పనిచేయాలి. అంతకు ముందు జిల్లా కలెక్టర్ బి.చంద్రశేఖర్ 99 రోజుల కార్యాచరణను వివరించారు.ఆయా శాఖల అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరాలు అందించారు. సమాచార శాఖ ఏర్పాటు చేసిన ఫోటో ఎగ్జిబిషన్‌ను ప్రత్యేక అధికారి తిలకించారు.ఈ సమీక్షలో స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై.అశోక్ రెడ్డి,ప్రణాళిక శాఖ డైరెక్టర్ షేక్ మీరా,ట్రైనీ అసిస్టెంట్ కలెక్టర్ శ్రీకాంత్ రెడ్డి,జెడ్పి సీఈవో ప్రేమ్ కరణ్ రెడ్డి,డిఆర్ఓ దశరథ్,డీఎఫ్ఓ రాజశేఖర్, సిపిఓ శ్రీనివాస్ నాయక్,జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# ఓటరు జాబితా సవరణలో రాజకీయ పార్టీల సహకారం కీలకం

**- జిల్లా కలెక్టర్ రాజర్షి షా**



ఆదిలాబాద్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): జిల్లాలో ఈ నెల 25వ తేదీ నుంచి ప్రారంభం కానున్న ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, బూత్ స్థాయి ఏజెంట్లు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా కోరారు. బుధవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, ప్రతి అర్హుడైన ఓటరు జాబితాలో పేరు నమోదు కావడంతో పాటు, అనర్హుల పేర్లు తొలగించే ప్రక్రియ పారదర్శకంగా, నిష్పక్షపాతంగా జరగాలని ఆయన పేర్కొన్నారు. జూన్ 25 నుంచి జూలై 24 వరకు నిర్వహించే ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో బూత్ స్థాయి అధికారులు (బీఎల్‌వోలు) ప్రతి ఓటరుకు ఎన్యుమరేషన్ ఫారాలను అందజేస్తారని తెలిపారు. ఓటర్లు పూర్తి చేసిన ఫారాలను బీఎల్‌వోలు తిరిగి సేకరించి, అందులోని వివరాలను నిరంతరం యాప్‌లో నమోదు చేస్తారని వివరించారు. ఈ ప్రక్రియలో రాజకీయ పార్టీల బూత్ స్థాయి ఏజెంట్లు చురుకుగా పాల్గొని, ఓటర్లకు అవసరమైన అవగాహన కల్పించడంతో పాటు ఫారాల పంపిణీ, సేకరణ ప్రక్రియను పర్యవేక్షించాలని సూచించారు. ఓటరు జాబితా సవరణలో ఎలాంటి పొరపాట్లు, అభ్యంతరాలు లేదా లోపాలు తలెత్తకుండా రాజకీయ పార్టీలు జిల్లా యంత్రాంగానికి సహకరించాలని కోరారు. ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని తహసీల్దార్లు, సూపర్వైజర్లు, ఎన్నికల అధికారులు, జిల్లా యంత్రాంగం నిరంతరం పర్యవేక్షిస్తారని తెలిపారు. ప్రతి అర్హుడైన ఓటరుకు తన ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఓటరు జాబితా మరింత ఖచ్చితత్వంతో రూపొందించేందుకు రాజకీయ పార్టీల ప్రతినిధులు నిర్మాణాత్మక సూచనలు అందించాలని, ప్రజల్లో అవగాహన పెంపొందించేందుకు సహకరించాలని కలెక్టర్ విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అదనపు కలెక్టర్ ఆర్.ఎస్. చిత్రు, జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి, ఆర్డీవో జగదీశ్వరరావు, ఎన్నికల విభాగం అధికారులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# డీఎల్ఆర్సీ సమావేశానికి బ్యాంకర్లు అందరూ తప్పనిసరిగా హాజరు కావాలి

**- అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్**



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 24 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): అదనపు కలెక్టర్ శ్రీ ఫైజాన్ అహ్మద్, జిల్లా స్థాయి బ్యాంకర్లందరూ డీసీసీ, డీఎల్ఆర్సీ సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలని బ్యాంకర్లందరికీ సూచించారు. బ్యాంకు శాఖల నుండి హాజరు కానిచో, విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తామని, వివరణ కోరుతూ రాష్ట్ర బ్యాంకుల కంట్రోలర్లకు, రిజర్వ్ బ్యాంకుకు, రాష్ట్ర స్థాయి బ్యాంకుల కమిటీ చైర్మన్ లకు లేఖలు జారీ చేస్తామని హెచ్చరించారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ కార్యాలయం సమావేశ మందిరంలో మార్చి 2026 కాలానికి సంబంధించిన డి సి సి, డి ఎల్ ఆర్ సి, సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ~ూజూదీ ఏ సి ఎల్ బి, ఫైజాన్ అహ్మద్ ఆర్బిఐ, ఏ జి ఎం, అండ్ ఎల్ డి ఓ, హేమలత, నాబార్డ్ డీడీఎం, ఝాన్సీ రాణి, లీడ్ బ్యాంక్ (కెనరా బ్యాంక్) జిల్లా కంట్రోలర్ ఏ జి ఎం,అనురాగ్ ప్రకాష్ లు వివిధ బ్యాంకుల జిల్లా కంట్రోలర్లు, డి ఐ సి, వ్యవసాయం, డి వి ఏ హెచ్ ఓ, ఉద్యానవన అండ్ పట్టు పరిశ్రమ, డి సి ఓ, ఎస్ సి, కార్పొరేషన్, ఎస్ టి, కార్పొరేషన్, మైనారిటీ సంక్షేమం, ఉపాధి కల్పన శాఖల అధికారులు, కౌన్సిలర్లు హాజరయ్యారు. మేడ్చల్–మల్కాజిగిరి జిల్లాకు 2025–26 సంవత్సరానికి గాను రూ. 82,487 కోట్ల వార్షిక రుణ లక్ష్యం నిర్దేశించబడగా, రూ. 1,86,975 కోట్లు (అంటే 226.67%) సాధించడం జరిగింది. నాబార్డ్ వారి 'పొటెన్షియల్ క్రెడిట్ లింక్ ప్లాన్' (రుణ సామర్థ్య ప్రణాళిక) ప్రకారం, 2026–27 సంవత్సరానికి రూ. 95,163 కోట్ల కొత్త వార్షిక రుణ ప్రణాళిక కేటాయించబడింది. ఈ రూ. 95,163 కోట్ల లక్ష్యంలో 'ప్రాధాన్యత రంగం' కోసం రూ. 33,290 కోట్లు కేటాయించారు; ఇందులో వ్యవసాయానికి రూ. 3,056 కోట్లు, ఎం ఎస్ ఎం ఈ, రంగానికి రూ. 27,882 కోట్లు, విద్యకు రూ. 325 కోట్లు, గృహ నిర్మాణానికి రూ. 1,410 కోట్లు ఇతర ప్రాధాన్యత రంగ రుణాలకు రూ. 2,292 కోట్లు ఉన్నాయి. 2025–26 ఆర్థిక సంవత్సరంలో వ్యవసాయ రంగంలో రూ. 2,996.65 కోట్ల లక్ష్యానికి గాను రూ. 6,173.60 కోట్లు, ఎం ఎస్ ఎం ఈ, రంగంలో రూ. 23,042 కోట్ల లక్ష్యానికి గాను రూ. 23,490 కోట్లు సాధించినందుకు బ్యాంకర్లు, ఎల్డిఎం జిల్లా అధికారులను అభినందించారు. అయితే, విద్యా రుణాల విషయంలో రూ. 801.41 కోట్ల లక్ష్యానికి గాను కేవలం రూ. 430.07 కోట్లు మాత్రమే సాధించినందున, ప్రాధాన్యత, ప్రాధాన్యతేతర రంగాల లక్ష్యాలను మరింత సమర్థవంతంగా సాధించాలని సూచించారు. గృహ రుణాల విషయంలో రూ. 15,593 కోట్ల లక్ష్యానికి గాను రూ. 16,248.48 కోట్లు సాధించడం జరిగిందని తెలిపారు.

# మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి

**- ఎస్పీ అఖిల్ మహాజన్**




ఆదిలాబాద్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): డ్రగ్స్, మాదక ద్రవ్యాల రహిత సమాజ నిర్మాణానికి కృషి చేయాలని ఎస్పీ అఖిల్ మహాజన్ జిల్లా ప్రజలకు పిలుపునిచ్చారు. డ్రగ్స్ కు వ్యతిరేకంగా పోరాడుతామని పట్టణంలోని వన్ టౌన్ పోలీస్ స్టేషన్ ఎదుట బుధవారం సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వాల్ ఆఫ్ ప్రామిస్ పై ఎస్పీ సంతకం చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. గంజాయికి దూరంగా ఉండాలని, గంజాయి రహిత ఆదిలాబాద్ జిల్లా నిర్మాణానికి కృషి చేస్తానని తన ప్రతిజ్ఞను నమోదు చేశారు. డ్రగ్స్ మరియు మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు జిల్లా వ్యాప్తంగా అన్ని పోలీస్ స్టేషన్‌లలో ప్రత్యేకంగా సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల విద్యార్థులు, యువత, ప్రజలు, ప్రజాప్రతినిధులు, పోలీసు అధికారులు పెద్ద ఎత్తున పాల్గొని డ్రగ్స్‌కు వ్యతిరేకంగా తమ మద్దతు ను తెలియజేసి సంతకాలు చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, యువత భవిష్యత్తును నాశనం చేస్తున్న డ్రగ్స్, గంజాయి వంటి మాదక ద్రవ్యాలపై సమాజమంతా కలిసి పోరాడాలని, డ్రగ్స్ లేని ఆరోగ్యకరమైన సమాజ నిర్మాణం కోసం ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని పిలుపునిచ్చారు. ఈ "వాల్ ఆఫ్ ప్రామిస్" పై సంతకం చేసిన ప్రతి ఒక్కరూ గంజాయి రహిత సమాజ నిర్మాణానికి పోరాడుతూ, గంజాయి బారిన పడిన వారి సమాచారం, గంజాయి పై ఉన్న సమాచారాన్ని పోలీసులకు తెలియజేస్తామనే బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. డ్రగ్స్, గంజాయి బారిన పడిన యువతకు సరైన చికిత్స ద్వారా నయం చేయవచ్చని, పునరావాస కేంద్రాల ద్వారా నయం చేసి తిరిగి సాధారణ జీవితాన్ని గడిపేలా పోలీసు యంత్రం కృషి చేస్తుందని, తల్లిదండ్రులు డ్రగ్స్ బారిన పడిన వారిని చికిత్స కేంద్రాలకు తరలించి చికిత్సను అందించేలా కృషి చేయాలని సూచించారు. ఈ సందర్భంగా యాంటీ డ్రగ్స్ సోల్జర్ గా పోరాడుతామని డ్రగ్స్ వ్యతిరేకంగా పోరాడుతామని ఏర్పాటు చేసిన ఛాయాచిత్ర కేంద్రం వద్ద ఫోటోలను దిగి తమ సామాజిక మాధ్యమాల కేంద్రాలలో పొందుపరచాలని జిల్లా ఎస్పీ సూచించారు. మీడియా ప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని డ్రగ్స్కు వ్యతిరేకంగా పోరాడుతామని సంతకాలు చేసి, యాంటీ డ్రగ్ సోల్జర్ గా ఏర్పాటు చేసిన పోస్టర్ల వద్ద చాయచిత్రాన్ని తీసుకున్నారు. కార్యక్రమంలో డీఎస్పీ జీవన్ రెడ్డి, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ సునీల్ కుమార్, ఇన్స్పెక్టర్లు ఫణిదర్, ప్రణయ్ కుమార్, ఎస్ఐలు అశోక్, సంజయ్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పుస్తకాల అమ్మకాలు మావి కావు... ట్రేడ్ లైసెన్స్ మాత్రం ప్రిన్సిపాల్ పేరిట!

**- పుస్తకాలు, యూనిఫాంల విక్రయాలపై ప్రశ్నలు**

**- ట్రేడ్ లైసెన్స్ వ్యవహారంతో కొత్త మలుపు**



జిల్లా ప్రతినిధిదౌల్తాబాద్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): మండల పరిధిలోని సెయింట్ ఆన్స్ పాఠశాల యాజమాన్యం వ్యవహార శైలిపై పలు ప్రశ్నలు తలెత్తుతున్నాయి. విద్యా సేవల కంటే ధనార్జనే ధ్యేయంగా నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంల విక్రయాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే ఈ విక్రయాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని పాఠశాల యాజమాన్యం గతంలో పేర్కొనగా, తాజాగా చోటుచేసుకున్న పరిణామాలు కొత్త అనుమానాలకు తావిస్తున్నాయి. స్థానికంగా అందిన సమాచారం ప్రకారం పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంల విక్రయాలు జరుగుతున్నట్లు గుర్తించిన గ్రామ పంచాయతీ అధికారులు ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం నిర్వహిస్తున్నారనే కారణంతో సంబంధిత సామగ్రిని సీజ్ చేసినట్లు తెలిసింది. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశమైంది. అయితే అసలు కథ ఇక్కడి నుంచే ప్రారంభమైందని పలువురు పేర్కొంటున్నారు. పుస్తకాల విక్రయాలకు తమకు ఎలాంటి సంబంధం లేదని ప్రకటించిన పాఠశాల యాజమాన్యం, అనంతరం అదే పాఠశాల ప్రిన్సిపాల్ పేరుతో ట్రేడ్ లైసెన్స్ కోసం దరఖాస్తు చేసుకోవడం, తక్కువ సమయంలోనే లైసెన్స్ మంజూరు కావడం పలు సందేహాలకు దారితీస్తోంది. ఒకవైపు విక్రయాలతో తమకు సంబంధం లేదని చెప్పడం, మరోవైపు అదే కార్యకలాపాలకు సంబంధించి ట్రేడ్ లైసెన్స్ పొందడం వెనుక ఉన్న వాస్తవాలు ఏమిటన్నది ఇప్పుడు ప్రధాన చర్చగా మారింది. దీంతో ఇప్పటివరకు జరిగిన పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంల విక్రయాలు యాజమాన్యం ఆధ్వర్యంలోనే జరిగాయా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. విద్యార్థులు, తల్లిదండ్రులపై ఒత్తిడి తెచ్చి నిర్దిష్ట దుకాణాల నుంచే లేదా పాఠశాల ద్వారానే పుస్తకాలు, యూనిఫాంలు కొనుగోలు చేయాలని సూచించడం నిబంధనలకు విరుద్ధమని విద్యావేత్తలు పేర్కొంటున్నారు. ఈ నేపథ్యంలో సెయింట్ ఆన్స్ పాఠశాలలో జరుగుతున్న వ్యవహారాలపై సంబంధిత శాఖలు సమగ్ర విచారణ చేపట్టాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు. పాఠశాల బహిరంగంగా పుస్తకాలు, నోట్‌బుక్కులు, యూనిఫాంల విక్రయాలు నిర్వహించడానికి ఎవరి అండదండలు ఉన్నాయన్న విషయమూ వెలుగులోకి రావాల్సి ఉందని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ట్రేడ్ లైసెన్స్ మంజూరు ప్రక్రియ, విక్రయాల నిర్వహణ, నిబంధనల అమలుపై విద్యాశాఖ అధికారులు, పంచాయతీ రాజ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకుంటారన్నది ఆసక్తికరంగా మారింది. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు స్పందించి వాస్తవాలను వెలికితీస్తారా..? పాఠశాల యాజమాన్యంపై తగిన చర్యలు తీసుకుంటారా..? అన్నది వేచి చూడాల్సి ఉంది.

# పెండింగ్ కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలి

**- జిల్లా ఎస్పీ డి.జానకి**

మహబూబ్‌నగర్ అర్బన్ జూన్ 24 (విజన్ ఆంధ్ర): పెండింగ్‌లో ఉన్న కేసుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా ఎస్పీ డి.జానకి, ఐపీఎస్ అధికారులను ఆదేశించారు. వార్షిక తనిఖీలలో భాగంగా బుధవారం మహబూబ్‌నగర్ రూరల్ పోలీస్ స్టేషన్‌ను ఆమె తనిఖీ చేసి స్టేషన్ నిర్వహణ, రికార్డులు, పరిసరాల పరిశుభ్రతను పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్ పరిధిలో నమోదవుతున్న నేరాలు, పెండింగ్ కేసులు, రౌడీ షీట్లు, సస్పెక్ట్ షీట్లు, బైండోవర్ కేసుల పురోగతిని సమీక్షించారు. నేర నియంత్రణలో అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి నేర ప్రవృత్తి కలిగిన వ్యక్తులపై నిరంతర నిఘా కొనసాగించాలని సూచించారు. పోలీస్ స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారులు, బాధితులతో మర్యాదపూర్వకంగా వ్యవహరించి వారి సమస్యలను చట్టబద్ధంగా, త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు. ప్రజల్లో పోలీస్ శాఖపై విశ్వాసం పెరిగేలా సేవాభావంతో విధులు నిర్వహించాలని పేర్కొన్నారు. స్టేషన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు రికార్డులను ఎప్పటికప్పుడు నవీకరించాలని సూచించారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా నిరంతర పర్యవేక్షణ చేపట్టి ప్రజలకు ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు.అనంతరం పోలీస్ సిబ్బందితో సమావేశమైన ఎస్పీ వారి శాఖాపరమైన అవసరాలు, సమస్యలను తెలుసుకున్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే ఇబ్బందులను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. రోడ్డు భద్రతా నియమాల పాటింపులో పోలీస్ సిబ్బంది ఆదర్శంగా ఉండాలని ఎస్పీ ప్రత్యేకంగా ఆదేశించారు. ద్విచక్ర వాహనాలు నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, నాలుగు చక్రాల వాహనాల్లో ప్రయాణించే వారు సీట్‌బెల్ట్ వినియోగించాలని సూచించారు. ఈ సందర్భంగా ద్విచక్ర వాహనాలు ఉపయోగిస్తున్న పోలీస్ సిబ్బంది హెల్మెట్లను ఆమె స్వయంగా తనిఖీ చేశారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, రూరల్ సర్కిల్ ఇన్స్పెక్టర్ గాంధీ నాయక్, సబ్ ఇన్స్పెక్టర్ విజయ్ కుమార్ తదితర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.




# ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహిస్తాం

**- గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల తరుపున బిఎల్ఏ లను నియమించాలి**

**- జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా**




నిర్మల్ జిల్లా,జూన్ 24,(విజన్ ఆంధ్ర); స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఎస్ఐఆర్) ప్రక్రియను పూర్తి పారదర్శకంగా చేపడతామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా అన్నారు. జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా, బుధవారం సాయంత్రం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో, జిల్లాలో చేపట్టనున్న ఎస్ఐఆర్ ప్రక్రియపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎస్ఐఆర్ ప్రక్రియ వివరాలను సమగ్రంగా వివరించారు. ఓటర్లు తమ ఎన్యుమరేషన్ ఫారంలు ఎన్నికల సంఘం వెబ్ సైట్ ద్వారా ఆన్ లైన్ లో కూడా సమర్పించవచ్చునన్నారు. వివరాల పరిశీలన తర్వాత, ఎస్ఐఆర్ కి సంబంధించి, జూలై 31 వ తేదీన డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ జాబితాను ప్రచురిస్తామని చెప్పారు. డ్రాఫ్ట్ ఎలక్టోరల్ రోల్ లో ఓటరు పేరు లేకపోతే తగిన ఆధారాలతో సంబంధిత ఫామ్ లను నింపి, ధ్రువీకరణ (డిక్లరేషన్) తో ఈఆర్ఓ లను సంప్రదించవచ్చునని చెప్పారు. ఫాం 6, 7, 8 ల గురించి వివరించారు. ఎస్ఐఆర్ ప్రక్రియ నిర్వహణకు సంబంధించి ప్రతి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ తరుపున బూత్ లెవెల్ ఏజెంట్ (బిఎల్ఏ) లను నియమించాలని తెలిపారు. అర్హులైన ఏ ఒక్క నిజమైన ఓటరు కూడా తమ ఓటు హక్కు కోల్పోకుండా, పారదర్శకంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పూర్తి చేస్తామని అన్నారు. ఎప్పటికప్పుడు బిఎల్ఓ లు, బిఎల్ఏ ల తో సమావేశం నిర్వహించాలని తెలిపారు. ఎస్ఐఆర్ నిర్వహణలో బిఎల్ఏ లు తమ వంతు సహకారం అందించాలని చెప్పారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, ఆర్డీఓలు దేవీదాస్, మోహన్ సింగ్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, తహసిల్దార్ లు, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు భద్రతా పనులను వేగవంతం చేయాలి: కలెక్టర్ ఖుష్బూ గుప్తా



మహబూబ్ నగర్ జిల్లా ప్రతినిధి జూన్ 24(విజన్ ఆంధ్ర) : జిల్లాలో జాతీయ రహదారులు, బైపాస్ రోడ్లపై ప్రమాదాల నివారణకు చేపట్టిన రోడ్డు భద్రతా పనులను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన జిల్లా రోడ్డు భద్రత కమిటీ (డీఆర్సీ) సమావేశంలో జిల్లా ఎస్పీ డి. జానకితో కలిసి ఆమె వివిధ శాఖల అధికారులతో రోడ్డు భద్రతా చర్యల పురోగతిని సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాల అమలు స్థితిని పరిశీలించారు. జడ్చర్ల మండలం గంగాపూర్ సమీపంలోని ఎన్‌హెచ్-167పై డివైడర్ నిర్మాణానికి డీపీఆర్ సిద్ధం చేయాలని, అమిస్తాపూర్ వద్ద రహదారి విస్తరణకు అడ్డుగా ఉన్న శ్మశానవాటికను మున్సిపల్ అధికారులతో సమన్వయం చేసుకుని త్వరలోనే తరలించాలని ఆదేశించారు. మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి, ఆర్టీసీ బస్‌స్టాండ్ సమీపంలో ప్రతిపాదించిన రెండు ఫుట్ ఓవర్ బ్రిడ్జిల అనుమతుల కోసం ఆర్అండ్‌బీ అధికారులు వెంటనే ఫాలోఅప్ చేయాలన్నారు. బాలానగర్ ఫ్లైఓవర్ నిర్మాణ పనులు ఆగస్టు మొదటి వారంలోగా పూర్తి కావాలని స్పష్టం చేశారు. ఎన్‌హెచ్-44పై పెద్దాయిపల్లి జంక్షన్ వద్ద అదనపు లైటింగ్ పనులను జూలై 15లోగా పూర్తి చేయాలని, రాజాపూర్ జంక్షన్ వద్ద వై-ఫ్లైఓవర్ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. మూసాపేట్ జంక్షన్ వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని జిల్లా ఎస్పీ డి. జానకి పేర్కొనగా, అక్కడ రేడియం స్టిక్కర్లు, హెచ్చరిక బోర్డులు, అదనపు బ్యారికేడ్లు ఏర్పాటు చేయాలని కలెక్టర్ సూచించారు. జడ్చర్ల ఫ్లైఓవర్ జంక్షన్ వద్ద ట్రాఫిక్ రద్దీ సమస్య పరిష్కారానికి పోలీసు శాఖతో కలిసి సంయుక్త తనిఖీ నిర్వహించాలని, పొన్నాకల్ జంక్షన్ వద్ద అదనపు రంబుల్ స్ట్రిప్‌లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో డీఎస్పీ వెంకటేశ్వర్లు, ఆర్అండ్‌బీ ఈఈ సంధ్య, పీఆర్ ఈఈ శ్రీనివాస్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ రామానుజుల రెడ్డి, ఎన్‌హెచ్, ఎన్‌హెచ్‌ఏఐ అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

## తినుబండారాల దుకాణదారులంతా తప్పనిసరిగా నిబంధనలు పాటించాలి



నిర్మల్ జిల్లా,జూన్24,(విజన్ ఆంధ్ర); జిల్లా ఫుడ్ సేఫ్టీ అధికారి సునీత పట్టణంలోని మిఠాయి దుకాణాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ దాడులలో పలు దుకాణాలలో గడువు తీరిన మిఠాయిలు, చాక్లెట్లు, లేబుళ్లు లేని ఆహార పదార్థాలను గుర్తించారు. ఆయా మిఠాయి దుకాణాలపై తగు చర్యలు తీసుకుంటామని ఆమె తెలిపారు. దుకాణదారులంతా ఆహార పదార్థాలకు సంబంధించి లేబుళ్లు తప్పనిసరిగా ఉండేలా చూసుకోవాలన్నారు. ఆహార పదార్థాల గడువు ఎప్పటికప్పుడు తనిఖీ చేసుకుంటూ, గడువు తీరిన ఆహార పదార్థాలను దుకాణాల నుంచి తొలగించాలని తెలిపారు.

## సి.ఇ.ఆర్ క్లబ్ రుద్రంపూర్ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహణ



కొత్తగూడెం బ్యూరో, జూన్ 25(విజన్ ఆంధ్ర) : రుద్రంపూర్‌లోని సి.ఇ.ఆర్ క్లబ్‌లో బుధవారం సాయంత్రం వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎంవి. నరసింహారావు హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగుల్లో ఐక్యత, స్నేహభావం, సాంస్కృతిక విలువల పెంపొందనలో సి.ఇ.ఆర్ క్లబ్‌లు కీలక పాత్ర పోషిస్తున్నాయని తెలిపారు. ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులకు వినోదంతో పాటు సామాజిక, సాంస్కృతిక కార్యక్రమాలకు వేదికగా క్లబ్‌లు నిలుస్తున్నాయని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా మరిన్ని కార్యక్రమాలను నిర్వహించాలని క్లబ్ ప్రతినిధులు తెలిపారు. అనంతరం 01 జనవరి 2024 నుంచి 31 డిసెంబర్ 2025 వరకు సభ్యత్వ చందా చెల్లించిన అర్హులైన సభ్యులకు బహుమతులు అందజేశారు. పెద్ద సంఖ్యలో ఉద్యోగులు, క్లబ్ సభ్యులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం ఏరియా ఇంచార్జ్ జనరల్ మేనేజర్ ఎంవి. నరసింహారావు, ఏఐటీయూసీ అసిస్టెంట్ బ్రాంచ్ సెక్రటరీ జె. గట్టయ్య, ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ ఎండి. రజాక్, ఏఐటీయూసీ బ్రాంచ్ సెక్రటరీ సుధాకర్ (సత్తుపల్లి), ఐఎన్టియుసి వైస్ ప్రెసిడెంట్ కోటేశ్వరరావు (సత్తుపల్లి), సి.ఇ.ఆర్ క్లబ్ జాయింట్ సెక్రటరీ వి. సీతారాం, సీఎంవో ఏఐ జనరల్ సెక్రటరీ ఏ. ఉపేంద్ర బాబు, పర్సనల్ మేనేజర్ ఎల్. తిరుపతి, డివైపిఎం జి. హరీష్, ఐఎన్టియుసి ఫిట్ సెక్రటరీ చిలక రాజయ్య, ఏఐటియుసి ఫిట్ సెక్రటరీ భూక్య రమేష్‌తో పాటు ఇతర అధికారులు, కార్మిక సంఘాల నాయకులు, సి.ఇ.ఆర్ క్లబ్ కార్యవర్గ సభ్యులు, ఉద్యోగులు మరియు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## నారాయణరావుపేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ పాఠశాలను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ హైమావతి



సిద్దిపేట జిల్లా ప్రతినిధి24 జూన్ : సిద్దిపేటజిల్లాకేంద్రంలోనినారాయణ రావు పేట మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను జిల్లా కలెక్టర్ కె హైమావతి ఆకస్మికంగా సందర్శించారు.తరగతి గదిలోకివెళ్ళి విద్యార్థులతో ఆప్యాయంగాపలకరించారు. సమయం వృథా చేయవచ్చని ఒక లక్ష్యం పెట్టుకుని చదవాలని సూచించారు. పాఠశాల ప్రాంగణం మొత్తం కలియ తిరిగారు. మధ్యాహ్న భోజనం మెను గూర్చి ఆరా తీశారు. కామన్ డైట్ మెనూ తప్పనిసరిగా పాటించాలని రుచికరంగా వండాలని ప్రిన్సిపల్ ను ఆదేశించారు. అటెండెన్స్ రిజిస్టర్ వెరిఫై చేశారు. ప్రిన్సిపల్ నుండి ఉపాధ్యాయులు అందరూ కూడా పై అధికారి అనుమతి లేనిదే సెలవు తీసుకోవద్దని తెలిపారు. వ్యాయామ ఉపాధ్యాయులు టి. సతీశ్ జిల్లా కేంద్రంలో ఈ రోజు ఉదయం ఒలంపిక్ రన్ ఉందని వెళ్ళి మధ్యాహ్నం 2.30 అయినా పాఠశాల రాకపోవడం పైన ఆగ్రహం వ్యక్తం చేశారు. వీధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తున్న వ్యాయామ ఉపాధ్యాయులుపైనయాక్షన్తీసుకోవాలని, అలాగే వివిధ పాఠశాలల నుండి ఒలంపిక్ రన్ లో పాల్గొని పాఠశాల రానివారిపైన సైతం యాక్షన్ తీసుకోవాలని డిఈఓ ను ఫోన్ ద్వారా ఆదేశించారు.ప్రిన్సిపల్ నుండి ఉపాధ్యాయులు అందరూ సైతం సమయ వేళలు పాటించాలని, విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే సహించేది లేదని విద్యార్థులకు చదువు, కామన్ డైట్ మెనూ తో మధ్యాహ్న భోజనం విషయం లో ఎలాంటి కొరత రాకుండా చూసుకోవాలని విద్యార్థులకు మంచి క్రమశిక్షణతో చదువు చెప్పాలని ఆదేశించారు.

# నిశ్శబ్ద శత్రువులు...బీపీ,షుగర్, థైరాయిడ్ !!

- నిలువునా ముంచేస్తున్న లైఫ్‌స్టైల్ జబ్బులు
- ప్రాసెస్డ్ ఫుడ్‌కు గుడ్‌బై.. ఇంటి ఆహారానికి హాయ్ హాయ్
- రోజూ 30 నిమిషాలు నడక లేదా వ్యాయామం చేయండి
- ఫోన్‌కు బ్రేక్.. 7 గంటల మంచి నిద్ర ఫాలో అవ్వండి
- ఒత్తిడికి చెక్.. నవ్వుతూ కుటుంబంతో సమయం గడపండి

*నేటి యాంత్రిక జీవనంలో ఆరోగ్యం ఏ విధంగా అటకెక్కుతుందో, మనుషులు రోగాల వలయంలో ఎలా చిక్కుకుంటున్నారో కళ్లకు కట్టేలా, కాస్త భావోద్వేగంతో కూడిన ఒక "విజన్ ఆంధ్ర" వార్తా కథనం మీ కోసమే...!!*




హైదరాబాద్, జూన్ 24:

ఒకప్పుడు అరవై ఏళ్లకు వచ్చే జబ్బులు.. ఇప్పుడు ముప్పై ఏళ్లకే ముచ్చెమటలు పట్టిస్తున్నాయి. 'షుగర్, బీపీ, థైరాయిడ్'.. ఈ మూడు పేర్లు ఇప్పుడు ప్రతి ఇంట్లోనూ కామన్‌గా వినిపిస్తున్న శాపాలు. గడప దాటి బయటకెళ్తే సక్సెస్ వెతుక్కుంటున్నాం కానీ, గడప లోపల ఉన్న ప్రాణాన్ని మాత్రం రోగాల పాలు చేసుకుంటున్నాం. అసలు ఎక్కడ తప్పు జరుగుతోంది?

### ప్లేటు మారింది... ప్రాణం కొట్టుమిట్టాడుతోంది!

అమ్మ చేతి ముద్ద, ఆకుకూరల పప్పు, తాజా కూరగాయల స్థానాన్ని.. ఈరోజు పిజ్జాలు, బర్గర్లు, స్విగ్గీ, జొమాటో ఆర్డర్లు రీప్లేస్ చేశాయి. రుచికి బానిసలై, రసాయనాల ఆహారాన్ని కడుపులోకి తోసేస్తున్నాం. ఫలితంగా శరీరంలో ఇన్సులిన్ లెవల్స్ తారుమారై షుగర్ (డయాబెటిస్) మహమ్మారిలా మారుతోంది. హార్మోన్ల బ్యాలెన్స్ దెబ్బతిని థైరాయిడ్ బారిన పడుతున్న వారి సంఖ్య (ముఖ్యంగా మహిళల్లో) విపరీతంగా పెరిగిపోతోంది.

### టెన్షన్... ఒక ఆధునిక విషం

కనుమూస్తే టార్గెట్లు.. కనుతెరిస్తే ఈఎంఐలు. ఇదే నేటి సగటు మనిషి జీవితం. ఉద్యోగంలో బాస్ ఒత్తిడి, వ్యాపారంలో నష్టాల భయం, రేపటి గురించిన ఆందోళన.. మనిషిని నిలువునా నమిలేస్తున్నాయి. గుండె నిండా ప్రశాంతంగా ఊపిరి పీల్చుకునే సమయం కూడా లేదు. ఈ నిరంతర టెన్షన్ మరియు మానసిక ఒత్తిడి, రక్తనాళాలపై తీవ్ర ప్రభావం చూపిస్తూ సైలెంట్‌గా బీపీ (బ్లడ్ ప్రెజర్)ని పెంచేస్తోంది. కదలని మేను... కరువైన నిద్ర...వ్యాయామ లేమిలి ల్యాప్‌టాప్‌ల ముందు గంటల తరబడి కూర్చోవడం, బైక్ లేనిదే అడుగు బయట పెట్టకపోవడంతో శరీరం తుప్పుపట్టిపోతోంది. చెమట చిందించడం మర్చిపోయిన శరీరంలో కొవ్వు పేరుకుపోయి రోగాలకు అడ్డాగా మారుతోంది. అర్ధరాత్రి దాకా స్మార్ట్‌ఫోన్ల స్క్రీన్ల వెలుగులో కళ్లు వెతుక్కునే 'రీల్స్', 'వెబ్ సిరీస్‌లు' మన నిద్రను దోచేస్తున్నాయి. సరైన నిద్ర లేకపోవడం వల్ల శరీరం తనని తాను రిపేర్ చేసుకోలేక, హార్మోన్ల వ్యవస్థ పూర్తిగా అస్తవ్యస్తమవుతోంది.

### ఇకనైనా మారదామా?

డబ్బు సంపాదనలో పడి, ఆ డబ్బుతో మందులు కొనుక్కునే పరిస్థితి తెచ్చుకోవడం ఏ రకమైన తెలివితేటలు? కోట్లు సంపాదించినా, అనుభవించడానికి ఆరోగ్యం లేకపోతే ఆ జీవితం శూన్యం. ఇప్పటికైనా మించిపోయింది లేదు.. ప్రాసెస్డ్ ఫుడ్‌కు గుడ్ బై చెప్పి, ఇంట్లో వండిన స్వచ్ఛమైన ఆహారం తిందాం. రోజుకు కనీసం 30 నిమిషాలు నడుద్దాం లేదా వ్యాయామం చేద్దాం. ఫోన్‌ను పక్కన పెట్టి హాయిగా 7 గంటలు నిద్రపోదాం. ఒత్తిడిని జయించడానికి కాసేపు నవ్వుదాం, కుటుంబంతో గడుపుదాం.

*గుర్తుంచుకోండి... ఆరోగ్యం మహాభాగ్యం మాత్రమే కాదు, అదే మన అసలైన ఆస్తి.*

- గడ్డం సంతోష్ రాజ్
స్పెషల్ కరస్పాండెంట్ (విజన్ ఆంధ్ర)

# రెండు చుక్కలతో.. నిండు నూరేళ్ళ రక్ష

- జిల్లా టాస్క్ ఫోర్స్ సమావేశంలో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి
- పల్స్ పోలియోను ప్రతిఒక్కరూ సామాజిక బాధ్యతగా చేపట్టాలి
- జూన్ 28న బూత్ లెవెల్, 29, 30వ తేదీల్లో ఇంటింటికీ తిరుగుతూ పల్స్ పోలియో కార్యక్రమం
- జిల్లా వ్యాప్తంగా 2404 బూత్ లు సిద్ధం




కడప, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : రెండు చుక్కలతో నిండు నూరేళ్ళ రక్ష అని పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రతి ఒక్కరూ సామాజిక బాధ్యతగా విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లోని తన ఛాంబర్ లో ఈ నెల 28వ తేదీన నేషనల్ ఇమ్యునైజేషన్ డే సందర్భంగా.జిల్లాలో నిర్వహించే పల్స్ పోలియో ఏర్పాట్లపై సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి.టాస్క్ ఫోర్స్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజల భాగస్వామ్యంతోనే పోలియో నిర్మూలన వంద శాతం సాధ్యం అవుతుందన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాల చర్యల ద్వారా దేశ వ్యాప్తంగానే కాకుండా జిల్లాలో కూడా పోలియోను పూర్తి స్థాయిలో నిర్మూలించగలిగామన్నారు. పోలియో వైరస్ ప్రభావం ప్రస్తుతం మన చుట్టూ లేకపోయినప్పటికీ ముందస్తుగా ప్రతి ఒక్కబిడ్డను పోలియో నుండి రక్షించుకోవడం మన బాధ్యత అన్నారు."నిండు జీవితానికి రెండు చుక్కలు" అన్న నినాదాన్ని సమాజంలో విస్తృత పరచడంలో జిల్లా ప్రజారోగ్య శాఖ, స్త్రీ శిశు సంక్షేమ శాఖ, ఆశ, సచివాలయ సిబ్బంది ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పల్స్ పోలియో కార్యక్రమంపై విస్తృత ప్రచారం భాగంగా. మీడియా కూడా తన వంతు బాధ్యత తీసుకోవాలని తెలియజేశారు. పల్స్ పోలియో కార్యక్రమాన్ని జిల్లాలో విజయవంతంగా నిర్వహించేందుకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు జిల్లా కలెక్టర్ తెలిపారు.జిల్లాలో ఐదేళ్లలోపు వయస్సు గల 2,28,207 మంది చిన్నారులకు పోలియో చుక్కలు వేయడానికి కార్యాచరణ సిద్ధం చేసినట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 40 మండలాలు, 57 పల్స్ పోలియో ప్రణాళిక విభాగాల పరిధిలో మొత్తం 2,404 పోలియో కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు. వీటిలో 2,315 స్థిర కేంద్రాలు, 57 మొబైల్ కేంద్రాలు, 32 రవాణా కేంద్రాలు ఉన్నాయని పేర్కొన్నారు.కార్యక్రమ నిర్వహణ కోసం 9,438 మంది టీకా సిబ్బంది, 232 మంది పర్యవేక్షకులు, 232 వాహనాలను వినియోగిస్తున్నామని తెలిపారు.చిన్నారులందరికీ తప్పనిసరిగా పోలియో చుక్కలు అందేలా 4.20 లక్షల మోతాదుల పోలియో టీకాను సిద్ధంగా ఉంచినట్లు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా 197 డేంజర్ ప్రాంతాలను ప్రత్యేకంగా గుర్తించి, అక్కడ నివసిస్తున్న 1,425 మంది ఐదేళ్లలోపు చిన్నారులపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నామని తెలిపారు. గత విడతలో జిల్లాలో 100.03 శాతం లక్ష్య సాధన నమోదైందని, ఈసారి కూడా అదే స్థాయిలో విజయవంతం చేయడానికి వైద్య ఆరోగ్య శాఖ, అంగన్‌వాడీ, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. జిల్లాలోని తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో కేంద్రాలకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని జిల్లా కలెక్టర్ విజ్ఞప్తి చేశారు.ప్రస్తుతం పోలియో మహమ్మారి ప్రభావం అంతగా లేనప్పటికీ కొన్ని ఊహించని సందర్భాల్లో వైరస్ సంక్రమణ జరిగే అవకాశం ఉన్నందున మనమందరం ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం ఎంతైనా అవసరం అన్నారు. జిల్లాలోని అన్ని ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన బూత్ లతో పాటు మున్సిపాలిటీల్లోని వార్డుల్లో, గ్రామాల్లో, బస్టాండులు, రైల్వే స్టేషన్లు, ఎయిర్ పోర్టులు, వలస కూలీలు ఉన్న చోట, పబ్లిక్ అధికంగా ఉన్నచోట పోలియో చుక్కలు వేయడం జరుగుతోందన్నారు. జూన్ 28వ తేదీన మొబైల్ టీముల ద్వారా 29, 30వ తేదీల్లో ఇంటింటికీ వెళ్లి వ్యాక్సినేషన్ చేయడం జరుగుతుందన్నారు. మూడు రోజుల పాటు.. ఉదయం 7 గం.ల నుండి సాయంత్రం 5 గం.ల వరకు పల్స్ పోలియో ప్రక్రియ నిర్వహించేందుకు అన్ని చర్యలు చేపట్టడం జరిగిందన్నారు. ఈ మూడు రోజులను ప్రతిఒక్కరూ అత్యంత బాధ్యతగా తీసుకుని భవిష్యత్తు తరాలకు సంపూర్ణ ఆరోగ్యకర పౌరులను అందిద్దామని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా జిల్లా అధికారులతో కలిసి జాతీయ పోలియో గోడ పత్రికను విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యు నైజేషన్ అధికారి డా. రవిబాబు, ఐసీడీఎస్ పీడి రమాదేవి, ఆర్డీవో ప్రసాద్, రిమ్స్ సూపరింటెండెంట్ డా. వెంకటేశ్వర్లు, రైల్వే, ఆర్టీసీ, ఐఎంఏ సభ్యులు, సంబంధిత టాస్ఫోర్స్ కమిటీ సభ్యులు, సంబందిత శాఖల అధికారులు, ఎన్జీవోలు తదితరులు పాల్గొన్నారు.

## మల్లారెడ్డి బాటలోనే మరికొందరు!

- అవినీతి అధికారులపై ఏసీబీ ఫోకస్.
- అబ్కారీ శాఖలో ప్రస్తుతం హాట్ టాఫిక్ గా మారిన ఏసీబీ దాడి.


నిజామాబాద్ జూన్ 24:( విజన్ ఆంధ్ర): ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీకి చిక్కిన మల్లారెడ్డి బాటలోనే మరికొందరిపై అవినీతి నిరోధక శాఖ అధికారులు ఫోకస్ చేశారు. ఈ సంఘటనతో మామూళ్ల మత్తులో మునిగిపోయిన అబ్కారీ శాఖలోని కొందరు అవినీతిపరుల గుండెల్లో రైళ్లు పరుగెడుతున్నాయి. ఏ క్షణంలోనైనా తమపై ఏసీబీ దాడి జరిగే అవకాశం ఉందని ఆందోళనకు గురవుతున్నారు. ప్రస్తుతం ఈ అంశం నిజామాబాద్ ఎక్సైజ్ శాఖలో చర్చనీయాంశంగా మారింది. ఎవరిని కదిలించిన దీనిపైన విస్తృతంగా చర్చించుకుంటున్నారు. గత కొంతకాలంగా ఎక్సైజ్ శాఖలోని పలువురు అధికారులపై అవినీతి ఆరోపణలు ఉన్నప్పటికీ వారికి రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదన్న ప్రచారం జరిగింది. ఓ అధికారి అయితే ఏకంగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా చేసిన వసూళ్ల పర్వం ఉన్నతాధికారుల వద్దకు చేరినప్పటికీ చర్యలు తీసుకోవడంలో




రాజకీయ నాయకుల ఒత్తిళ్లు అడ్డుగా నిలిచినట్లు ఆ శాఖలో ప్రచారం జరిగింది. నిషేధిత మత్తు పదార్థాలను కలిగివున్న కల్లు వ్యాపారిని రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డప్పటికీ వారి నుంచి భారీగా మామూళ్లు తీసుకొని వదిలేసినట్లు విమర్శలు ఉన్నాయి. అదేవిధంగా ఓ అధికారి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా వైన్ షాపులు, కల్లుబట్టీలు, బార్లు, పర్మిట్ రూముల నుండి భారీగా మామూలు వసూలు చేశారన్న ఫిర్యాదు ఉన్నతాధికారికి చేరిన చర్యలు తీసుకోలేదన్న విమర్శలు అప్పట్లో వ్యక్తం అయ్యాయి. అయితే అధికారి వసూలు చేసిన మామూళ్లను కిందిస్థాయి సిబ్బందికి పంచకపోవడంతో వారు అప్పటి డిప్యూటీ కమిషనర్ కు ఫిర్యాదు చేయడం ఎక్సైజ్ శాఖలో పెద్ద దుమారాన్ని రేపింది. అంతేకాకుండా కొందరి అధికారుల నెలసరి మామూళ్ల రూపంలో వచ్చే ఆదాయం లక్షల్లో ఉన్నట్లు తెలుస్తుంది.తమకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడంతో వారి అవినీతికి అడ్డు అదుపు లేకుండా పోయింది. ఇష్టారాజ్యాంగా వసూలు చేస్తూ కోట్ల రూపాయలు దండుకున్నట్లు విమర్శలు వ్యక్తమవుతున్నాయి. తమ అక్రమ వసూళ్లకు కిందిస్థాయి సిబ్బందిని వాడుకున్నట్లు అబ్కారీ శాఖలో ప్రచారం లో ఉంది. తాజాగా ఆదాయంకు మించి ఆస్తుల కేసులో ఏసీబీకి చిక్కిన మల్లారెడ్డికి సైతం ఆ శాఖలోని రిటైర్డ్ ఉద్యోగి వసూళ్లకు సహకరించారని అనుమానిస్తున్నారు. ఆదిశగా ఏసీబీ అధికారులు విచారణ మొదలుపెట్టినట్లు సమాచారం. ఇదిలా ఉండగా ఉన్నతాధికారి ఆదాయానికి మించి ఆస్తుల కేసులో ఏసీబీ కి చిక్కడంతో కిందిస్థాయి అధికారుల గుండెల్లో గుబులు మొదలైంది.

# మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు కృషి

### సంచార కేంద్రం ప్రారంభోత్సవంలో జిల్లా కలెక్టర్, ఎమ్మెల్యే




గద్వాల జూన్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : మహిళలు అన్ని రంగాల్లో రాణించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని, వివిధ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. సెర్ప్ ఆధ్వర్యంలో, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సహకారంతో బుధవారం గట్టు మండల కేంద్రంలోని మహిళా సమాఖ్య భవనం వద్ద మహిళా సంచార కేంద్రం ప్రారంభోత్స కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రంలోనే మొట్టమొదటిసారిగా గట్టు మండలంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నాలుగు ఎలక్ట్రికల్ స్కూటీలు, ఒక ఆటో, సైకిల్ ను కొనుగోలు చేసి డ్రైవింగ్ లో కిశోర బాలికలు, మహిళలకు శిక్షణ ఇవ్వడం జరుగుతోందన్నారు. మహిళలు డ్రైవింగ్ నేర్చుకునేందుకు వారి కుటుంబ సభ్యులు ప్రోత్సహించి, సహకరించాలని కోరారు. మహిళా సమాఖ్య తరపున ఈ వాహనాలను అద్దెకు ఇచ్చి కూడా సభ్యులు ఆదాయం పొందవచ్చన్నారు.మహిళా సంఘాలు ఇప్పటికే వరి ధాన్యం కొనుగోలు,తదితర కార్యకలాపాలను విజయవంతంగా నిర్వహిస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం తెలంగాణ ఇంక్లూజివ్ లైవ్లీహుడ్ ప్రోగ్రాంకు జిల్లాలో అత్యంత వెనుకబడ్డ గట్టు మండలంను ఎంపిక చేసినందున ఇక్కడి 14 గ్రామాల్లో 1033 కుటుంబాలను ఇప్పటికే గుర్తించామన్నారు. ఈ కుటుంబాలకు ప్రభుత్వం తరపున అన్ని సంక్షేమ పథకాలను వర్తింపజేయడమే కాక ఆర్థికంగా ఎదిగేందుకు బ్యాంకుల నుంచి సబ్సిడీ రుణాలను కూడా ఇప్పించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన మోవో స్వచ్ఛంద సేవా సంస్థ ప్రతినిధులను కలెక్టర్ ప్రత్యేకంగా అభినందించారు. గద్వాల శాసనసభ్యులు బండ్ల కృష్ణమోహన్ రెడ్డి మాట్లాడుతూ ఒకప్పుడు గట్టు మండలంలో వలసలు ఎక్కువగా ఉండేవని, ప్రజలు పేదరికంతో ఇబ్బంది పడే వారని, ప్రస్తుతం ఈ ప్రాంత అభివృద్ధికి చిత్తశుద్ధితో పని చేస్తున్నామన్నారు. మహిళల సాధికారత, స్వయం ఉపాధి, ఆర్థిక స్వావలంబనకు రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. గట్టు ప్రాంత మహిళల సంక్షేమం, రవాణా సౌకర్యాల మెరుగుదల కోసం మహిళా మొబిలిటీ సెంటర్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. మహిళా సంఘాలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా మరింత బలోపేతం కావాలని, గట్టు మండలంలో ప్రారంభమైన ఈ కార్యక్రమం రాష్ట్రానికే ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్, ఎమ్మెల్యే వాహనాలను ప్రారంభించి,ఆటోలో కాసేపు ప్రయాణించారు.

### స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించిన కలెక్టర్

అనంతరం జిల్లా కలెక్టర్ సమీపంలో అసంపూర్తిగా నిర్మించబడ్డ స్త్రీ శక్తి భవనాన్ని పరిశీలించారు. అలాగే పలువురు విద్యార్థులు చుట్టుపక్కల వివిధ ప్రభుత్వ విద్యాలయాల్లోని సమస్యలను కలెక్టర్ దృష్టికి తీసుకురాగా పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ గట్టులోని జడ్పీహెచ్ఎస్ ను సందర్శించి అక్కడి పరిసరాలను పరిశీలించారు. వివిధ సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో గట్టు సర్పంచ్ నాగరాజు, మోవో స్వచ్ఛంద సేవా సంస్థ సీఈఓ జయ భారతి, తహసిల్దారు విజయ్ కుమార్, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటేశ్వరి, ఏపీడి శ్రీనివాస్,డిపిఎం సలోమి, శిక్షకురాలు నందిని, ఇతర అధికారులు, నేతలు, మహిళా సంఘాల సభ్యులు, కిశోర బాలికలు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

## పే అప్‌గ్రేడేషన్, పి.ఆర్.పి సమస్యల పరిష్కారానికి సింగరేణి అధికారుల నిరసనలు కొనసాగింపు



కొత్తగూడెం బ్యూరో జూన్ 25(విజన్ ఆంధ్ర) : సింగరేణి అధికారుల దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న పి.ఆర్.పి. పే అప్‌గ్రేడేషన్ తదితర న్యాయమైన డిమాండ్ల పరిష్కారం కోసం కోల్ మైన్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా, సింగరేణి శాఖ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఈ నేపథ్యంలో బుధవారం సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు అధికారులు సమావేశమై బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేస్తూ నినాదాలు చేశారు. ఇప్పటికే గత జూన్ 17, 19 మరియు 22 తేదీలలో భారీ ర్యాలీలు, మహా ధర్నా కార్యక్రమాలు నిర్వహించినప్పటికీ సంబంధిత యాజమాన్యం మరియు ప్రభుత్వ స్థాయిలో ఎలాంటి సానుకూల స్పందన లభించలేదని అధికారులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారుల సమస్యలు, ప్రస్తుత పరిస్థితులు మరియు భవిష్యత్ కార్యాచరణను ప్రజలకు తెలియజేయడానికి మీడియా సమావేశం నిర్వహించినట్లు తెలిపారు. ఈ రోజు నుంచి సింగరేణి హెడ్ ఆఫీస్ ముందు ప్రతిరోజూ బ్లాక్ బ్యాడ్జీలు ధరించి నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తామని ప్రకటించారు. అలాగే 2026 జూన్ 29 నుంచి హెడ్ ఆఫీస్ ముందు రిలే నిరాహార దీక్షలు చేపట్టనున్నట్లు వెల్లడించారు. అధికారుల న్యాయమైన డిమాండ్లపై ప్రభుత్వం, యాజమాన్యం సానుకూలంగా స్పందించి సమస్యలను పరిష్కరించాలని కోరారు.

# ఊర పండుగ అమ్మవార్ల గద్దె పరిశీలించిన ఎమ్మెల్యే ధన్ పాల్

**- అదనంగా నిర్మించేందుకు కసరత్తు...**



నిజామాబాద్ జూన్ 24:( విజన్ ఆంధ్ర) ఆషాడ మాసంలో ఘనంగా నిర్వహించే ఊర పండగ అమ్మవార్ల గద్దెను భక్తుల సౌకర్యార్థం మార్పులు చేస్తున్నట్లు అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ తెలిపారు. సర్వ సమాజ్ కమిటీ పెద్దలతో కలిసి బుధవారం నగరంలోని ఖిల్లా ప్రాంగణంలో గల గద్దెలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. భక్తులకు దేవుళ్లు దూరం నుంచి కూడా కనపడేలా ఎత్తు పెంచుతున్నట్లు పేర్కొన్నారు. అలాగే గద్దె ను అదనంగా నిర్మించేందుకు కసరత్తు చేస్తున్నట్లు తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభించి ఊర పండగ కు సుందరంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. గద్దె వద్దకు ఇందూరు భక్తులు భారీగా తరలివస్తారని, ఇబ్బందులు కలగకుండా అదనపు నిర్మాణం చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే మొరంతో గద్దె చుట్టుపక్కల చదును చేయించాలన్నారు. అనంతరం సర్వ సమాజ కమిటీ పెద్దలు మాట్లాడుతూ.. ప్రతి సంవత్సరం ఆషాడ మాసం మూడో ఆదివారం ఊర పండుగ నిర్వహించుకోవడం ఆనవాయితీ అని పేర్కొన్నారు. అయితే ఈసారి సంకటహర చతుర్థి రావడంతో ఆలోచిస్తున్నట్లు పేర్కొన్నారు. ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గద్దె అదనపు నిర్మాణానికి సహకరించడం సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో సర్వసమాజ్ కమిటీ కార్యదర్శి బంటు రాజేశ్వర్, ఊర పండగ కన్వీనర్ రామర్తి గంగాధర్, స్థానిక కార్పొరేటర్ మల్కాయ్ మహేందర్, మున్నూరు కాపు సంఘం గాజులపేట అధ్యక్షుడు కొరడి కిరణ్, లక్ష్మీనారాయణ కొరడి నడిపి నరసయ్య, మను బ్రాహ్మణ సంఘం ప్రతినిధులు రవీందర్, రాజేందర్, లింబాద్రి, సంతోష్, సాయినాథ్, జితేందర్, బీజేపీ కార్పొరేటర్లు నాగోల్ల లక్ష్మీనారాయణ, బంటు ప్రీతి ప్రవీణ్, జ్యోతి మురళి, కల్పే అర్చనా చిరంజీవి, మాజీ కార్పొరేటర్ బాలకిషన్ తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థుల గొంతుకగా "చాత్రోన్"కి గూంజ్!!

**- నీట్ బాధితులకు అండగా కాంగ్రెస్, - విద్యార్థుల కన్నీళ్లకు, సమాధానం ఎవరు?**

**- పరీక్షల ఒత్తిడితో ప్రాణాలు కోల్పోతున్న విద్యార్థులు**

**- నీట్ వైఫల్యాలపై కేంద్రాన్ని నిలదీసిన ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్**

పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): దేశ యువత ఆకాంక్షలు, ఆవేదనలు, భవిష్యత్ ఆశయాలకు ప్రతిధ్వనిగా నిలుస్తున్న ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేపట్టిన "చాత్రోన్ కి గూంజ్" కార్యక్రమానికి మద్దతుగా రామగుండం ఎమ్మెల్యే రాజ్ ఠాకూర్ బుధవారం గళమెత్తారు.



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నీట్ పరీక్షల నిర్వహణలో కేంద్ర ప్రభుత్వ వైఫల్యాల కారణంగా విద్యార్థులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల కన్నీళ్లు, తల్లిదండ్రుల ఆవేదన, యువత భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిని దేశం వినాల్సిన అవసరం ఉందని తెలిపారు. ఈ నేపథ్యంలో రాహుల్ గాంధీ ప్రారంభించిన "చాత్రోన్ కి గూంజ్" దేశవ్యాప్తంగా విద్యార్థుల గొంతుకగా మారిందని అన్నారు. విద్యార్థుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, అందుకే వారి స్వరాన్ని దేశానికి వినిపించే ఉద్యమంగా ఈ కార్యక్రమం నిలుస్తోందని తెలిపారు. యువత కలలను కాపాడేందుకు, విద్యా వ్యవస్థలో పారదర్శకత తీసుకురావేందుకు కాంగ్రెస్ పార్టీ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. సమావేశంలో "చాత్రోన్ కి గూంజ్" పోస్టర్‌ను ప్రదర్శిస్తూ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లకు తమ సంపూర్ణ మద్దతు ఉంటుందని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ మహంకాళి స్వామి, డిప్యూటీ మేయర్ పాతపల్లి ఎల్లయ్య, కాంగ్రెస్ నాయకులు, పాల్గొన్నారు.

# పెద్దపల్లిలో గర్జించిన కమలదళం!!

**- రైతు హామీలపై కలెక్టరేట్ ముట్టడి బీజేపీ నిరసన, - సన్నాలకు బోనస్ ఇవ్వాలి**

**- రైతుబంధు రూ.15 వేలు చెల్లించాలి, - కాంగ్రెస్ సర్కార్‌కు అల్టిమేటం**

**- బీజేపీ ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం,**

**- ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి**




పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): ఎన్నికల వేళ కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు గుప్పించిన వాగ్దానాలు కాగితాలకే పరిమితమయ్యాయంటూ పెద్దపల్లి జిల్లా కేంద్రం బుధవారం రణరంగంగా మారింది. భారతీయ జనతా పార్టీ (బీజేపీ) పిలుపులో భాగంగా జిల్లా కలెక్టరేట్ ఎదుట నిర్వహించిన "రైతు ధర్నా" కార్యక్రమం సరికొత్త పంథాలో సాగింది. బీజేపీ ప్రధాన కార్యదర్శి పల్లె సదానందం ఆధ్వర్యంలో తరలివచ్చిన వందలాది మంది రైతులు, పార్టీ శ్రేణులు ప్రభుత్వ ప్రజావ్యతిరేక విధానాలపై నిప్పులు చెరిగారు. 33 రకాల సన్న బియ్యం రకాలకు తక్షణమే బోనస్ ప్రకటించాలి, రైతుబంధు పెట్టుబడి సాయాన్ని ఎకరానికి రూ. 15,000లకు పెంచి వెంటనే రైతుల ఖాతాల్లో జమ చేయాలి, నిలిచిపోయిన రైతు బీమాను తక్షణమే పునరుద్ధరించాలి అంటూ ఆకాశమంత నినాదాలతో కలెక్టరేట్ పరిసరాలను హోరెత్తించారు. ఈ ధర్నా కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన నాయకులు పల్లె సదానందం, బిజెపి ఓబీసీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కందుల సంధ్యారాణి, కాంగ్రెస్ సర్కార్ వైఫల్యాలను ఎండగడుతూ ప్రసంగించగా, రైతు లోకం తమ ఆవేదనను చాటుకుంది. కేవలం నినాదాలకే పరిమితం కాకుండా, ఒక క్రమశిక్షణ కలిగిన శైలిలో రైతుల సమస్యలన్నింటినీ క్రోడీకరిస్తూ తయారు చేసిన సమగ్ర వినతిపత్రాన్ని జిల్లా కలెక్టర్ కార్యాలయ పరిపాలనాధికారికి స్వయంగా అందజేశారు. అన్నదాతల కన్నీళ్లు తుడిచే వరకు, ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకునే వరకు బీజేపీ విశ్రమించబోదని, రాబోయే రోజుల్లో ఈ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని పల్లె సదానందం, కందుల సంధ్యారాణి ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ నిరసన జ్వాల జిల్లా వ్యాప్తంగా తీవ్ర చర్చనీయాంశంగా మారడమే కాకుండా, అధికార యంత్రాంగంలో సైతం ఒక్కసారిగా చలనం తెచ్చింది.

# రామగుండం పోలీసులకు సీపీ గిఫ్ట్!!

**- సిబ్బంది సంక్షేమమే మా తొలి ప్రాధాన్యత, - పోలీస్ సిబ్బందికి రెయిన్‌కోట్లు పంపిణీ**

**- వర్షం వచ్చినా విధికి ఆటంకం ఉండదు, - ఎండనకా వాననకా శ్రమించే సిబ్బందికి భరోసా**



పెద్దపల్లి బ్యూరో చీఫ్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా బుధవారం కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ సిబ్బంది సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకొని కీలక చర్య చేపట్టారు. వర్షాకాలంలో క్షేత్రస్థాయిలో నిరంతరం విధులు నిర్వహించే పోలీసుల కోసం ప్రత్యేకంగా రెయిన్‌కోట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎండనకా వాననకా రేయింబవళ్లు ప్రజాసేవలో నిమగ్నమయ్యే సిబ్బంది భద్రత, ఆరోగ్యం తమకు అత్యంత ప్రాధాన్యత అని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో, వర్షంలోనూ విధి నిర్వహణకు ఈ రెయిన్‌కోట్లు ఎంతగానో తోడ్పడతాయని తెలిపారు. సిబ్బంది ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండి, బాధ్యతాయుతంగా విధులు నిర్వర్తించాలని సూచించారు. వర్షాకాల సీజన్‌ను దృష్టిలో ఉంచుకొని ప్రతి ఒక్కరూ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని, వ్యక్తిగత ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని ఆయన కోరారు. పోలీస్ శాఖలో పనిచేసే వారి సంక్షేమానికి కమిషనరేట్ ఎప్పుడూ ముందుంటుందని ఈ కార్యక్రమం ద్వారా మరోసారి రుజువైందని అన్నారు. ఈ పంపిణీ కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ (అడ్మిన్) కె.శ్రీనివాస్ తో పాటు రిజర్వ్ ఇన్‌స్పెక్టర్లు శేఖర్, మల్లేశం, రమేష్ పాల్గొని సిబ్బందిని అభినందించారు. క్షేత్రస్థాయి సిబ్బంది నిస్వార్థ సేవలను గుర్తిస్తూ తీసుకున్న ఈ చర్యపై పోలీస్ వర్గాల్లో హర్షం వ్యక్తమవుతోంది.

# ప్రభుత్వ పాఠశాలల క్రీడా నిధుల గోల్మాల్?

**- పాఠశాలల్లో విద్యార్థుల పూర్తిస్థాయిలో ఆటల వస్తువులు లేవు??**

**- పాత వస్తువులనే కొత్త వస్తువులుగా కొన్నట్లు చూపిస్తున్న ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు ?**

**- క్రీడాన్నిధుల దుర్వినియోగంపై నాగర్ కర్నూల్ జిల్లా విద్యాశాఖ అధికారుల నిఘా కరువు?**

**- పలుమార్లు జిల్లా ప్రజావాణిలో ప్రభుత్వ పాఠశాలలో క్రీడా వస్తువుల దుర్వినియోగంపై ఫిర్యాదు చేసిన ఫలితం శూన్యం!**

**- తక్షణమే నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ స్పందించాలి, అంటున్న పాఠశాల విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు!!**







కొల్లాపూర్ జూన్ 24 : (విజన్ ఆంధ్ర) : తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా పాఠశాలలకు మంజూరైన 25000 వెయ్యిల క్రీడా నిధులు పక్కదారిపై , ప్రభుత్వ పాఠశాలల క్రీడా నిధుల దుర్వినియోగంపై ,తల్లిదండ్రులు, విద్యార్థి సంఘాలు తీవ్ర ఆందోళనలు చెందుతున్నారు. కొందరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు ,పి ఈ టి లు కలిసి నకిలీఫేక్ బిల్లుల ద్వారా పాఠశాలలో ఉన్న స్టాక్ రిజిస్టర్లలో లావాదేవీలు నమోదు చేసినట్లు ఆరోపణలు వస్తున్నాయి. జూన్ మాసంలో పాఠశాలలు ప్రారంభం కావడంతో పాఠశాలలో నూతన ఆటవస్తువు లేవు పాత వస్తువు ఉన్న విషయం ఈ మధ్యనే ఆలస్యంగా వెలుగులోకి వస్తుంది.

**పాఠశాలల క్రీడానిధుల గోల్మాల్ లో హెడ్మాస్టర్లే తప్పు చేస్తే ఎలా??**

తల్లిదండ్రుల తర్వాత గురువులనే దేవుళ్ళుగా భావించే ఈతరుణంలో కొందరు ప్రధానోపాధ్యాయులే పాఠశాల నిధులను మింగేస్తూ ఆర్థిక నేరానికి అలవాటు పడుతున్నారు. ఇక మమ్మల్ని అడిగేవాడు ఎవడు లే?? అన్నట్లుగా నిర్లక్ష్యపు విధి నిర్వహణలో ఈపంతులు పాఠశాలలో కొనసాగుతున్నారు.జిల్లా కలెక్టర్ జిల్లా విద్యాశాఖ అధికారులు వెంటనే నాగర్ కర్నూలు జిల్లాలో ఉండే జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు పెంట్లవెల్లి మండల పట్టణంలో ఉండే జిల్లా పరిషత్ (బాలుర) ,జిల్లా పరిషత్ (బాలికల )ఉన్నత పాఠశాలలను తనిఖీలు చేసి వాస్తవంగా జిఎస్టి బిల్లులతో పాఠశాలలో 25 వేల రూపాయల క్రీడా నిధులకు సంబంధించిన ఆట వస్తువులు ప్రధానోపాధ్యాయులు పీఈటీలు కలిసి కొనుగోలు చేశారా ?లేదా చైనా బజారులో కొనుగోలు చేసి చైనా బజార్ బిల్లులను స్టాక్ రిజిస్టర్లలో రాసి ఉంచారా ?అనే అంశంపై క్షుణ్ణంగా తనిఖీలు జరగాలని స్థానికులు విద్యార్థులు కోరుతున్నారు ,లేనిపక్షంలో వెంటనే చర్యలు చేపట్టాలని విద్యార్థి సంఘాలు కోరుతున్నారు.

**తనిఖీలకు వచ్చిన పై అధికారులను మేనేజ్ చేసుకుంటే అంతా దోచుకోవచ్చు**

తనిఖీలకు వచ్చిన జిల్లా స్థాయి అధికారులకు పాఠశాల తరగతి గదులలో ఒక ప్రైవేటు గదిలో చిన్నపాటి విందు మందు దావతులతో వారిని మంచిగా చేసుకుంటే ఈ క్రీడా నిధులను మింగేయచ్చని అలవాటు పడ్డ కొందరు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, పీఈటీలు ఈ ఆర్థిక నేరానికి తరచు అలవాటు పడుతున్నారు అని స్థానికులు ఆరోపణలు చేస్తున్నారు. పాఠశాలలకు వస్తున్న గ్రాండ్స్ నిధులు పక్కదారి వెళ్లకుండా చూసే పై అధికారులు కిందిస్థాయి పాఠశాల పంతులతో చేతులు కలిపి అందరూ ఒక గూటికి చేరి అన్ని కరెక్ట్ ఉన్నట్లుగా రికార్డులను చూపిస్తూ జిల్లాస్థాయి కలెక్టర్లను తప్పుదోవ పట్టిస్తూ విద్యార్థుల క్రీడా నిధులను దోచుకుంటున్నారు.

**తక్షణమే నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ స్పందించాలి**

ప్రభుత్వ పాఠశాలలో క్రీడానిధుల దుర్వినియోగం గోల్మాల్పై , తక్షణమే నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ స్పందించాలని తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు. పాఠశాలల తనిఖీల్లో భాగంగా విద్యార్థులకు నాణ్యమైన చదువు రుచికరమైన మంచి వంటలతో పాటు పాఠశాలలో నూతన క్రీడా వస్తువులు ఉన్నాయా? లేవా? అలాగే పాఠశాలలో గ్రంథాలయంలో పుస్తకాలు ఉన్నాయా? లేవా అని అంశంపై క్షుణ్ణంగా తనిఖీలు జరగాలని, పర్యవేక్షణకు వచ్చిన అధికారులు విద్యార్థులతో ఆట వస్తువులతో ఆటలు ఆడాలని విద్యార్థుల తల్లిదండ్రులు కలెక్టర్ ను చేతులు జోడించి కోరారు.

**లేనిది ఉన్నట్లు ఉన్నది లేనట్లు బిల్లులన్నీ ఒకే అంటున్న తనిఖీల మాస్టర్లు!**

ఇక క్రీడానిధుల జీఎస్టీ బిల్లులను చెక్ చేయడానికి వస్తున్న జిల్లా విద్యాశాఖ అధికారికి, తనిఖీకి వస్తున్న ఇతర మాస్టర్లకు ఒక్కొక్క పాఠశాలకు రేటును ఫిక్స్ చేసి కమిషన్లు ఇస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి, నాణ్యతలేని చైనా బజార్ ఇతర షాపులలో లభించే ఆట వస్తువులను కొనుగోలు చేస్తున్నారు, మరికొందరు జిఎస్టి పర్మిషన్ ఉన్న షాపులలో షాపు యజమానితో చేతులు కలిపి షాపు ఓచర్ బిల్లుల స్లిప్పులను ఇంటికి తెచ్చుకొని ఇంటి దగ్గరే వాటిపై వస్తువులు ఉన్నట్లు నచ్చిన రాతలు రాస్తూ కొనుగోలు చేయకుండానే కొనుగోలు చేసినట్లు కొన్ని వస్తువులను ఆ బిల్ పేపర్ పై రాసుకొని 25000 రూపాయలు కొనుగోలు చేసినట్లు సృష్టిస్తున్నారు .కొన్ని పాఠశాలల ఉపాధ్యాయులు. జీఎస్టీ బిల్లులో కొనుగోలు చేశామని తప్పుడు లెక్కలను రాస్తూ జిల్లా స్థాయి పై అధికారులను కలెక్టర్ ను తప్పుదోవ పట్టిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు తల్లిదండ్రులు విద్యార్థులు ఆరోపణలు చేస్తున్నారు. పాఠశాల అకౌంట్ కు క్రీడా నిధులు రావడంతో ఇందులో ప్రధానంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులే ఈ ఆర్థిక నేరానికి అలవాటు పడి నిధులను మింగడానికి ప్రధాన కారకులుగా మిగులుతున్నారని ఆరోపణలు వస్తున్నాయి ,అక్కడక్కడ కొందరు హెడ్మాస్టర్లు పీఈటీలకు కొంత మేరకు డబ్బులు ఇచ్చి కొన్ని వస్తువులనే కొనుగోలు చేసి తీసుకురావాలని వాళ్లకు వాళ్లకు మధ్య చిన్నపాటి మాటల అలిగేషన్తో తప్పని పరిస్థితిలో పీటీలు ప్రధానోపాధ్యాయులు ఇచ్చిన కొద్దిపాటి డబ్బులను తీసుకొనీ కొన్ని క్రీడా వస్తువులను కొనుగోలు చేసి పాఠశాలలో ఉంచుతున్నారని స్థానికులు అంటున్నారు. ఇలా విద్యార్థులకు ప్రభుత్వం నుండి ఇటీవల 25వేల రూపాయలు క్రీడా నిధులు మంజూరు చేస్తే ఆ క్రీడా నిధులను మింగేస్తూ ఆర్థిక నేరానికి అలవాటు పడుతున్న ప్రధానోపాధ్యాయులపై పీఈటీ లపై తక్షణమే చర్యలు చేపట్టి, ఆన్లైన్ ట్రాన్సాక్షన్ తో ఆన్లైన్ వస్తువుల పార్ట్ నెంబర్ ప్రింటింగ్ జిఎస్టి బిల్లులనే పరిగణలోకి తీసుకోవాలని జీవో చెబుతుందని క్రీడా నిధుల మంజూరు జీవో ప్రకారమే 22 రకాల ఆట వస్తువులు కొనుగోలు చేయాలని, ఎక్కడైతే లోపం ఉందో వాళ్లను పసిగట్టి వాళ్లపై ఆర్థిక నేరం కింద చర్యలు చేపట్టాలని నాగర్ కర్నూల్ జిల్లా కలెక్టర్ ను విద్యార్థుల తల్లిదండ్రులు విద్యార్థి సంఘాల నాయకులు స్థానికులు చేతులు జోడించ కోరుతున్నారు. లేనిపక్షంలో విద్యార్థి సంఘాల నాయకులు ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని వాళ్ళు హెచ్చరికలు చేశారు. ఈ విషయంపై జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో డీఈఓ గారి వివరణ కోరగా స్టాక్ రిజిస్టర్లు కరెక్టే ఉన్నాయి కదా మేము స్టాక్ రిజిస్టర్ లను చెక్ చేస్తామని అని ఆయన అన్నారు.క్రీడా వస్తువుల పైన ఎంక్వయిరీ జరిపిస్తున్నామని ప్రతి పాఠశాలలో పూర్తిస్థాయిలో క్రీడా వస్తువులు ఉండే చర్యలు చేపడతామని ఆయన చెప్పుకొచ్చారు.

# ప్రతి సంక్షేమ పథకం పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ఆకాంక్ష

**- "ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి**

నిర్మల్ జిల్లా, జూన్ 24,(విజన్ ఆంధ్ర); ప్రభుత్వం అమలుపరుస్తున్న ప్రతి సంక్షేమ పథకం క్షేత్రస్థాయిలో పేదలందరికీ చేరాలన్నదే ప్రభుత్వ ప్రధాన ఆకాంక్ష అని "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి అన్నారు. "ప్రజాపాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష ప్రత్యేక అధికారి ఇలంబర్తి, బుధవారం కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో 99 రోజుల ప్రణాళిక కార్యక్రమాలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ముందుగా 99 రోజుల ప్రణాళికలో శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాలకు సంబంధించి ఫోటో గ్యాలరీని కలెక్టర్, అధికారులతో కలిసి తిలకించారు. శాఖల వారిగా చేపట్టిన కార్యక్రమాల వివరాలు అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా సమగ్రంగా వివరించారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారి మాట్లాడుతూ, అన్ని శాఖలు 99 రోజుల ప్రత్యేక కార్యక్రమాలు అన్ని శాఖల అధికారులు విజయవంతంగా నిర్వహించారని ప్రశంసించారు. భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగిస్తూ శాఖల వారీగా సంబంధిత పథకాలు, సంక్షేమ ఫలాలు అన్ని అట్టడుగు వర్గాల ప్రజలకు చేరే విధంగా



అధికారులు కృషి చేయాలన్నారు. స్పష్టమైన ప్రణాళికతో ప్రజా పాలన కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు అధికారులకు శుభాకాంక్షలు తెలిపారు. అధికారులు వెల్లడించిన నివేదికలపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. పోలీసు శాఖ చేపట్టిన ప్రత్యేక కార్యక్రమాల వల్ల జిల్లాలో రోడ్డు ప్రమాదాలు తగ్గుముఖం పట్టాయన్నారు. ఇన్నోవేటివ్ ఆలోచనలతో అధికారులు ముందుకు సాగాలన్నారు.

**ప్రజల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" విజయవంతం.**

**జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.**

ప్రజలు, ప్రజా ప్రతినిధుల సమిష్టి భాగస్వామ్యం, అధికారుల కృషితోనే "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" కార్యక్రమం జిల్లాలో విజయవంతంగా పూర్తి చేశామని జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా తెలిపారు. ప్రత్యేక ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో పెద్ద ఎత్తున పారిశుద్ధ్య కార్యక్రమాలు, గ్రామ, వార్డు సభలు, పెండింగ్ ఫైల్స్ క్లియరెన్స్, అరైవ్ అలైవ్ కార్యక్రమం, రైతు, మహిళా శిశు సంక్షేమ, విద్యా ఆరోగ్య, సంస్కృతిక, పర్యావరణ వారోత్సవాల పేరిట విస్తృత కార్యక్రమాలు చేపట్టామన్నారు. గ్రామ, వార్డు సభలు నిర్వహించి అధికారులంతా ప్రజల వద్దకే వెళ్లి వారి సమస్యలను తెలుసుకొని పరిష్కరించినట్లు వివరించారు. దీర్ఘ కాలికంగా పెండింగ్లో ఉన్న అంశాలను పరిష్కరించినట్లు చెప్పారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పంటల దిగుబడి అధికంగా వచ్చిందని, అధికారుల సమన్వయంతో రైతులకు ఇబ్బందులు కలగకుండా అన్ని పంటలను కొనుగోలు చేశామన్నారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని ధాన్యం నిల్వ ఉంచేందుకు అవసరమైన గోదాములను నిర్మిస్తామని చెప్పారు. రెవెన్యూ కు సంబంధించిన అంశాలన్నీ తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. మహిళా సంఘాలకు పెట్రోల్ బంక్ నిర్మించనున్నట్లు పేర్కొన్నారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్ లు బి. వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, డిఎఫ్ఓ సుశాంత్ సుఖదేవ్ బోబడే,భైంసా సబ్ కలెక్టర్ అజ్మీరా సంకేత్ కుమార్, డిఆర్ఓ రాథోడ్ రమేష్, వివిధ శాఖల అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులు చక్కటి ప్రణాళికతో చేపట్టాలి

**- జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి**



కడప,జూన్ 24:( విజన్ ఆంధ్ర) జిల్లాలో సమగ్ర శిక్ష అభియాన్ ప్రాజెక్టు ద్వారా ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టనున్న అభివృద్ధి పనులను ప్రణాళికాబద్ధంగా, నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో జిల్లా కలెక్టర్ డా. శ్రీధర్ చెరుకూరి అధ్యక్షతన సమగ్ర శిక్ష అభియాన్ ఆధ్వర్యంలో జిల్లాలోని ఎంపిక చేసిన పాఠశాలల్లో చేపట్టనున్న పనుల పురోగతిపై సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మోడల్ పాఠశాలల అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర ప్రణాళిక నివేదికలను సిద్ధం చేసి పనులను చేపట్టాలని సూచించారు. జిల్లాలో ఎంపిక చేసిన 396 పాఠశాలల్లో అభివృద్ధి పనులన్నీ మండల విద్యాశాఖ అధికారుల పర్యవేక్షణలో నిర్వహించాలని తెలిపారు. ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, పురపాలక మరియు గ్రామీణ నీటి సరఫరా, పంచాయతీ రాజ్ ఇంజినీరింగ్ శాఖల అధికారుల సమన్వయంతో పనులను అమలు చేయాలన్నారు.మోడల్ పాఠశాలలుగా గుర్తింపు పొందే పాఠశాలల్లో అవసరమైన అన్ని మౌలిక సదుపాయాలు కల్పించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఉత్తమ మోడల్ పాఠశాలలుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన వసతులు, అభివృద్ధి అవసరాలపై నివేదికలు సిద్ధం చేయాలని సూచించారు. మండల స్థాయి కమిటీలలో ఎంఈఓ-1, ఎంఈఓ-2లు, ప్రధానోపాధ్యాయులు, ఇంజినీరింగ్ సిబ్బంది సమన్వయంతో బాధ్యతాయుతంగా పనులు నిర్వహించాలని తెలిపారు. రెండో దశ "మన బడి మన భవిష్యత్తు" కార్యక్రమంలో పెండింగ్‌లో ఉన్న నిధులను సమర్థవంతంగా వినియోగించేలా కార్యాచరణ ప్రణాళికలు రూపొందించాలని చెప్పారు. పాఠశాలల్లో అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, మరమ్మతు పనులను సకాలంలో పూర్తి చేసి నాణ్యతను కాపాడాలని అధికారులకు సూచించారు. సమావేశంలో సమగ్ర శిక్ష అభియాన్ అదనపు పథక సమన్వయకర్త అనురాధ, గ్రామీణ నీటి సరఫరా విభాగం ప్రధాన ఇంజినీరు ఏడుకొండలు, కడప పురపాలక సంస్థ ప్రధాన ఇంజినీరు చెన్నకేశవరెడ్డి, ఉప జిల్లా వ్యవసాయ అధికారి రాజగోపాల్ రెడ్డి, ఎంఈఓలు, మున్సిపల్, పీఆర్ ఇంజినీరింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూములు ఇచ్చిన రైతులకు చెక్కులు అందజేత

**- జిల్లా కలెక్టర్ మన చౌదరి,**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 24 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి భూమి ఇచ్చిన తూంకుంట రైతులకు చెక్కులు అందజేసిన మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టర్ మను చౌదరి. బుధవారం కలెక్టర్ తన ఛాంబర్లో సికింద్రాబాదు నుండి శామీర్ పేట్ వరకు రాజీవ్ రహదారి నిర్మాణానికి తూంకుంట గ్రామంలో 24 ఏకరాలకు గాను మూడవ విడతగా, స్థలాన్ని ఇచ్చిన



రైతులకు డిఆర్ఓ మాలతితో కలిసి కలెక్టర్ 86 కోట్ల రూపాయల చెక్కును అందజేసారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, మూడవ దఫాగా ఈ చెక్కులు అందించడం జరిగిందని, మిగిలిన వారికి తరువాత అందించడం జరుతుందని తెలిపారు.

# ఎస్ఐఆర్ -2026 ఓటరు చైతన్యానికి 2కే రన్ నిర్వహణ

**- జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**



గద్వాల జూన్ 24 (విజన్ ఆంధ్ర బ్యూరో) : రాష్ట్ర , కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రత్యేక సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)-2026లో భాగంగా ఓటరు చైతన్యాన్ని పెంపొందించేందుకు 2కే రన్ కార్యక్రమాన్ని 25వ తేదీ గురువారం ఉదయం 6:30 గంటలకు గద్వాల జిల్లా కేంద్రంలో నిర్వహించనున్నట్లు జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ 2కే రన్ ఐడీఓసీ (ఐడిఓసి) సముదాయం, గద్వాల నుండి ప్రారంభమై కృష్ణవేణి చౌక్, గద్వాల వరకు కొనసాగుతుందని, ఇందులో ఓటరు జాబితా ప్రత్యేక సవరణ, ఓటరు నమోదు, ప్రజాస్వామ్య ప్రక్రియలో ప్రతి పౌరుడు భాగస్వామ్యం కావాల్సిన అవసరంపై ప్రజల్లో అవగాహన కల్పించడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని ఆయన తెలిపారు. విద్యార్థులు, యువత, ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, స్వచ్ఛంద సంస్థల సభ్యులు మరియు సాధారణ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమం సజావుగా నిర్వహించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు చేసిందని, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొనేలా సామాజిక మాధ్యమాలు, ప్రజా ప్రకటనలు ఇతర సమాచార మార్గాల ద్వారా విస్తృత ప్రచారం నిర్వహించబడుతోందన్నారు. అందరు ఉదయం 6.30 గంటలకు ఐడీఓసీ సముదాయానికి చేరుకోవాలని సూచించారు.

# కూలిన ఇళ్ల బాధితులకు రెడ్‌క్రాస్ చేయూత

**- అవసరమైన సామగ్రి అందజేసిన చైర్మన్ డాక్టర్ ఏ. అప్పయ్య.**



ములుగు జూన్ 24, విజన్ ఆంధ్ర ప్రతినిధి : బుధవారం : వెంకటాపురం మండలం ఇంచన్చెరువుపల్లి గ్రామానికి చెందిన నూనావత్ మోహన్ దాస్, బండి నరసమ్మ ఇళ్లు పూర్తిగా దెబ్బతిని కూలిపోయిన విషయం తెలుసుకున్న రెడ్‌క్రాస్ జిల్లా చైర్మన్ డాక్టర్ ఏ. అప్పయ్య వెంటనే స్పందించారు. బాధిత రెండు కుటుంబాలకు ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో టార్పాలిన్ కవర్లు, కిచెన్ సెట్స్, దుప్పట్లు, లుంగీలు, చీరలు, టవల్స్ పంపిణీ చేశారు. తక్షణ ఉపశమనం కోసం అవసరమైన సామగ్రిని అందజేసి బాధితులకు భరోసా కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఏ. అప్పయ్య మాట్లాడుతూ, "ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ ఎల్లప్పుడూ నిరుపేదలకు, ఆపదలో ఉన్నవారికి అండగా ఉంటుంది. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన కుటుంబాలను ఆదుకోవడం మా ప్రథమ కర్తవ్యం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో రెడ్‌క్రాస్ సొసైటీ వైస్ చైర్మన్ గంగిశెట్టి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి చుంచు రమేష్, కామా అశోక్, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్య, మౌలిక వసతులు కల్పించాలి

**- జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి**

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు అన్ని మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం పెద్దమందడి మండల కేంద్రంలోని బీసీ బాలుర సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించారు. ఇటీవల హాస్టల్‌లో చేపట్టిన మరమ్మతు పనులను పరిశీలించారు. హాస్టల్ విద్యార్థుల సంఖ్య, వసతి గృహ నిర్వహణపై ఆరా తీశారు. హాస్టల్‌లో విద్యార్థుల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం వంటశాలను పరిశీలించి, వంట గ్యాస్ కనెక్షన్ తప్పనిసరిగా అందుబాటులో ఉండేలా చూడాలని సిబ్బందికి సూచించారు. విద్యార్థులకు ఉత్తమ సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. హాస్టల్‌కు ప్రహరీ గోడ నిర్మాణం అవసరమని సిబ్బంది కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, వెంటనే ప్రతిపాదనలు సిద్ధం చేసి పంపించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం పెద్దమందడి జడ్పీహెచ్ఎస్ ప్రభుత్వ పాఠశాలను సందర్శించిన కలెక్టర్ పాఠశాల భవనాలు, విద్యార్థులకు అందుతున్న సౌకర్యాలను పరిశీలించారు. విద్యార్థుల అవసరాలను దృష్టిలో ఉంచుకొని మరుగుదొడ్డి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని అధికారులకు సూచించారు. పాఠశాలకు అవసరమైన ఇతర మౌలిక వసతుల కోసం ప్రతిపాదనలు పంపాలని ఆదేశించారు. స్పెషల్



ఇంటెన్సివ్ రివిజన్ లో భాగంగా పెద్దమందడిలో చేపట్టిన అవగాహన ర్యాలీ ని కలెక్టర్ పరిశీలించి, ప్రజల్లో ఎస్ ఐ ఆర్ పై విస్తృత అవగాహన కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

**ఇందిరమ్మ ఇండ్ల పరిశీలన**

మండలకేంద్రం లో నిర్మాణంలో ఉన్న ఇందిరమ్మ ఇళ్లను కలెక్టర్ పరిశీలించారు. షేర్‌వాల్ టెక్నాలజీతో సుజాత అనే లబ్ధిదారులు నిర్మిస్తున్న గృహాన్ని సందర్శించి పరిశీలించారు. నిర్మాణ వ్యయం, పనుల పురోగతిపై వివరాలు తెలుసుకున్నారు. తక్కువ వ్యయంతో, వేగవంతంగా గృహ నిర్మాణం చేపట్టేందుకు ఈ సాంకేతికత ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. షేర్‌వాల్ టెక్నాలజీని మరింత మంది ప్రజలకు చేరవేసి ప్రోత్సహించాలని ఎంపీడీవోను



ఆదేశించారు. మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో షేర్‌వాల్ టెక్నాలజీకి అవసరమైన అల్యూమినియం మెటీరియల్‌ను కొనుగోలు చేసి జిల్లాలో ఈ నిర్మాణ విధానాన్ని విస్తృతంగా ప్రోత్సహించేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. మరో ఇద్దరు లబ్ధిదారులు నాగమ్మ, కృష్ణయ్యల ఇండ్లను సందర్శించి ఇండ్ల నిర్మాణాల కోసం వారికి అవుతున్న ఖర్చు గురించి ఆరా తీశారు. ఇంటి నిర్మాణం కోసం ఎక్కడ అప్పు తీసుకోవద్దని లబ్ధిదారులకు సూచించారు. ఆర్థిక ఇబ్బందులు ఉన్న లబ్ధిదారులను గుర్తించి వారికి మహిళా సంఘాల ద్వారా రుణాలను ఇప్పించే సౌకర్యాన్ని ఏర్పాటు చేయాలని ఎంపీడీవోను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ విటోభా, తహసీల్దార్ మల్లికార్జున,ఎంపీడీఓ పరిణత సర్పంచ్ నాగమ్మ, సంబంధిత శాఖల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# అంగన్‌వాడీలే పిల్లల సర్వతోముఖ వికాసానికి పునాది - డీడబ్ల్యూఓ ప్రేమలత

**- బండారుపల్లిలో స్కూల్ లో రెడీనెస్ మేళా నిర్వహణ**



ములుగు జూన్ 24 ,విజన్ ఆంధ్ర ప్రతినిధి : పిల్లలలో శారీరక, మానసిక, భాషా, మేధో, పూర్వ గణిత నైపుణ్యాలు అభివృద్ధి చెందాలంటే ప్రతి ఒక్కరూ తమ పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపాలని జిల్లా సంక్షేమ అధికారి ప్రేమలత పిలుపునిచ్చారు. మంగళవారం బండారుపల్లి వన్ అంగన్‌వాడీ కేంద్రంలో ప్రథమ్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్కూల్ రెడీనెస్ మేళా కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అంగన్‌వాడీ కేంద్రాలు కేవలం పౌష్టికాహారం అందించడానికే పరిమితం కాకుండా, పిల్లల బాల్య విద్యకు బలమైన పునాది వేస్తున్నాయని తెలిపారు. ములుగు ప్రాజెక్టు సీడీపీవో శిరీష మాట్లాడుతూ, అంగన్‌వాడీల ద్వారా పిల్లలకు పాలు, గుడ్డుతో పాటు పౌష్టికాహారం అందిస్తున్నామని, దీనివల్ల వారిలో శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు పూర్వ గణిత భావనలు కూడా అభివృద్ధి చెందుతాయని వివరించారు.

# ద్వంద్వ ఓటరు నమోదు చట్ట విరుద్ధం

**- కలెక్టర్ బోర్ఖడే హేమంత్**



ములుగు జూన్ 24, విజన్ ఆంధ్ర ప్రతినిధి : ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ చోట్ల ఓటరుగా నమోదు కావడం చట్ట విరుద్ధమని, తప్పుడు సమాచారం, ద్వంద్వ నమోదులపై కఠిన చర్యలు తప్పవని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు హెచ్చరించారు. ఓటరు జాబితా స్వచ్ఛత, ఖచ్చితత్వ పరిరక్షణకు ప్రజా ప్రాతినిధ్య చట్టం 1950 సెక్షన్లు 17, 18, 31 నిబంధనలను కఠినంగా అమలు చేస్తున్నామని, ప్రజలు తమ వివరాలు సరిచూసుకొని ఒకటి కంటే ఎక్కువ నమోదులుంటే వెంటనే ఎన్నికల అధికారులకు తెలపాలని కోరారు.

# ఓటరు జాబితా సవరణకు రాజకీయ పార్టీల సహకారం అవసరం


**- ఆర్‌డీఓ కృష్ణవేణి.**



ములుగు జూన్ 24 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : బుధవారం కలెక్టరేట్ వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో ములుగు నియోజకవర్గ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జరిగిన సమావేశంలో ఆమె మాట్లాడారు. జూన్ 25 నుంచి జూలై 1 వరకు ఇంటింటి సర్వే ద్వారా ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ జరుగుతుందని, అర్హులైన ప్రతి ఓటరుకూ ఫారాలు అందేలా బీఎల్‌ఏలు చురుకుగా పాల్గొనాలని సూచించారు. బూత్ లెవల్ ఏజెంట్లు-1 తమ బీఎల్‌ఏ-2లకు గుర్తింపు కార్డులు జారీ చేసి ఎన్నికల సిబ్బందితో సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ఓటరు జాబితా నాణ్యతను మెరుగుపరిచి, అర్హులైన ప్రతి పౌరుని పేరు నమోదు చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈఆర్ఓ తహసిల్దార్ విజయభాస్కర్, ఎన్నికల సూపరింటెండెంట్ సలీం, డిప్యూటీ తహసిల్దార్ నితీష్ కుమార్, వివిధ రాజకీయ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

# క్రీడా రంగంలో ములుగు జిల్లా సత్తా - మంత్రి సీతక్క


**- అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి రూ.4 కోట్లు మంజూరు.**



ములుగు జూన్ 24 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ములుగు ప్రభుత్వ హైస్కూల్ మైదానంలో నిర్వహించిన ఒలింపిక్ డే రన్ 2026 కార్యక్రమంలో మంత్రి సీతక్క, కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావుతో కలిసి క్రీడా జ్యోతిని వెలిగించి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, మారుమూల ప్రాంతమైనప్పటికీ ములుగు జిల్లా క్రీడాకారులు వాలీబాల్, ఆర్చరీ వంటి క్రీడల్లో జాతీయ స్థాయిలో పతకాలు సాధిస్తున్నారని కొనియాడారు. క్రీడాకారులకు మెరుగైన వసతులు కల్పించేందుకు అథ్లెటిక్స్ స్టేడియం నిర్మాణానికి వెంటనే రూ.4 కోట్లు మంజూరు చేశామని, అవసరమైన అదనపు సదుపాయాలకు ప్రభుత్వ సహకారం ఉంటుందని స్పష్టం చేశారు. విద్యార్థులు శారీరకంగా దృఢంగా ఉండి క్రీడలపై ఏకాగ్రతతో ముందుకు సాగి జిల్లా ఖ్యాతిని పెంచాలని, తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, గ్రంథాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, డీఈవో సిద్ధార్థ రెడ్డి, డీఎస్పీ రవీందర్, జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ పగడాల వెంకటేశ్వర రెడ్డి, పీడీలు, పీఈటీలు పాల్గొన్నారు.

# ములుగు మున్సిపాలిటీలో భువన్ సర్వే ముమ్మరం.

**- ఆస్తుల కొలతలు, జియో ట్యాగింగ్‌తో పన్నుల వ్యవస్థలో పారదర్శకత.**



ములుగు జూన్ 24 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : కమిషనర్ & డైరెక్టర్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ ఆదేశాల మేరకు ములుగు మున్సిపాలిటీ పరిధిలో భువన్ సర్వే ద్వారా ఆస్తుల కొలతలు, జియో ట్యాగింగ్, ఆన్‌లైన్ అప్‌డేట్ కార్యక్రమం ముమ్మరంగా కొనసాగుతోంది. మున్సిపాలిటీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి భవనాల విస్తీర్ణం, వినియోగ విధానం వంటి వివరాలను సేకరించి భువన్ పోర్టల్‌లో నమోదు చేస్తున్నారు. ప్రస్తుతం వివిధ వార్డుల్లో సర్వే బృందాలు క్షేత్రస్థాయిలో పరిశీలనలు నిర్వహిస్తూ ఆస్తుల సమాచారాన్ని నవీకరిస్తున్నాయి. ఈ సర్వేతో మున్సిపాలిటీ రికార్డులు ఖచ్చితత్వంతో ఉండటంతో పాటు పన్నుల నిర్వహణ మరింత పారదర్శకంగా మారి పౌర సేవల అందజేత మెరుగుపడనుంది. పట్టణ ప్రజలు సహకరించి తమ ఇండ్లు, భవనాలకు సంబంధించిన సరైన వివరాలను సిబ్బందికి అందించాలని మున్సిపల్ కమిషనర్ జే సంపత్ కోరారు.

# యువతను విస్మరిస్తే బిజెపి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవు

**- డిసిసి చీఫ్ శివసేన రెడ్డి ధ్వజం**




వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : కేంద్రంలో బిజెపి ప్రభుత్వం విద్యార్థి భవిష్యత్తుతో చెలగాటమాడుతుందని, యువతను విస్మరిస్తే బిజెపి ప్రభుత్వానికి పుట్టగతులు ఉండవని ఘాటుగా విమర్శించారు. యువత దేశానికి వెన్నెముక వంటిదని, ఆ యువతే భారత దేశ భవిష్యత్తు అని డిసిసి చీఫ్, రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ చైర్మన్ శివసేన రెడ్డి అన్నారు. బుధవారం కాంగ్రెస్ పార్టీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.."ఛాత్రోన్ కి గుంజ్" నినాదంతో విద్యార్థుల సమస్యలపై గళమెత్తాలన్నారు. అలాగే ప్రశ్నాపత్రాల లీకులు, పరీక్షల రద్దులు, ఉద్యోగ నియామకాలలో జాప్యం, పెరుగుతున్న నిరుద్యోగం, విద్యా వ్యవస్థలో నెలకొన్న వైఫల్యాలపై విద్యార్థులు, యువత గళమెత్తాలని, విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు "ఛాత్రోన్ కి గుంజ్" నినాదంతో ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వ హయాంలో విద్యా వ్యవస్థ తీవ్ర సంక్షోభంలోకి వెళ్లిందన్నారు. పోటీ పరీక్షల ప్రశ్నాపత్రాల లీకేజీలు, పరీక్షల రద్దులు విద్యార్థుల కష్టాన్ని వృథా చేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. లక్షలాది ఖాళీ ఉద్యోగాలు ఉన్నప్పటికీ నియామక ప్రక్రియలు ఆలస్యం కావడం వల్ల యువత నిరాశకు గురవుతున్నారని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్తు, ఉద్యోగ అవకాశాలు, నాణ్యమైన విద్య వంటి అంశాలపై ప్రభుత్వం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల హక్కుల పరిరక్షణ కోసం, విద్యా రంగ సమస్యల పరిష్కారం కోసం యువత ఐక్యంగా ముందుకు రావాలని సూచించారు. "విద్య, ఉద్యోగాలు, భవిష్యత్తు కోసం విద్యార్థుల గొంతుక దేశవ్యాప్తంగా ప్రతిధ్వనించాలి. అదే 'ఛాత్రోన్ కి గుంజ్' లక్ష్యం" ముందుకెళ్లాలన్నారు. విద్యార్థులను సంక్షోభంలోకి బిజెపి నెట్టేసిందని నీట్ పరీక్ష ఎంత ఖర్చు చేస్తుందో, కేంద్ర ప్రభుత్వం విద్యకు కేటాయించిన బడ్జెట్ కంటే మూడు వంతులు విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లితండ్రులు ఖర్చు చేస్తున్నారన్నారు. ఇప్పటికే పార్టీలకు అతీతంగా విద్యార్థులు దేశ రాజధానిలో ధర్నాలు రాస్తారోకోలు చేస్తున్న సంగతులను గుర్తు చేశారు. బిజెపి పార్టీ అధికారంకు వచ్చినప్పటి నుంచి విద్యావ్యవస్థ పుట్టింది అన్నట్లు మాట్లాడడం విడ్డూరకరమన్నారు. దేశంలో ఎస్ఎస్సి, యుపిఎస్సి, ఆర్ఆర్బి,జేఈఈ, నీట్ వంటి పోటీ పరీక్షల కోసం విద్యార్థుల భవిష్యత్తు కోసం తల్లిదండ్రులు ఎంతో వ్యయ ఖర్చులు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వ్యవహరించిన తీరే రాష్ట్రంలో బీఆర్ఎస్ పార్టీ వ్యవహరించిందని దుయ్యబడ్డారు. అలాగే దేశంలో విద్యార్థుల కోసం దేశ ప్రగతి కోసం పాటుపడిన నాయకుడు జవహర్ లాల్ నెహ్రూ అన్నారు. నెహ్రు ప్రధానిగా ఉన్న హయాంలోనే జవహర్‌లాల్ నెహ్రూ హయాంలో దేశ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని IIT\T, AIIMS, IIM\T, UGC వంటి ప్రపంచ స్థాయి విద్యా సంస్థలకు పునాది పడింది. నేడు లక్షలాది మంది విద్యార్థులు, శాస్త్రవేత్తలు, వైద్యులు, ఇంజనీర్లు ఈ సంస్థల ద్వారా దేశాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న విషయాలను గుర్తు చేశారు. అలాగే రాష్ట్రంలో విద్యకు విశేష ప్రాధాన్యత ఇస్తూ కులాలకు అతీతంగా ప్రతి నియోజకవర్గానికి ఇంటిగ్రేటెడ్ స్కూల్, స్కిల్ డెవలప్మెంట్, స్పోర్ట్స్ అథారిటీ యూనివర్సిటీ, నెలకొల్పేందుకు కృషి చేస్తుందన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాయి చరణ్ రెడ్డి, తిరుపతయ్య, పిసిసి డెలిగేట్ తైలం శంకర్ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బ్రహ్మచారి, బి కృష్ణ, ధనలక్ష్మి, సుఖేందర్ రెడ్డి, వాల్య నాయక్, శరవంద, పాండు సాగర్, నందిమల్ల చంద్రమౌళి, పలువురు పాల్గొన్నారు.

# బ్యాంకాక్ తైక్వాండో పోటీల్లో వనపర్తి యువకుడి ఘనత

**- ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అభినందన**



వనపర్తి జిల్లా ప్రతినిధి,జూన్ 24 విజన్ ఆంధ్ర : ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ తైక్వాండో క్రీడా పోటీల్లో వనపర్తి జిల్లాకు చెందిన సానే వినోద్ కుమార్ రెడ్డి అద్భుత ప్రతిభ కనబరిచి రెండు బంగారు పతకాలు, ఒక కాంస్య పతకం సాధించడం దేశానికే గర్వకారణమని వనపర్తి శాసనసభ్యులు తూడి మేఘారెడ్డి కొనియాడారు. బుధవారం హైదరాబాద్ మాదాపూర్‌లోని తన కార్యాలయంలో ఎమ్మెల్యే మేఘారెడ్డి.. అంతర్జాతీయ క్రీడాకారుడు వినోద్ కుమార్ రెడ్డిని శాలువాతో ఘనంగా సత్కరించి, అభినందనలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. వనపర్తి మండలం మాజీ ఎంపీపీ సానే కిచ్చారెడ్డి కుమారుడైన వినోద్ కుమార్ రెడ్డి అంతర్జాతీయ స్థాయిలో రాణించి ఈ పతకాలు సాధించడం ద్వారా భారతదేశానికే కాకుండా, వనపర్తి జిల్లాకు, మండలానికి మరియు వారి గ్రామానికి ప్రపంచవ్యాప్తంగా గొప్ప గుర్తింపు తెచ్చారని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో వినోద్ కుమార్ రెడ్డి కుటుంబ సభ్యులు, పలువురు నాయకులు పాల్గొని క్రీడాకారునికి శుభాకాంక్షలు తెలిపారు.

# మంకీ రెస్క్యూ సెంటర్ పరిశీలించిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా.



నిర్మల్ జిల్లా, జూన్ 24(విజన్ ఆంధ్ర); జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం సారంగాపూర్ మండలం చించోలి (బి) గ్రామ గ్రామంలోని గండిరామన్న హరితవనంలో గల మంకీ రెస్క్యూ సెంటర్ ను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ కోతుల పట్టివేతకు సంబంధించి వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటివరకు పట్టుకున్న కోతులు, పునరావాసం, అందుబాటులో ఉన్న మంకీ క్యాచర్స్ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, అటవీ అధికారి సుశాంత్ సుఖదేవ్ బోబడే, ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# అలసత్వం వీడండి.. భూసేకరణ వేగవంతం చేయండి

**సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశం**

**నీటిపారుదల శాఖ అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశం**



వనపర్తి జిల్లా, ప్రతినిధి జూన్ 24 (విజన్ ఆంధ్ర) : జిల్లాలో కొనసాగుతున్న సాగునీటి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనులు రాష్ట్ర ప్రభుత్వ అత్యంత ప్రాధాన్యత అంశమని, నీటిపారుదల శాఖ అధికారులు అలసత్వాన్ని వీడి పనులను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ ఆదర్శ్ సురభి సూచించారు. బుధవారం కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాలులో నీటిపారుదల శాఖ, సర్వే శాఖ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించి పనుల పురోగతిపై చర్చించారు. కలెక్టర్ మాట్లాడుతూ, సాగునీటి శాఖ మరియు సర్వే శాఖ అధికారులు సమన్వయంతో పనిచేస్తూ పెగ్ మార్కింగ్, సర్వే పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కర్నె తండా లిఫ్ట్ ఇరిగేషన్, ఘన్‌పూర్ బ్రాంచ్ కెనాల్, కల్వకుర్తి లిఫ్ట్ ఇరిగేషన్ (కేఎల్ఐ) డి-1, డి-5, డి-8 కాలువలు, బుద్దారం లెఫ్ట్ మెయిన్ కెనాల్‌కు సంబంధించిన పెగ్ మార్కింగ్ దశలో ఉన్న పనులను అత్యవసరంగా పూర్తి చేయాలని సూచించారు. ఈ ప్రాజెక్టులకు సంబంధించిన సబ్ డివిజన్ రికార్డులను రెండు రోజుల్లో సిద్ధం చేసి సమర్పించాలని అధికారులను ఆదేశించారు. ఎస్‌డీఆర్ (Sub Division Records) పూర్తయిన వెంటనే స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ద్వారా ప్రిలిమినరీ నోటిఫికేషన్ (పీఎన్) జారీ చేసేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. ఈ ప్రక్రియను నిర్దేశిత సమయం ప్రకారం అమలు చేస్తే భూసేకరణ పనులు వేగవంతమై ప్రాజెక్టుల పురోగతి మరింత మెరుగుపడుతుందని కలెక్టర్ పేర్కొన్నారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టుల పనుల పురోగతిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగుతుందని, అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రభుత్వ లక్ష్యాలను సకాలంలో సాధించాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ తిరుపతయ్య, ఇరిగేషన్ సూపరిండెంట్ ఇంజనీర్, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, సర్వే శాఖ ఏ డి శ్రీనివాసులు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# తాను చదివిన బడి ఋణం తీర్చుకోలేనిది

**- తమ్ముడి జ్ఞాపకార్థం అన్నయ్య ఔదార్యం**

**- ప్రభుత్వ పాఠశాలకు రూ.1.50 లక్షలతో ఆధునిక వంటశాల నిర్మాణం**




నిజామాబాద్ జూన్24:( విజన్ ఆంధ్ర ) నిజామాబాద్ రూరల్ సిరికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో కొత్తగా వెలిసిన కిచెన్ షెడ్ గోడలపై రెండు పేర్లు చెరగని అక్షరాలతో నిలిచాయి రావుట్ల నర్సయ్య, రావుట్ల చిన్న నర్సయ్య. సత్యశోధక్ ఎడ్యుకేషనల్ సొసైటీ చైర్మన్ రావుట్ల నర్సయ్య, ఆయన తమ్ముడు రావుట్ల చిన్న నర్సయ్య ఈ ఇద్దరు సోదరులు ఇదే పాఠశాలలో విద్యాభ్యాసం చేశారు. రావుట్ల నర్సయ్య 198586 నుండి 199192 వరకు, రావుట్ల చిన్న నర్సయ్య 198990 నుండి 199495 వరకు ఐదో తరగతి నుంచి పదో తరగతి వరకు ఇక్కడే చదువుకున్నారు. జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగిన తర్వాత కూడా తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాలను, బాల్య జ్ఞాపకాలను మరువలేదు. 2020లో అనారోగ్యంతో తమ్ముడు చిన్న నర్సయ్య అకాల మరణం చెందడంతో, ఆయన జ్ఞాపకాలను శాశ్వతంగా నిలుపుకోవాలని అన్నయ్య రావుట్ల నర్సయ్య సంకల్పించారు. ఆ సంకల్పమే ఇప్పుడు విద్యార్థులకు ఉపయోగపడే సేవా కార్యక్రమంగా రూపుదిద్దుకుంది. తాము చదువుకున్న పాఠశాల అభివృద్ధికి తమ వంతు బాధ్యతగా, తమ్ముడి జ్ఞాపకార్థం రూ.1,50,000 వ్యయంతో ఆధునిక వంటశాల (కిచెన్ షెడ్) నిర్మించి పాఠశాలకు అందజేశారు. మధ్యాహ్న భోజన పథకం కింద విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించేందుకు ఈ వంటశాల ఎంతో ఉపయోగపడనుంది. వంట సామగ్రి, పాత్రలను భద్రపరిచేందుకు ప్రత్యేక స్థలం, వంట చేసేందుకు సౌకర్యవంతమైన గది, విద్యార్థులకు భోజనం వడ్డించేందుకు అనువైన ఏర్పాట్లతో ఈ వంటశాల నిర్మించబడింది.

**రావుట్ల నర్సయ్య మాటల్లో...**

"జన్మనిచ్చిన తల్లిదండ్రులను, పుట్టి పెరిగిన గ్రామాన్ని, చదివిన పాఠశాలను మనిషి ఎన్నటికీ మరువకూడదు. మనం ఎంత చేసినా వాటి రుణం పూర్తిగా తీర్చలేం. నేడు నేను ఉన్న స్థితికి చేరుకోవడంలో ఈ పాఠశాల పాత్ర ఎంతో గొప్పది. తమ్ముడు లేని లోటును ఎప్పటికీ భర్తీ చేయలేను. కానీ ఆయన జ్ఞాపకం చిరస్థాయిగా నిలిచేలా, మన బడికి ఉపయోగపడే ఒక మంచి పని చేయాలనే ఆలోచనతో ఈ వంటశాలను నిర్మించాను. ఇది కేవలం ఒక నిర్మాణం కాదు... నేను చదివిన బడికి, నన్ను తీర్చిదిద్దిన గురువులకు అర్పించే చిన్న కృతజ్ఞత." "తమ్ముడి జ్ఞాపకాన్ని సేవగా మలిచి, చదివిన బడి రుణాన్ని కృతజ్ఞతగా తీర్చుకున్న రావుట్ల నర్సయ్య ఔదార్యం నేటి తరానికి స్ఫూర్తిదాయకం."

# మాకు రక్షణ కల్పించండి..





సూర్యాపేట జూన్ 24:(విజన్ ఆంధ్ర) : పోలీస్ స్టేషన్లకు వచ్చే సామాన్య ప్రజానీకానికి న్యాయం చేయడం లేదని చివ్వెంల మండల పరిధిలోని జయరాం గుడి తండా గ్రామపంచాయతీ ఆవాస గ్రామమైన హలావత్ తండాకు చెందిన హలవత్ కిషన్ ,లలిత పేర్కొన్నారు. గత కొంతకాలంగా భూ తగాదాల విషయంలో పోలీస్ స్టేషన్ పరిధిలో గత కొద్ది రోజులుగా కొనసాగుతున్న భూవివాదం, వ్యక్తిగత కక్షలు చివరకు ఘర్షణకు దారి తీసింది. బాధితులు గతంలో పలుమార్లు పోలీస్ స్టేషన్లో ఫిర్యాదులు చేసినప్పటికీ,స్థానిక రాజకీయ ఒత్తిళ్ల కారణంగా చర్యలు తీసుకోలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.వివాదంలో ఉన్న వ్యక్తుల మధ్య గొడవలు జరిగినప్పటికీ ముందస్తుగా బైండోవర్ చేయకపోవడం, ఫిర్యాదులపై సమగ్ర విచారణ చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి ఏర్పడింది. తాజాగా ఇరువర్గాల మధ్య జరిగిన దాడిలో పలువురికి తల, చేతులపై తీవ్ర గాయాలు కాగా వారు సూర్యాపేట ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ముందస్తు చర్యలు తీసుకుని ఉంటే ఈ దాడి జరిగేది కాదని బాధిత కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.గత కొంతకాలంగా పోలీస్ స్టేషన్ చుట్టూ తిరుగుతున్న స్థానిక పోలీసులు తమని పట్టించుకోకపోవడం వలనే ఈరోజు మాపై దాడి జరిగిందని పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ సమగ్ర విచారణ చేయకుండా నిర్లక్ష్యం వహించడంతోనే మాపై దాడి జరిగిందని జయరాం గుడి తండా గ్రామపంచాయతీ ఆవాస గ్రామానికి చెందిన హలవత్ కిషన్, లలిత పేర్కొన్నారు. గత కొంతకాలంగా తన తమ్ముడికి తన చిన్నమ్మకి మధ్య జరుగుతున్న తగాదాలను పోలీస్ స్టేషన్లో రెండు మూడుసార్లు ఫిర్యాదు చేసిన చివ్వెంల పోలీసులు పట్టించుకోని పాపన పోలేదని అన్నారు. మాపై అక్రమంగా దౌర్జన్యంగా దాడి చేసిన వారి నుండి మాకు ప్రాణహాని ఉందని, స్థానిక పోలీసులకు రక్షణ గా ముందస్తు చర్యలు చేపట్టాలని ఎన్నిసార్లు వేడుకున్నా పట్టించుకోక ఓ మాజీ ప్రజా ప్రతినిధి మాటలు విని మా సమస్యను పట్టించుకోకపోవడం వలన ఈరోజు మాపై దాడి జరిగిందని అన్నారు.జిల్లా పోలీస్ ఉన్నత అధికారులు వెంటనే స్పందించి మాకు రక్షణ కల్పించాలని వేడుకున్నారు.

## ప్రధాన రహదారి పై ద్విచక్ర వాహనం చోరీ.




జూలూరుపాడు జూన్ 25 విజన్ ఆంధ్ర జూలూరుపాడు మండల కేంద్రం లో ప్రధాన రహదారి లో గడిదేశీ ప్రేమాకుమార్ అనే వ్యక్తి తన ద్విచక్ర వాహనం నెం టీ ఎస్ 28 ఎన్ 6782 మంగళవారం రాత్రి తన ఇంటి ముందు నిలిపి ఉంచిన వాహనం బుధవారం ఉదయం నిద్ర లేచి చూస్తే కనిపించడం లేదు వెంటనే జూలూరుపాడు పోలీస్ స్టేషన్ ఎస్సై కి సమాచారం అందిచగా కేసు ఫైల్ చేసి దర్యాప్తు చేపట్టారు.

## లయన్స్ క్లబ్ నార్త్ ఆధ్వర్యంలో నిరంతరాయంగా అల్పాహారం వితరణ




హైదరాబాద్ జూన్ 2026, ( ఆకెళ్ళ. విశ్వనాథ్) : సికింద్రాబాద్ లయన్స్ క్లబ్ నార్త్ సభ్యుల ఆధ్వర్యంలో నిరంతరంగా ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు నగరంలోని సూరారం నారాయణ మల్లారెడ్డి హాస్పిటల్ వద్ద, ఆసుపత్రికి వచ్చిన వారికి అల్పాహారం నిరంతరాయంగా ఇవ్వడం జరుగుతోంది. సేవా భావంతో చేస్తున్న ఈ కార్యక్రమం 2000 రోజులు పూర్తి చేసుకుని సోమవారంనాడు 2001 వ రోజులో అడిగిడుతున్న సందర్భంగా లయన్స్ క్లబ్ నార్త్ సికింద్రాబాద్ దినదినాభివృద్ధి చెందాలని తమ వంతు బాధ్యతగా ప్రజలకు సేవ చేస్తున్నటువంటి నార్త్ లయన్స్ క్లబ్ సికింద్రాబాద్ అధ్యక్ష, కార్యదర్శుల, సభ్యుల సేవా నిరతిని అభినందిస్తూ స్థానికులు ప్రశంశలు అందజేశారు. ఈ సందర్భంగా అల్పాహారం తీసుకున్న వారందరూ తమ ఆనందాన్ని వ్యక్తపరుస్తూ అల్పాహారాన్ని అందజేస్తున్న దాతలు సుఖ సంతోషాలతో ఉండాలని ఆశీర్వదించ్చారు.

## మధురంగా సాగిన తెలంగాణ ఆస్తిత్వపు 'కవి సమ్మేళనం'




హైదరాబాద్ జూన్ 2026, విజన్ ఆంధ్ర ( ఆకెళ్ళ. విశ్వనాథ్ ) : తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో రవీంద్రభారతి హైదరాబాద్ లోని పాల్కురికి సోమన మూల ప్రాంగణంలో నిర్వహిస్తున్న తెలంగాణ ప్రజాకళ 99 రోజుల సాంస్కృతిక కళారూపాల ప్రదర్శనలో భాగంగా సోమవారం 'కవి సమ్మేళనం' కార్యక్రమం అత్యంత వినసొంపుగా జరిగింది. పాల్గొన్న కవులు తమ కవితలను వినిపించి ప్రేక్షకులకు తెలంగాణ అస్తిత్వాన్ని చాటిచెప్పారు. ఈ కార్యక్రమంలో నిజామాబాద్ జిల్లా భీమ్‌గల్ మండలం దేవాన్‌పల్లి గ్రామానికి చెందిన యువ కవి ' మహమ్మద్ సుమేర్' తన కవితా గానాన్ని గంభీరంగా, సరికొత్త ఉత్తేజం, ఉద్వేగంగా చదివిన "ధూళి చైతన్యం" మట్టి మనుషుల శ్రమను చైతన్యంతో ఆవిష్కరించాడు. తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు డాక్టర్. ఏనుగు నరసింహారెడ్డి, అడిషనల్ డైరెక్టర్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్. విజయ్ కుమార్ పెద్దపల్లి సందర్భంగా సుమేర్ ను అలాగే ఇతర కవులను శాలువాతో ఘనంగా సత్కరించి, ప్రశంసా పత్రం అందజేశారు. తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు విద్యానందచారి, శ్రీనివాస్ రాజు, రేలారే ప్రసాద్, మాపల్లె శంకర్ , జ్యోష్ణ , వీణ కళాకారులు పలువురు కవులు, మేధావులు ఈ కవి సమ్మేళనం కార్యక్రమంలో పాల్గొని తమ కవితలను మధురంగా వినిపించారు.

# ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ రూపొందించేందుకు పూర్తి సహకారం అందించాలి

సూర్యాపేట జూన్ 24:(విజన్ ఆంధ్ర) : అన్ని రాజకీయ పార్టీలు, ప్రజా ప్రతినిధులు, అధికారులు సమన్వయంతో "ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ"(సర్) కార్యక్రమం ద్వారా పారదర్శక ఓటరు జాబితాను రూపొందించేందుకు పూర్తి సహకారం అందించాలని జిల్లా కలెక్టర్ ,జిల్లా ఎన్నికల అధికారి తేజస్ నంద్ లాల్ పవార్ కోరారు.బుధవారం "సర్" పై వి సి కాన్ఫరెన్స్ హాల్ నందు నిర్వహించిన అఖిలపక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా ఈనెల 25 నుండి జూలై 24 వరకు బిఎల్ఓ లు ఇంటింటిని సందర్శిస్తున్నారని, ఇందులో భాగంగా ఓటర్లకు ఎన్యుమరేషన్ ఫామ్స్ ఇవ్వడం జరుగుతుందని, ఈ కార్యక్రమం సవ్యంగా నిర్వహించేందుకు అన్ని రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు .ఈ విషయంలో బిఎల్ఓ లకు బిఎల్ఏలు పూర్తి సహకారం అందించాలని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా ఈనెల 25 నుండి జూలై 24 వరకు బిఎల్ఓల ఇంటింటి సందర్శన ఉంటుందని, జూలై 24న పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ ఉంటాయని, జూలై 31న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురించడం జరుగుతుందని, జూలై 31 నుండి ఆగస్టు 30 వరకు ముసాయిదా ఓటరు జాబితా పై అభ్యంతరాల స్వీకరణ ఉంటుందని, జూలై 31 నుండి సెప్టెంబర్ 28 వరకు అభ్యంతరాల పరిష్కారం ఉంటుందని, తుది ఓటరు జాబితాను అక్టోబర్ 1 ,2026న ప్రచురించనున్నట్లు ఆయన వెల్లడించారు.బి ఎల్ వో లు ఇంటింటి సందర్శన సందర్భంగా ప్రతి ఓటర్ కు రెండు ఎన్యూమరేషన్ ఫారాలు ఇవ్వడం జరుగుతుందని, ఒకటి బిఎల్ఓ దగ్గర ఉంటుందని, మరొకటి





ఓటర్ కు ఇస్తారని, ఓటర్లు ప్రత్యక్షంగా ఎన్యూమరేషన్ ఫామ్ లో వివరాలను ఇవ్వలేకపోతే ఓటర్ పోర్టల్ ద్వారా కూడా వివరాలను సమర్పించవచ్చని కలెక్టర్ వెల్లడించారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారం తీసుకోలేకపోయినా, లేదా సమర్పించలేకపోయినా పొరపాటున లెక్కించకపోయిన, లేదా జాబితాలోకి రాకపోయినా గుర్తించి వారు జాబితాలో నమోదయ్యేలా సహకరించాలని కోరారు. ప్రత్యేకించి బిఎల్వోలు, బిఎల్ఓ సూపర్వైజర్లు, నియమించబడిన అధికారులు నెల రోజులపాటు క్షేత్రస్థాయిలోనే ఉంటారని, వారికి సమాచారం అందించాలని చెప్పారు. ఎన్నికల సంఘం నియమ నిబంధనలు ప్రకారమే సర్ కార్యక్రమాన్ని చేపట్టడం జరుగుతుందని, ఎవరు ఎలాంటి అపోహలు చెందాల్సిన అవసరం లేదని, స్థానికంగా నివాసం ఉన్నచోట ఓటు హక్కును వినియోగించుకోవచ్చని, ఈ విషయం బిఎల్ఎ ల ద్వారా ప్రజలకు తెలియజేయాలని ఆయన కోరారు. ఒక వ్యక్తికి రెండుచోట్ల ఓటు హక్కు లేకుండా, అలాగే చనిపోయిన వారు, శాశ్వతంగా చిరునామా మారిన వారి వంటి వాటిని తీసి వేసి పారదర్శకమైన ఓటరు జాబితా రూపొందించడంలో భాగంగానే సర్ కార్యక్రమాన్ని చేపట్టడం జరిగిందని అన్నారు. అర్హత ఉన్న ప్రతి ఓటరు జాబితాలో ఉండాలని , అదేవిధంగా అనర్హులు జాబితాలోకి రాకూడదని ఆయన వెల్లడించారు. ఈ నెల 25 నుండి 28 వరకు ఎన్యూమరేషన్ ఫామ్స్ పంపిణీ ఉంటుందని, అందువల్ల రాజకీయ పార్టీల ప్రతినిధులు ఈ విషయాన్ని అత్యంత ప్రాముఖ్యంగా తీసుకొని అందరికీ ఫార్మ్స్ చేరే విధంగా చూడాలన్నారు. అందువల్ల ఓటర్లందరూ ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వచ్చే బీఎల్ఓ లకు పూర్తి సమాచారాన్ని ఫామ్ ద్వారా అందించాలని, ఈ విషయంపై విస్తృత ప్రచారం కల్పించాలని ఆయన కోరారు.అదనపు కలెక్టర్ బి హరిసింగ్, డి ఆర్ ఓ ప్రేమ్ రాజ్, సి సెక్షన్ సూపరెంటెంట్ రాజేందర్ రెడ్డి, బిజెపి నుండి చల్లమల్ల నరసింహ, కాంగ్రెస్ నుండి చకిలం రాజేశ్వరరావు, బీఎస్పీ నుండి ఎం స్టాలిన్, సిపిఎం నుండి కోట గోపి, వైయస్ఆర్సీపీ నుండి రమేష్ తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# రాజన్న కోడెల పంపిణీ పారదర్శకంగా.. అక్రమాలకు తావులేదు

- **ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్**
- **120 జతల రాజన్న కోడెలను రైతులకు ఉచితంగా పంపిణీ**
- **ఆన్‌లైన్ దరఖాస్తుల ఆధారంగా అర్హుల ఎంపిక**
- **రాజన్న ప్రసాదంగా భావించి వ్యవసాయ పనులకే వినియోగించాలి**
- **మర్రిపల్లిలో 40 ఎకరాల్లో ఆధునిక గోశాల నిర్మాణానికి సన్నాహాలు**
- **ఉత్తర తెలంగాణ జిల్లాల రైతులకు త్వరలో కోడెల పంపిణీ**

వేములవాడ, జూన్ 24 రాజన్న సిరిసిల్ల (విజన్ ఆంధ్ర బ్యూరో): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి గోశాల నుంచి అర్హులైన రైతులకు రాజన్న కోడెలను పూర్తిస్థాయి పారదర్శకతతో పంపిణీ చేస్తున్నామని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ తెలిపారు. కోడెలను పక్కదారి పట్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌లో ఉన్న శ్రీ రాజరాజేశ్వర స్వామివారి గోశాలలో బుధవారం 120 జతల కోడెల ఉచిత పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్‌తో పాటు జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ హాజరై రైతులకు కోడెలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, దేశంలో ఎక్కడా లేని విధంగా వేములవాడలో స్వామివారికి కోడె కట్టే సంప్రదాయం కొనసాగుతోందని చెప్పారు. భక్తుల విశ్వాసానికి ప్రతీకగా కోడె మొక్కు చెల్లింపు నిలిచిందన్నారు. ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో తిప్పాపూర్ గోశాల ద్వారా రైతులకు ఉచితంగా కోడెల పంపిణీ చేపడుతున్నట్లు తెలిపారు. పంపిణీ చేసిన కోడెలపై దేవాదాయ, రెవెన్యూ, వ్యవసాయ శాఖల అధికారులు నిరంతర పర్యవేక్షణ



నిర్వహిస్తారని చెప్పారు. కోడెలను వ్యవసాయ అవసరాలకే వినియోగించాలని రైతులకు సూచిస్తూ, ఇతర అవసరాలకు ఉపయోగించినట్లయితే చట్టపరమైన చర్యలు తప్పవని స్పష్టం చేశారు. మర్రిపల్లి గ్రామంలో 40 ఎకరాల విస్తీర్ణంలో ఆధునిక సౌకర్యాలతో గోశాల నిర్మాణానికి రాష్ట్ర ప్రభుత్వం భూమి కేటాయించిందని, త్వరలోనే పనులకు శంకుస్థాపన జరుగుతుందని వెల్లడించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు ఉత్తర తెలంగాణ జిల్లాల్లోని అర్హులైన చిన్న, సన్నకారు రైతులకు కూడా త్వరలో కోడెల పంపిణీ చేపట్టనున్నట్లు తెలిపారు. జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ మాట్లాడుతూ, ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసిన రైతుల వివరాలను పశుసంవర్ధక, ఆలయ, వ్యవసాయ శాఖల అధికారులతో కూడిన కమిటీ పరిశీలించి అర్హులైన వారికి మాత్రమే కోడెలను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. రైతులు వీటిని రాజన్న ప్రసాదంగా భావించి వ్యవసాయ పనులకే వినియోగించాలని సూచించారు. పంపిణీ చేసిన కోడెలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తూ పర్యవేక్షణ కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో





మున్సిపల్ చైర్మన్ పుల్కం రాజు, మార్కెట్ కమిటీ చైర్మన్ రొండి రాజు, ఆర్డీఓ కె.ఎస్.బి. కుమారి, ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ జయంత్ కుమార్, మున్సిపల్ కమిషనర్ లోకేష్ తదితర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# అర్హులందరికీ ఓటు హక్కు కల్పించడమే ఎస్ఐఆర్ లక్ష్యం

- **కలెక్టర్ గరిమ అగ్రవాల్**
- **జూన్ 25 నుంచి ఇంటింటికీ ఎన్యూమరేషన్ ఫారాల పంపిణీ**
- **ప్రతి ఓటరు పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో పాటు ఫారం సమర్పించాలి**
- **బీఎల్ఏలకు రాజకీయ పార్టీలు గుర్తింపు కార్డులు జారీ చేయాలి**

రాజన్న సిరిసిల్ల, జూన్ 24,(విజన్ ఆంధ్ర బ్యూరో): ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమాన్ని పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించి అర్హులైన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే లక్ష్యమని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు. బుధవారం జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ పాల్గొని ఎస్ఐఆర్ కార్యక్రమంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జూన్ 25 నుంచి జిల్లాలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ ప్రక్రియ ప్రారంభం కానుందని తెలిపారు. జిల్లాలో మొత్తం 549 పోలింగ్ కేంద్రాలు ఉండగా, 55 మంది బీఎల్ఓ సూపర్‌వైజర్లు, 549 మంది బీఎల్ఓలు విధులు నిర్వర్తిస్తున్నారని చెప్పారు. జిల్లాలో మొత్తం 4,75,694 మంది ఓటర్లు ఉన్నారని,



వీరిలో 2,28,579 మంది పురుషులు, 2,47,072 మంది మహిళలు, 43 మంది ట్రాన్స్‌జెండర్లు ఉన్నారని వెల్లడించారు. ఇప్పటికే 4,04,414 మంది ఓటర్ల మ్యాపింగ్ పూర్తయ్యిందని, ఇంకా 71,280 మంది మ్యాపింగ్ చేయాల్సి ఉందని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 30 వరకు బీఎల్ఓలు ఇంటింటికి వెళ్లి ఎన్యూమరేషన్ ఫారాలు అందజేస్తారని, ఓటర్లు పూర్తి వివరాలతో ఫారాలను పూరించి ప్రస్తుత పాస్‌పోర్ట్ సైజ్ ఫొటోతో కలిసి జూలై 31లోగా సమర్పించాలని సూచించారు. ఫారాలతో పాటు గుర్తింపు కార్డుల జిరాక్స్ ప్రతులు సమర్పించాల్సిన అవసరం లేదని, గుర్తింపు కార్డు వివరాలు మాత్రమే అందించాలని తెలిపారు. జూలై 31న డ్రాఫ్ట్ ఓటరు జాబితా ప్రచురించబడుతుందని పేర్కొన్నారు. డ్రాఫ్ట్ జాబితా విడుదల అనంతరం తమ పేరు ఉందో లేదో ప్రతి ఓటరు పరిశీలించాలని, అభ్యంతరాలు, ఫిర్యాదులు, కొత్త క్లెయిమ్‌లు ఉంటే ఆగస్టు 30లోగా సమర్పించాలని సూచించారు. సెప్టెంబర్ 28 నాటికి అన్ని అభ్యంతరాలను పరిష్కరించి అక్టోబర్ 1న తుది ఓటరు జాబితాను విడుదల చేస్తామని తెలిపారు. అక్టోబర్ 1, 2026 నాటికి 18 సంవత్సరాలు పూర్తిచేసుకున్న ప్రతి అర్హుడికి ఓటు హక్కు కల్పించడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని కలెక్టర్ పేర్కొన్నారు. ఒక వ్యక్తి ఒకటి కంటే ఎక్కువ ప్రాంతాల్లో ఓటు హక్కు కలిగి ఉండటం ఎన్నికల నిబంధనల ప్రకారం నేరమని స్పష్టం చేశారు. రాజకీయ పార్టీలు ప్రతి బూత్‌కు బీఎల్ఏలను నియమించి వారికి గుర్తింపు కార్డులు అందించాలని సూచించారు. ఇంటింటి సర్వే సమయంలో బీఎల్ఓలకు సహకరించి ప్రజల్లో అవగాహన కల్పించాలని కోరారు. మరణించిన ఓటర్లు, డూప్లికేట్ ఓట్లు, రెండు చోట్ల ఓటు హక్కు కలిగిన వారి వివరాలను అధికారుల దృష్టికి తీసుకురావాలని సూచించారు. సమావేశంలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, సిరిసిల్ల ఆర్డీవో శ్రీధర్ బాబు, వేములవాడ ఆర్డీవో కె.ఎస్.బి. కుమారి, ఎన్నికల విభాగం అధికారులు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

# నియోజకవర్గంలో జరుగుతున్న అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

## హుస్నాబాద్ నియోజకవర్గ అధికారులతో కలెక్టర్ సమీక్ష సమావేశం

సిద్దిపేట జిల్లా ప్రతినిధివిజన్ ఆంధ్ర జూన్ 24 : సిద్దిపేట జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయ సముదాయంలోని కాన్ఫరెన్స్ హల్ లో బుధవారం రోజున హుస్నాబాద్ నియోజకవర్గం హుస్నాబాద్, కోహెడ, అక్కన్నపేట మండలాలో చేపడుతున్న పలు అభివృద్ధి కార్యక్రమాలపైన ఆయా మండల అధికారులతో జిల్లా కలెక్టర్ కె. హైమావతి సమీక్ష సమావేశం ఆర్డీవో రామ్మూర్తితో కలిసి సమీక్ష నిర్వహించారు.ఈ సమీక్షలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ నియోజకవర్గంలో పంచాయతీ రాజ్ శాఖల లో చేపడుతున్న ఏంజీఎన్ఆర్ ఈజీఎస్ సీసీ రోడ్, బిటి రోడ్, హెల్త్ సబ్ సెంటర్, అంగన్వాడి టాయిలెట్స్, ప్రైమరీ హెల్త్ సెంటర్ రిపైర్, కాంపౌండ్ వాల్ నిర్మాణం, కింద సీసీ రోడ్స్, జీపి బిల్డింగ్, అంగన్వాడి సెంటర్స్, వివిధ రహదారుల నిర్మాణంలో ఉన్నవి పూర్తి చెయ్యాలని అలాగే పనులు మొదలు కానివి ప్రారంభించాలని నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ కాంట్రాక్టర్ లు వేగంగా పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.15వ ఆర్థిక సంఘం కింద చేపట్టిన పిఎచ్సి ల మేజర్ మైనర్ రిపేర్లు వేగంగా పూర్తి చెయ్యాలన్నారు.అర్ అండ్ బి శాఖ అధికారులు చేస్తున్న రోడ్ నిర్మాణాలు పూర్తి



చెయ్యాలని,హుస్నాబాద్ నుండి కొత్తపల్లి నాలుగు వరసల రోడ్ నిర్మాణంలో వేగం పెంచాలని ఆదేశించారు.మున్సిపల్ లో జంక్షన్ డెవలప్మెంట్, ఎల్లమ్మచెరువు వెళ్ళేందుకు రోడ్ నిర్మాణం, అర్చులు, సుందరీకరణ పనులు ఇతరత్ర పనులు నిర్ణిత కాలం లో పూర్తి చేయాలని ఆదేశించారు.నేషనల్ హైవే సిద్దిపేట-ఎల్కతుర్తి 85% రోడ్ పనులు పూర్తి చేశామని పందిళ్ళ టోల్ ప్లాజా నిర్మాణం, బస్వాపూర్ ఫారెస్ట్ క్లియరెన్స్ చేసుకుని రోడ్ నిర్మాణం, రోడ్ వెంబడి గల పలు విగ్రహాల తొలగింపుకు ఆయా గ్రామాల సర్పంచ్, సెక్రటరీ లను కలిసి అందరి సమక్షంలో రోడ్లపై నుండి తొలగించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.విద్యుత్ శాఖ ఆయా గ్రామంలో నిర్మాణంలో ఉన్న విద్యుత్ ఉప కేంద్రాల నిర్మాణం పూర్తి చెయ్యాలని తెలిపారు.గౌరవెల్లి ఆర్ అండ్ ఆర్ కాలనీలో చేపడుతున్న మిషన్ భగీరథ పనులు నిర్ణిత కాల వ్యవధిలో పూర్తి చేయాలని ఆదేశించారు. ఇందిరమ్మ ఇళ్లు నిర్మాణాలను ఆయా స్థాయిలో అధికారులు పర్యవేక్షణ చేస్తూ 100 శాతం పూర్తి అయ్యేలా చర్యలు తీసుకోవాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఆయిల్ ఫామ్ సాగు గూర్చి మీకు ఇచ్చిన టార్గెట్ ను తప్పనిసరిగా పూర్తి చెయ్యాలని ఉద్యానవన శాఖ అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో రైతులతో సమావేశాలు నిర్వహించి ఆయిల్ ఫామ్ సాగు చేసేలా ప్రోత్సహించాలని తెలిపారు. అలాగే రైతువేదికలలో విత్తన మేళలో రైతులు సన్న వడ్లను వేసేలా అలాగే ఎక్కువ మొత్తంలో పప్పుదినుసులు, కూరగాయలు లాంటి ఆరుతడి పంటలను వేసుకునేలా ప్రోత్సహించాలని వ్యవసాయ శాఖ అధికారులు ఆదేశించారు. ఈ సమావేశంలో హుస్నాబాద్ నియోజకవర్గ అధికారులు పాల్గొన్నారు.

## నేడు బోడుప్పల్ లో విద్యుత్ సరఫరాలో అంతరాయం...

బోడుప్పల్,జూన్ 24( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : నేడు బోడుప్పల్ విద్యుత్ డివిజన్ వివేకానంద ఫీడర్,మారుతి నగర్ ఫీడర్,బొల్లిగూడెం ఫీడర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు బోడుప్పల్ విద్యుత్ శాఖ ఏఈ ఎన్. వేణుగోపాల్ తెలిపారు.వివేకానంద ఫీడర్ పరిధిలో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటల వరకు మణికంఠ నగర్, వివేకానంద నగర్, శ్రీ లక్ష్మీ నగర్, లెక్చరర్స్ కాలనీ, ఐఐసీటీ కాలనీ, భీంరెడ్డి కాలనీ, అశోక్ నగర్, గ్రీన్ సిటీ కాలనీ, అనగాపురి కాలనీ ప్రాంతాలలో,అదే సమయంలో మారుతి నగర్ ఫీడర్ పరిధిలో యాదవ్ బస్తీ, సుభాష్ నగర్, ఎస్సీ బస్తీ, మాన్సాని కాలనీ, మణికంఠ నగర్, మారుతి నగర్, టెలిఫోన్ కాలనీ, యాదాద్రి కాలనీ, సిద్ధివినాయక చిత్తారి నగర్, శ్రీ సాయి ఎన్‌క్లేవ్ ప్రాంతాలలో, బొల్లిగూడెం ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:30 గంటల నుంచి 3:30 గంటల వరకు బొల్లిగూడెం, అంజయ్య ఎన్‌క్లేవ్, అమ్మసాని వెంకట్ రెడ్డి నగర్, ఎస్‌బీఆర్ కాలనీ, టెలిఫోన్ కాలనీ, రాజలింగం కాలనీ ఫేజ్-1, ఫేజ్-2, సూరజ్ నగర్, మహాలక్ష్మి నగర్, బాలాజీ నగర్, లక్ష్మారెడ్డి నగర్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ ఎన్. వేణుగోపాల్ కోరారు.

## ప్రజల భద్రతే లక్ష్యం..





సూర్యాపేట జూన్ 24:(విజన్ ఆంధ్ర) : ప్రజల రక్షణ, సురక్షిత ప్రయాణమే లక్ష్యంగా సూర్యాపేట పట్టణంలో అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్స్, ఆటోమేటిక్ సీసీటీవీ నిఘా వ్యవస్థను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రజలు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు తగ్గడమే కాకుండా సులభమైన ప్రయాణం సాధ్యమవుతుందని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ప్రజల భద్రత కోసం పోలీస్ శాఖ నిరంతరం పని చేస్తోందని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. ఆధునిక సౌకర్యాలతో సూర్యాపేటను మరింత అభివృద్ధి చేయడమే లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది పేర్కొన్నారు.జిల్లా కేంద్రంలో ట్రాఫిక్ నియంత్రణ, ప్రజల భద్రతను మరింత బలోపేతం చేసే చర్యల్లో భాగంగా పోలీస్, మున్సిపల్ అధికారుల సమన్వయంతో బుధవారం పట్టణంలో బస్టాండ్ చౌరస్తా, ఖమ్మం క్రాస్‌రోడ్ కూడళ్లలో అత్యాధునిక ట్రాఫిక్ సిగ్నల్ వ్యవస్థతో పాటు కీలకమైన 9 కూడళ్లలో 20 ఆటోమేటిక్ సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేశారు. ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద నిర్వహించిన ప్రారంభోత్సవ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ ఐఏఎస్, జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్, మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది, స్థానిక ప్రజాప్రతినిధులు, పోలీస్, మున్సిపల్ అధికారులు పాల్గొని వ్యవస్థను ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ మాట్లాడుతూ పెరుగుతున్న వాహనాల రద్దీకి అనుగుణంగా ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాస్త్రీయ విధానంలో ట్రాఫిక్ సిగ్నలింగ్ వ్యవస్థను రూపొందించామని తెలిపారు. కూడళ్ల వద్ద ఏర్పాటు చేసిన సీసీటీవీలు ఆటోమేటిక్ నంబర్ ప్లేట్ గుర్తింపు సామర్థ్యంతో పనిచేస్తాయని, ట్రాఫిక్ ఉల్లంఘనలను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని వివరించారు. సిగ్నల్ జంపింగ్, రాంగ్ రూట్ డ్రైవింగ్, సెల్‌ఫోన్ ఉపయోగిస్తూ డ్రైవింగ్ వంటి ఉల్లంఘనలను సులభంగా గుర్తించవచ్చన్నారు. కమాండ్ కంట్రోల్ ద్వారా పర్యవేక్షణ జరుగుతుందని తెలిపారు.జిల్లా ఎస్పీ నరసింహ ఐపీఎస్ మాట్లాడుతూ ప్రజల అవసరాలు, ప్రజా భద్రత దృష్ట్యా మొదటి విడతలో బస్టాండ్ జంక్షన్, ఖమ్మం క్రాస్‌రోడ్ వద్ద ఈ వ్యవస్థను ప్రారంభించామని చెప్పారు. ముఖ్యమైన 9 కూడళ్లలో ఏర్పాటు చేసిన 20 సీసీటీవీలు ట్రాఫిక్ ఉల్లంఘనలను ఆటోమేటిక్‌గా గుర్తించి ఈ-చలానా విధించేలా పనిచేస్తాయని తెలిపారు. హెల్మెట్ లేకుండా ప్రయాణించడం, రాష్ డ్రైవింగ్, రాంగ్ రూట్ వంటి ఉల్లంఘనలపై నేరుగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ కెమెరాలు ట్రాఫిక్ నియంత్రణతో పాటు దొంగతనాలు, రౌడీషీటర్ల కదలికలు, ఇతర అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు కూడా ఉపయోగపడతాయని తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్షాది మాట్లాడుతూ ఆధునిక పట్టణ అభివృద్ధిలో భాగంగా ప్రజలకు మరింత సురక్షితమైన, సౌకర్యవంతమైన వాతావరణం కల్పించేందుకు మున్సిపాలిటీ కట్టుబడి ఉందన్నారు. ట్రాఫిక్ నిర్వహణలో ప్రజలు కూడా భాగస్వామ్యం కావాలని, నిబంధనలు పాటిస్తూ పోలీస్ శాఖకు సహకరించాలని కోరారు.ఈ కార్యక్రమంలో డీఎస్పీ ప్రసన్నకుమార్, వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, కౌన్సిలర్ శ్రీవిద్య జ్యోతి కరుణాకర్, సీఐ వెంకటయ్య, మున్సిపల్ కమిషనర్ హనుమంతరెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ సాయిరాం, మున్సిపల్, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

## ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి ఒలింపిక్ డే రన్ దోహదం చేస్తుంది

**- ఎమ్మెల్యే చింత ప్రభాకర్**



సంగారెడ్డి బ్యూరో, జూన్ :24( విజన్ ఆంధ్ర ) : ఒలింపిక్ డే రన్ అనేది కేవలం క్రీడల పట్ల ఆసక్తిని పెంపొందించడమే కాకుండా ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణానికి దోహదం చేస్తుందని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ అన్నారు.బుధవారం నాడు సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ మైదానంలో నిర్వహించిన 40వ అంతర్జాతీయ ఒలింపిక్ డే రన్ కార్యక్రమాన్ని ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎమ్మెల్యే చింత ప్రభాకర్ ఒలింపిక్ టార్చ్ వెలిగించి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యువత క్రీడలను జీవనశైలిలో భాగంగా చేసుకోవాలని, శారీరక దృఢత్వంతో పాటు మానసిక ఆరోగ్యానికి క్రీడలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. ఒలింపిక్ స్ఫూర్తిని ప్రతి ఒక్కరూ అలవరచుకోవాలని, క్రీడా రంగంలో మరింత మంది యువత రాణించాలని ఆకాంక్షించారు.అంబేద్కర్ మైదానం నుంచి ఐబీ వరకు నిర్వహించిన ర్యాలీలో విద్యార్థులు, క్రీడాకారులు, యువత పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేశారు. ఈ కార్యక్రమంలో ఉమ్మడి మెదక్ జిల్లా ఒలింపిక్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, ఉపాధ్యక్షులు హరికిషన్, మాజీ సీడీసీ చైర్మన్ కాసాల బుచ్చిరెడ్డి, కౌన్సిలర్ జగన్, సంయుక్త కార్యదర్శులు వెంకటేశం, జేశ్వంత్ గౌడ్, పీఈటీ సంఘం బాధ్యులు షర్ఫుద్దీన్, సుభాష్ గౌడ్, కిష్టయ్య తదితరులు పాల్గొన్నారు.

## అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్ శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

**- ఎస్సీ లా పట్టభద్రులకు మూడు సంవత్సరాల శిక్షణ అవకాశం**

**- ఎద్దపల్లి జిల్లా ఎస్సీ అభ్యర్థులు సద్వినియోగం చేసుకోవాలి**

**- జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్**



పెద్దపల్లి,జిల్లా ప్రతినిధి జూన్-24(విజన్ ఆంధ్ర) : అడ్మినిస్ట్రేషన్ ఆఫ్ జస్టిస్‌లో మూడు సంవత్సరాల శిక్షణ పొందేందుకు 2026-27 విద్యా సంవత్సరానికి షెడ్యూల్డ్ కులాలకు చెందిన అర్హత కలిగిన లా పట్టభద్రుల నుంచి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి ఎం. రవీందర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు తెలిపారు. పెద్దపల్లి జిల్లాకు చెందిన ఎస్సీ అభ్యర్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన సూచించారు. అభ్యర్థులు జూన్ 20 నుంచి జూలై 31, 2026 వరకు ఈ-పాస్ వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. శిక్షణకు ఎంపికైన లా పట్టభద్రులకు నెలకు రూ.3,000 స్టైఫండ్‌తో పాటు పుస్తకాలు, ఫర్నిచర్ కొనుగోలుకు రూ.50,000 ఆర్థిక సహాయం ప్రభుత్వం అందజేస్తుందని తెలిపారు. అభ్యర్థులు షెడ్యూల్డ్ కులానికి చెందిన వారై ఉండటంతో పాటు, వార్షిక కుటుంబ ఆదాయం రూ.2 లక్షలకు మించరాదని, లా గ్రాడ్యుయేషన్ పూర్తి చేసి బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ కలిగి ఉండాలని వివరించారు. దరఖాస్తుదారులు కుల ధ్రువీకరణ పత్రం, ఆదాయ ధ్రువీకరణ పత్రం, లా గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్, బార్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ సర్టిఫికేట్, ఆధార్ కార్డు, బ్యాంకు ఖాతా పాస్‌బుక్ జిరాక్స్ కాపీలను జతపరచాలని సూచించారు. ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ జూలై 31తో ముగియనుండగా, అభ్యర్థుల ఎంపిక ఆగస్టు 10, 2026న నిర్వహించనున్నట్లు తెలిపారు. మరిన్ని వివరాల కోసం జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి కార్యాలయం, కలెక్టర్ కాంప్లెక్స్, మొదటి అంతస్తు, గది నెం.232, సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం, పెద్దపల్లిలో సంప్రదించాలని ఆయన పేర్కొన్నారు.

## సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటు చేయాలి

**-ఎమ్మెల్యే చింత ప్రభాకర్**




సంగారెడ్డి బ్యూరో, జూన్ :24( విజన్ ఆంధ్ర ) : సంగారెడ్డి జిల్లా కేంద్రంలో జవహర్ నవోదయ విద్యాలయాన్ని తక్షణమే ఏర్పాటు చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని సంగారెడ్డి ఎమ్మెల్యే చింత ప్రభాకర్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్‌కు లేఖ రాశారు. లేఖను బుధవారం నాడు జరిగిన దిశ మిటింగ్ లో అందజేశారు.. కేంద్ర ప్రభుత్వం 2024లో తెలంగాణ రాష్ట్రానికి మంజూరు చేసిన ఏడు కొత్త జవహర్ నవోదయ విద్యాలయాలలో ఒకటి సంగారెడ్డి జిల్లాకు కేటాయించబడిందని ఏమ్మెల్యే చింత ప్రభాకర్ పేర్కొన్నారు. అయితే ఇప్పటివరకు విద్యాలయం ప్రారంభం కాలేదని, దీంతో విద్యార్థులు మరియు తల్లిదండ్రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని సంగారెడ్డి మండలం , కంది మండలం, కొండాపూర్ మండలాల పరిధిలో ప్రభుత్వ భూమి అందుబాటులో ఉందని, 2026-27 విద్యా సంవత్సరంలోనే విద్యాలయం ప్రారంభించేందుకు అవసరమైన భూ కేటాయింపు ప్రక్రియను వేగవంతం చేయాలని కలెక్టర్‌ను కోరారు. జిల్లా విద్యార్థుల విద్యాభివృద్ధి కోసం జవహర్ నవోదయ విద్యాలయం ఎంతో ఉపయోగకరమని, ఈ విషయంలో తక్షణ చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే చింత ప్రభాకర్ విజ్ఞప్తి చేశారు.

## బీపీ,ఒత్తిడి, ఊబకాయం వల్ల గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...




సూర్యాపేట జూన్ 24:(విజన్ ఆంధ్ర) : గుండెపోటు అనేది కేవలం వృద్ధులకు మాత్రమే వచ్చే సమస్య కాదని, ప్రస్తుతం యువతలో కూడా గుండె సంబంధిత వ్యాధులు పెరుగుతున్నాయని సికింద్రాబాద్ యశోద హాస్పిటల్ కార్డియాలజిస్ట్ డాక్టర్ ప్రణీత్ పోలమూరి తెలిపారు. అధిక రక్తపోటు (బీపీ), మధుమేహం, కొలెస్ట్రాల్, ధూమపానం వంటి సంప్రదాయ ప్రమాద కారకాలతో పాటు మానసిక ఒత్తిడి, ఊబకాయం, శారీరక శ్రమ లేకపోవడం వంటి ఆధునిక జీవనశైలి కారణాలు కూడా గుండె ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయని పేర్కొన్నారు. ప్రతి ఛాతి నొప్పి గుండెపోటు కాకపోయినా, అలాంటి లక్షణాలను నిర్లక్ష్యం చేయడం ప్రమాదకరమని హెచ్చరించారు. గుండెపోటు, పక్షవాతం వంటి సమస్యలను నివారించాలంటే రక్తపోటు, రక్తంలో చక్కెర స్థాయిలు, కొలెస్ట్రాల్‌ను క్రమం తప్పకుండా పరీక్షించుకోవాలని సూచించారు.ముఖ్యంగా అధిక రక్తపోటును “సైలెంట్ కిల్లర్“గా అభివర్ణిస్తూ, చాలా మందికి బీపీ ఉన్న విషయం తెలియకపోవడం లేదా చికిత్సను సక్రమంగా కొనసాగించకపోవడం వల్ల గుండెపోటు, పక్షవాతం వంటి ప్రమాదాలు పెరుగుతున్నాయని తెలిపారు.ఆరోగ్యకరమైన ఆహారం, క్రమం తప్పని వ్యాయామం, ఒత్తిడి నియంత్రణ, వైద్యుల సూచనల మేరకు చికిత్స తీసుకోవడం ద్వారా గుండె జబ్బులను చాలా వరకు నివారించవచ్చని డాక్టర్ ప్రణీత్ పోలమూరి సూచించారు.

## ఓటరు జాబితా సమగ్ర సవరణలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

**- జూన్ 25 నుంచి స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )-2026 ప్రారంభం**

**- జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**




సంగారెడ్డి బ్యూరో,జూన్: 24( విజన్ ఆంధ్ర ) : భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు తెలంగాణ రాష్ట్రంలో చేపట్టనున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్ )-2026 కార్యక్రమం జూన్ 25, 2026 నుంచి జిల్లాలో ప్రారంభం కానుందని జిల్లా కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి ప్రతీక్ జైన్ తెలిపారు. ఓటరు జాబితాను మరింత ఖచ్చితంగా, పారదర్శకంగా రూపొందించేందుకు ఈ ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జిల్లాలోని ప్రతి అర్హత కలిగిన ఓటరు వివరాలు సక్రమంగా నమోదు కావడం, ఓటరు జాబితాలోని తప్పులను సరిదిద్దడం, మార్పులు, చేర్పులు, తొలగింపులను పారదర్శకంగా నిర్వహించడం ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని తెలిపారు. జూన్ 25 నుంచి జూలై 24, 2026 వరకు జిల్లాలో ఇంటింటి సర్వే (ఎన్యూమరేషన్) కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా బూత్ స్థాయి అధికారులు ( బి యల్ ఓ లు) ప్రతి ఇంటిని సందర్శించి ఓటర్ల వివరాలను ధృవీకరిస్తారని, ప్రజలు వారికి అవసరమైన సమాచారం అందించి సహకరించాలని కోరారు.

సర్ -2026 కార్యక్రమ షెడ్యూల్

- ఇంటింటి సర్వే / ఎన్యూమరేషన్: జూన్ 25 నుంచి జూలై 24, 2026 వరకు
-ముసాయిదా ఓటరు జాబితా ప్రచురణ: జూలై 31, 2026
- క్లెయిమ్స్, అభ్యంతరాల స్వీకరణ: జూలై 31 నుంచి ఆగస్టు 30, 2026 వరకు
- క్లెయిమ్స్, అభ్యంతరాల పరిష్కారం సెప్టెంబర్ 28, 2026 వరకు
- తుది ఓటరు జాబితా ప్రచురణ: అక్టోబర్ 1, 2026

జిల్లాలోని రాజకీయ పార్టీలు, ప్రజాప్రతినిధులు, ప్రజాసంఘాలు, స్వచ్ఛంద సంస్థలు, యువజన సంఘాలు ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు సహకరించాలని కలెక్టర్ కోరారు. కొత్తగా ఓటు హక్కు పొందిన యువత తమ పేర్లు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా చూసుకోవాలని సూచించారు. ఓటరు జాబితా ప్రజాస్వామ్యానికి పునాది వంటిదని, దానిని ఖచ్చితంగా రూపొందించడంలో ప్రతి పౌరుడు భాగస్వామి కావాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ విజ్ఞప్తి చేశారు. ప్రజలు తమ బూత్ స్థాయి అధికారులకు అవసరమైన వివరాలు అందించాలని కోరారు.

## ప్రజారోగ్యమే ధ్యేయంగా ఉచిత వైద్య క్యాంపు ముందుకు వచ్చిన సాయిరాం మాక్సివిజన్ ఆసుపత్రులు.

**- సద్వినియోగం చేసుకొమ్మ రోగులు సహకరించిన పాలకమండలి పరజాప్రతినిధులు.**

**- మెగా హెల్త్ క్యాంపు తో ప్రజలకు ఉచిత వైద్యం మందుల పంపిణి.**

**- నిరుపేదలకు అందుబాటులో కంటి పరీక్షలు తద్వారా శాస్త్రాచికిత్స.**



జూలూరుపాడు జూన్ 24 (విజన్ ఆంధ్ర) భద్రాద్రి కొత్తగూడెం బుధవారం రోజు వైరా నియోజకవర్గం జూలూరుపాడు మండలం బేతాళపాడు గ్రామంలో మెగా హెల్త్ క్యాంప్ ఖమ్మం పట్టణం లో సాయి రామ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ ఖమ్మం అధ్వరం లో ప్రజారోగ్యమే ధ్యేయంగా నిరుపేదలకు అందుబాటులో వైద్య సేవలు అందించాలి అని ముందుకు వచ్చిన సాయిరాం సూపర్ స్పెషలాటి హాస్పిటల్ మరియు మాక్స్ విజన్ కంటి ఆసుపత్రి ముందుకు వచ్చి మెగా హెల్త్ క్యాంప్ క్యాంప్ నిర్వహించడానికి ముందుకు వచ్చాయి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆలోచనలతో బేతాళపాడు గ్రామ సర్పంచ్ సునీత మరియు ప్రజా ప్రతినిధుల నడుమ రిబ్బన్ కట్ చేసి ఓపినింగ్ చేసిన జూలూరుపాడు కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు మాలోతు మంగీ లాల్ నాయక్. మరియు భద్రాద్రి డిసిసి కార్యదర్శి ఆర్కే నాయుడు, పంచాయతీ కార్యదర్శి బాలాజీ, వేల్పుల నరసింహారావు,గుగులోత్ రామచంద్ ,భట్టు రాజు,చౌడం లక్ష్మీ నారాయణ, గుగులోత్ బాలాజీ, మెంతుల కృష్ణ, చలమల నరసింహారావు,గ్రామ పంచాయతీ ప్రజలు కార్యకర్తలు, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నరు.

## సాంఘిక సంక్షేమ గురుకులాల్లో 15 తాత్కాలిక బోధన పోస్టుల భర్తీ కి నోటిఫికేషన్

**- జూన్ 29న ప్రత్యక్ష ఎంపిక**



పెద్దపల్లి,జిల్లా ప్రతినిధి జూన్-24(విజన్ ఆంధ్ర) : పెద్దపల్లి జిల్లాలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో తాత్కాలిక బోధన సిబ్బంది నియామకానికి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా సమన్వయ అధికారి ఊటూరి శ్రీనాథ్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని 6 గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న మొత్తం 15 పోస్టులను భర్తీ చేయనున్నారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ, టీజీటీ, స్పెషల్ టీచర్ పోస్టుల భర్తీ కోసం జూన్ 29, 2026 సోమవారం గర్రెపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల కళాశాలలో ప్రత్యక్ష ఎంపిక ప్రక్రియ నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటల నుంచి 11 గంటల వరకు అభ్యర్థుల ధ్రువపత్రాల పరిశీలన చేపట్టి, అనంతరం తరగతి బోధన ఆధారంగా ఎంపిక జరపనున్నారు. జూనియర్ లెక్చరర్, పీజీటీ పోస్టులకు సంబంధిత సబ్జెక్టులో కనీసం 50 శాతం మార్కులతో పీజీ డిగ్రీతో పాటు బీఈడ్ అర్హత ఉండాలి. టీజీటీ పోస్టులకు డిగ్రీతో పాటు బీఈడ్ తప్పనిసరి. ఆర్ట్ టీచర్‌కు బీఎఫ్ఏ లేదా టిటిసి, మ్యూజిక్ టీచర్‌కు ఏదైనా డిగ్రీతో పాటు క్లాసికల్ మ్యూజిక్‌లో డిప్లొమా అర్హతగా నిర్ణయించారు.అభ్యర్థులు పూర్తి బయోడేటా, ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ ప్రతులతో నిర్ణీత తేదీన హాజరుకావాలని అధికారులు సూచించారు. బాలికల విద్యాసంస్థల్లో పనిచేసే పోస్టులకు మహిళా అభ్యర్థులు మాత్రమే అర్హులు. పురుష అభ్యర్థులకు జూనియర్ లెక్చరర్ మ్యాథమెటిక్స్, ఫిజిక్స్, పీజీటీ ఫిజికల్ సైన్స్, టీజీటీ ఇంగ్లీష్, సోషల్ స్టడీస్, ఆర్ట్ టీచర్ పోస్టులు అందుబాటులో ఉండగా, మహిళా అభ్యర్థులకు తెలుగు, మ్యాథమెటిక్స్, బోటనీ, జువాలజీ, ఎకనామిక్స్ జూనియర్ లెక్చరర్ పోస్టులు, పీజీటీ ఇంగ్లీష్, టీజీటీ మ్యాథమెటిక్స్, మ్యూజిక్ టీచర్ పోస్టులు ఉన్నాయని తెలిపారు. ఎంపికైన వారికి జూనియర్ లెక్చరర్‌కు నెలకు రూ.23,400, పీజీటీ/టీజీటీలకు రూ.18,200, స్పెషల్ టీచర్‌కు రూ.14,170 వేతనం చెల్లించనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

## మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యం

**- మేడ్చల్ జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్**

**- పర్వతాపూర్‌లో ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ**



బోడుప్పల్, జూన్ 24 (విజన్ ఆంధ్ర): మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని మేడిపల్లి డివిజన్ పర్వతాపూర్‌లో బుధవారం ఇందిరమ్మ మహిళా శక్తి చీరల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మేడ్చల్-మల్కాజ్గిరి జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ మేయర్ అమర్ సింగ్, డిప్యూటీ మేయర్ కుర్ర శివకుమార్ గౌడ్, మాజీ కార్పొరేటర్ బొడిగే స్వాతి కృష్ణ గౌడ్ లు పాల్గొని అర్హులైన మహిళలకు ఇందిరమ్మ మహిళా శక్తి చీరలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మహిళల ఆర్థిక, సామాజిక అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని అన్నారు. మహిళా సంక్షేమం కోసం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను ప్రతి మహిళ సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మహిళా సాధికారతకు దోహదపడే సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వం నిరంతరం కొనసాగిస్తోందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పప్పుల అంజిరెడ్డి,యాసారం మహేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, మహిళా సంఘాల సభ్యులు,స్థానిక ప్రజాప్రతినిధులు,కార్యకర్తలు,పెద్ద సంఖ్యలో మహిళలు పాల్గొన్నారు.

## వాస్తు గ్రంథాన్ని ఆవిష్కరించిన బాదం ప్రవీణ్


### రైస్ మిల్లర్స్ అధ్యక్షుడి చేతుల మీదుగా 'యోగి వేమన ధ్రువ వాస్తు' విడుదల



ములుగు జూన్24 , విజన్ ఆంధ్ర ప్రతినిధి : ప్రాచీన వాస్తు విజ్ఞానాన్ని భావితరాలకు అందించే లక్ష్యంతో రూపొందిన బియోగి వేమన ధ్రువ వాస్తుబి పుస్తకాన్ని ములుగు జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు “ బాదం ప్రవీణ్ “ ఘనంగా ఆవిష్కరించారు. శుక్రవారం: జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో బాదం ప్రవీణ్ తన కార్యవర్గ సభ్యులతో కలిసి ఈ విలువైన గ్రంథాన్ని విడుదల చేశారు. ప్రముఖ వాస్తు పండితుడు శ్రీ కొత్తపల్లి మొగిలి శాలివాహన రచించిన ఈ పుస్తకం వాస్తు శాస్త్రంపై అవగాహన కల్పించేందుకు ఎంతగానో దోహదపడుతుందని బాదం ప్రవీణ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఇలాంటి పుస్తకాలను ప్రోత్సహించడం తన బాధ్యతగా భావిస్తున్నానని, సమాజానికి ఉపయోగపడే ప్రతి మంచి కార్యక్రమానికి తన మద్దతు ఎప్పుడూ ఉంటుందని “ బాదం ప్రవీణ్“ స్పష్టం చేశారు. సామాన్య ప్రజలకు కూడా అర్థమయ్యేలా వాస్తు సూత్రాలను వివరించిన రచయిత కొత్తపల్లి మొగిలిని ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్ కార్యదర్శి సహోదరి రెడ్డి, కోశాధికారి ఎలగందుల మోహన్, ఆర్గనైజింగ్ సెక్రటరీ కొమురవెల్లి హరినాథ్, ఉపాధ్యక్షులు అక్కల రగోతం, సహాయ కార్యదర్శి దేగల భద్రయ్య, బి.ఎన్.రెడ్డి, వల్లాల అనిల్ తదితరులు పాల్గొన్నారు. రచయిత కొత్తపల్లి మొగిలి శాలివాహన మాట్లాడుతూ, యోగి వేమన సూత్రాల ఆధారంగా రూపొందించిన ఈ ధ్రువ వాస్తు పుస్తకం భావితరాలకు మార్గదర్శకంగా నిలుస్తుందని, ఈ గ్రంథాన్ని ఆవిష్కరించే అవకాశం కల్పించిన “బాదం ప్రవీణ్“కు కృతజ్ఞతలు తెలిపారు.

# నకిలీ విత్తనాల పై జూలూరుపాడు పోలీస్ నిఘా నేత్రం

**నకిలీ విత్తనాలు, ఎరువులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవు జూలూరుపాడు ఎస్ఐ జీనత్ కుమార్.**



జూలూరుపాడు జూన్ 25 (విజన్ ఆంధ్ర ) భద్రాద్రి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, డీఎస్పీ కొత్తగూడెం సీఐ జూలూరుపాడు ఆధ్వర్యం లో జూలూరుపాడు పోలీస్ స్టేషన్ పరిధిలో నకిలీ విత్తనాలు, ఎరువులు, పురుగుమందుల విక్రయాలపై ప్రత్యేక నిఘా మరియు తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఎస్ఐ జీనత్ కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నకిలీ విత్తనాలతో రైతుల జీవితాలతో ఆడుకుంటే విక్రయించే డీలర్లు, దుకాణదారులు మాత్రమే కాకుండా సంబంధిత కంపెనీలపై కూడా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైతులకు విత్తనాలు విక్రయించే వ్యాపారులు తప్పనిసరిగా చెల్లుబాటు అయ్యే లైసెన్స్ కలిగి ఉండాలని సూచించారు. దుకాణాలలో ఉన్న స్టాక్‌ను రోజువారీగా నమోదు చేయడంతో పాటు, విత్తనాలు, ఎరువులు, పురుగుమందులకు సంబంధించిన స్టాక్ రిజిస్టర్లు, కొనుగోలుఅమ్మకాల బిల్లులు తనిఖీ సమయంలో అందుబాటులో ఉంచాలని తెలిపారు. రికార్డుల్లో నమోదు చేసిన వివరాలు మరియు దుకాణంలో ఉన్న స్టాక్ మధ్య ఎలాంటి వ్యత్యాసాలు ఉండకూడదన్నారు. విత్తనాలను ఎంఆర్పీ ధరలకు మించి విక్రయించరాదని, రైతులు కొనుగోలు చేసిన ప్రతి విత్తనానికి సంబంధించి తప్పనిసరిగా బిల్లులు తీసుకోవాలని సూచించారు. రైతులు కోరిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, గ్రామాల్లో తిరుగుతూ అనధికారికంగా విత్తనాలు అమ్మేవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు తీసుకుని నాణ్యమైన విత్తనాలను కొనుగోలు చేయాలని, నకిలీ విత్తనాల విక్రయాలపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు నకిలీ విత్తనాల విక్రయాలను అరికట్టేందుకు జిల్లాలో పటిష్ట నిఘా కొనసాగుతోందని, అనుమానం ఉన్న సందర్భాల్లో డీలర్ల దుకాణాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహిస్తామని తెలిపారు.

# విద్యార్థుల భవిష్యత్తును నాశనం చేస్తున్న మోడీ ప్రభుత్వం

**- రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికాసం వైపు నడిపిస్తోంది**

**-కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు కె.ప్రశాంత్ రెడ్డి**



నారాయణపేట, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : దేశంలో ప్రస్తుతం అమలవుతున్న విద్యా వ్యవస్థ విద్యార్థుల ప్రతిభను వెలికితీసే వ్యవస్థగా కాకుండా, వారిని తిరస్కరించే "రిజెక్షన్ సిస్టమ్"గా మారిపోయిందని కాంగ్రెస్ పార్టీ నారాయణపేట జిల్లా అధ్యక్షులు శ్రీ కె. ప్రశాంత్ రెడ్డి అన్నారు.బుధవారం నారాయణపేట జిల్లా కేంద్రంలోని సివిఅర్ భవన్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అయన మాట్లాడుతూ రాహుల్ గాంధీ దేశవ్యాప్తంగా విద్యార్థులు,యువత, తల్లిదండ్రులతో నిర్వహిస్తున్న సంభాషణల ద్వారా విద్యా వ్యవస్థలో సమూల మార్పుల అవసరాన్ని ప్రస్తావిస్తున్నారని తెలిపారు.వంద మందిలో ఒక్కరికి మాత్రమే అవకాశం దక్కి, మిగిలిన 99 మందిని విఫలమైన వారిగా చూడటం సరైన విధానం కాదన్నారు. ప్రతి విద్యార్థికి తన కలలు, ప్రతిభ, ఆసక్తికి అనుగుణంగా అవకాశాలు లభించేలా విద్యా వ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ప్రతి సంవత్సరం నీట్ పరీక్షకు 23 లక్షల మంది, జేఈఈ కి 13 లక్షల మంది, యూపీఎస్సీ కి 25 లక్షల మంది, ఆర్ ఆర్ బి పరీక్షలకు కోట్లాది మంది యువత హాజరవుతున్నారని తెలిపారు.వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి పరీక్షలకు సిద్ధమవుతున్న విద్యార్థులకు కేంద్ర ప్రభుత్వం భరోసా ఇవ్వలేకపోతోందన్నారు. 3 వేల మంది ఐఐటి ప్రవేశ పరీక్ష రాస్తే కేవలం 30 మందికి మాత్రమే అవకాశం వస్తోందని, మిగిలిన 2,970 మంది విద్యార్థులు వ్యవస్థ చేత తిరస్కరించబడుతున్నారని అన్నారు.అదే విధంగా వైద్య విద్య చదవాలనే లక్ష్యంతో లక్షలాది మంది విద్యార్థులు నీట్ రాస్తున్నప్పటికీ, కొద్దిమందికే సీట్లు దక్కుతున్నాయని పేర్కొన్నారు.ఇది విద్యార్థుల సామర్థ్యాన్ని కొలిచే వ్యవస్థ కాకుండా అవకాశాలను పరిమితం చేసే వ్యవస్థగా మారిందన్నారు. నీట్ పేపర్ లీక్ ఘటన దేశ విద్యా వ్యవస్థ వైఫల్యానికి నిదర్శనమని విమర్శించారు.లక్షలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర ఆందోళనకు గురైనప్పటికీ కేంద్ర ప్రభుత్వం బాధ్యత వహించలేదన్నారు. పరీక్షల నిర్వహణలో విఫలమైన నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్ టి ఏ)పై చర్యలు తీసుకోవాలని, కేంద్ర విద్యాశాఖ మంత్రి నైతిక బాధ్యత వహించి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.పరీక్షల పేపర్లు లీకై విద్యార్థులు మానసిక ఒత్తిడికి గురవుతున్నా, కొంతమంది ఆత్మహత్యలకు పాల్పడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. విద్యార్థుల ప్రాణాల కంటే పదవులు గొప్పవి కావని, భవిష్యత్తు తరాల జీవితాలతో ఎవరూ చెలగాటం ఆడకూడదన్నారు.అయితే తెలంగాణలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి నాయకత్వంలోని ప్రజాపాలన ప్రభుత్వం విద్యా రంగంలో చారిత్రాత్మక మార్పులకు శ్రీకారం చుట్టిందన్నారు. కులం, మతం, ఆర్థిక అసమానతలకు అతీతంగా ప్రతి విద్యార్థికి నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు.ఆధునిక సైన్స్ ల్యాబ్స్, డిజిటల్ క్లాస్‌రూమ్స్, లైబ్రరీలు,క్రీడా వసతులతో ప్రభుత్వ విద్యను కార్పొరేట్ స్థాయికి తీసుకెళ్లే ప్రయత్నం జరుగుతోందన్నారు.పేద మరియు మధ్యతరగతి కుటుంబాల పిల్లలు కూడా అత్యుత్తమ విద్యను పొందేలా ప్రభుత్వం చర్యలు చేపడుతోందని పేర్కొన్నారు.నారాయణపేట వంటి వెనుకబడిన ప్రాంతాలకు కూడా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నారని అన్నారు. విద్యతో పాటు సాగునీటి రంగంలో కూడా భారీ మార్పులు తీసుకొస్తూ నారాయణపేట–కొడంగల్ ప్రాంతాన్ని సస్యశ్యామలం చేసే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందన్నారు."బీజేపీ ప్రభుత్వం విద్యార్థులను పరీక్షల యంత్రాలుగా మార్చుతుంటే,కాంగ్రెస్ పార్టీ విద్యార్థుల కలలను సాకారం చేసే విద్యా వ్యవస్థ కోసం పోరాడుతోంది. మోదీ ప్రభుత్వం విధ్వంసం వైపు నడిపిస్తే, రేవంత్ రెడ్డి ప్రభుత్వం వికాసం వైపు నడిపిస్తోంది" అని కె. ప్రశాంత్ రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థుల అభిప్రాయాలు, సమస్యలు, సూచనలు తెలుసుకునేందుకు త్వరలో ప్రత్యేక సమావేశాలు నిర్వహించి వాటిని రాష్ట్ర, జాతీయ నాయకత్వం దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. విద్యార్థులు నిరాశకు గురికాకుండా ధైర్యంగా ముందుకు సాగాలని ఆయన విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎండి.సలీం,జిల్లా అధికార ప్రతినిధులు వకీల్ సంతోష్ కుమార్, జనార్దన్ రెడ్డి, మండల, పట్టణ అధ్యక్షులు కోట్ల.రవీందర్ రెడ్డి,వెంకటేష్ గౌడ్,మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షులు మహిమూద్ ఖురేషి,సీనియర్ నాయకులు ఎండి.గౌస్,సుధాకర్,సరాఫ్ నాగరాజ్,అమీరుద్దీన్ అడ్వకేట్,కుర్వ మనోజ్,తదితరులు పాల్గొన్నారు.

# కోటి 25 లక్షలతో నిర్మించిన మార్కెట్ కమిటీ భవనం ప్రారంభించిన అసిఫాబాద్ ఖానాపూర్ ఎమ్మెల్యేలు కోవ లక్ష్మి ,వేడమ బొజ్జు పటేల్, జిల్లా కలెక్టర్ కె హరిత



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 24: విజన్ ఆంధ్ర ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండల కేంద్రంలో కోటి 25 లక్షల రూపాయల వ్యయంతో నూతనంగా నిర్మించిన వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయాన్ని, భవనాల సముదాయాల ను పూజారి కులకర్ణి పండిత్ మహారాజ్ చేతుల మీదుగా ప్రత్యేక పూజలు చేయించిన అనంతరం, జిల్లా కలెక్టర్ కె. హరిత, ఆసిఫాబాద్ ఖానాపూర్ నియోజకవర్గాల ఎమ్మెల్యేలు కోవలక్ష్మి, వెడ్మ బొజ్జు పటేల్‌లు సంయుక్తంగా భవనాలను ప్రారంభించారు నూతన మార్కెట్ కార్యాలయం ప్రాంగణంలో ఈజీఎస్ (ఉపాధి హామీ పథకం) ఆధ్వర్యంలో మొక్కలు నాటారు మార్కెట్ కమిటీ యార్డులో ఏర్పాటు చేసిన సమావేశంలో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మార్కెట్ కమిటీ కార్యాలయంతో పాటు 12 గదుల భవనాల సముదాయాలను నిర్మించడం వల్ల మార్కెట్ కమిటీకి స్థిరమైన ఆదాయం చేకూరుతుందని అన్నారు రైతులు వ్యవసాయంలో రసాయనిక ఎరువుల వాడకాన్ని తగ్గించి, సేంద్రియ ఎరువుల వినియోగంపై దృష్టి సారించాలని కోరారు. విత్తన, ఎరువుల దుకాణాల్లో కొనుగోలు చేసినప్పుడు రైతులు తప్పనిసరిగా ఒరిజినల్ రసీదులు తీసుకోవాలని, పంట చేతికి వచ్చే వరకు వాటిని భద్రపరుచుకోవాలని సూచించారు. మార్కెట్లో నకిలీ విత్తనాలను అరికట్టేందుకు వ్యవసాయ శాఖ అధికారులు ఎప్పటికప్పుడు క్షేత్రస్థాయిలో పర్యవేక్షణ చేస్తూ రైతులకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొడప ప్రకాశ్, జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమేత విశ్వనాథ్ రావు, వైస్ చైర్మన్ బానోత్ జైవంత్ రావు, ఆసిఫాబాద్ డీసీసీ అధ్యక్షురాలు అత్రం సుగుణక్క, జిల్లా గ్రంథాలయ చైర్మన్ అనిల్, జైనూర్, సిర్పూర్ (యు), లింగాపూర్, ఉట్నూర్ మండలాల సర్పంచులు, రైతులు ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# సర్ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలి

**-జిల్లా కలెక్టర్ కె.హరిత**



ఆసిఫాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 24, విజన్ ఆంధ్ర : ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కె.హరిత అన్నారు. బుధవారం జిల్లాలోని జైనూర్ మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించి కార్యాలయ ఉద్యోగుల హాజరు, సమగ్ర సవరణ ప్రక్రియ నిర్వహణ తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 25 నుంచి నిర్వహించే సర్ ఇంటింటి కార్యక్రమాన్ని పారదర్శకంగా నిర్వహించాలని తెలిపారు. సర్ కార్యక్రమం సర్వే పత్రాలను పంచాయతీల వారీగా, పోలింగ్ కేంద్రాల వారీగా పంపిణీ చేయాలని, ఓటరు జాబితాలో ఓటర్ల నూతన పాస్ ఫోటోల కోసం ఫోటోగ్రాఫర్లతో మాట్లాడి గ్రామాలలో తక్కువ ధరకు పాస్ ఫోటోలు అందించేలా చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ కు సూచించారు. బూత్ స్థాయి అధికారులు ప్రతి ఓటరుకు సంబంధించిన ఎన్యుమరేషన్ ఫారం అందిస్తారని, సంబంధిత ఓటరు నింపి ఫారాలను తిరిగి బూత్ స్థాయి అధికారులు ఇంటికి వచ్చిన సమయంలో సేకరించి ఫారంలో పొందుపరిచిన వివరాలను యాప్ లో నమోదు చేస్తారని తెలిపారు. తహసిల్దార్లు, సూపర్వైజర్లు, జిల్లా యంత్రాంగం సమగ్ర సవరణ ప్రక్రియను పర్యవేక్షించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జైనూర్ తహసిల్దార్ ఆడ బిర్షావ్, ఆర్ ఐ మోహన్, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.

# 99 రోజుల కార్యక్రమం విజయాలను ఆకర్షణీయమైన పుస్తకంగా రూపొందించాలి

**- ప్రతి శాఖ లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, భవిష్యత్ కార్యాచరణపై నివేదిక సిద్ధం చేయాలి**

**- ప్రజల వినతులు, పరిష్కరించిన సమస్యలు, పెండింగ్ అంశాలను డాక్యుమెంట్ చేయాలి**

**- రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్**




పెద్దపల్లి,జిల్లా ప్రతినిధి జూన్–24(విజన్ ఆంధ్ర) : ప్రతి శాఖ భవిష్యత్ కార్యాచరణను స్పష్టంగా నిర్దేశించుకుని, 99 రోజుల కార్యక్రమం ద్వారా సాధించిన విజయాలను ఆకర్షణీయమైన పుస్తకంగా రూపొందించాలని రెవెన్యూ శాఖ కార్యదర్శి డి.ఎస్. లోకేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. బుధవారం జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్షతో కలిసి పెద్దపల్లి జిల్లాలో 99 రోజుల కార్యక్రమం అమలుపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లా స్థాయిలో అమలైన కార్యక్రమాలు, సాధించిన విజయాలు, వినూత్న చర్యలు, ఇతర జిల్లాలు అనుసరించదగిన ఉత్తమ విధానాలను సమగ్రంగా పొందుపరిచే ప్రత్యేక పుస్తకాన్ని రూపొందించాలని సూచించారు. ప్రతి శాఖ తమ లక్ష్యాలు, సాధించిన ఫలితాలు, పెండింగ్ అంశాలు, చేపట్టిన పనులు, ప్రస్తుత స్థితి, భవిష్యత్ కార్యాచరణపై సంక్షిప్త నివేదిక సిద్ధం చేయాలని ఆదేశించారు. ప్రజల నుంచి వచ్చిన వినతులు, పరిష్కరించిన సమస్యలు, ఇంకా పెండింగ్‌లో ఉన్న అంశాలను కూడా నమోదు చేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష మాట్లాడుతూ, మార్చి నుంచి జూన్ 12 వరకు జిల్లాలో 99 రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేసినట్లు తెలిపారు. విద్య, పోషణ, వ్యవసాయం, డిజిటల్ గవర్నెన్స్, మహిళా సాధికారత, ఉపాధి కల్పన, పారిశుధ్యం, ఆరోగ్యం తదితర రంగాల్లో విశేష పురోగతి సాధించినట్లు వెల్లడించారు. యాసంగి సీజన్‌లో 62 వేల మందికి పైగా రైతుల నుంచి 4.46 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసి రూ.1,057 కోట్ల చెల్లింపులు చేసినట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాలకు 16 బస్సులు అందించి ఆర్టీసీకి అద్దెకు ఇవ్వడం ద్వారా స్థిరమైన ఆదాయ వనరులు కల్పించినట్లు పేర్కొన్నారు. అదనపు కలెక్టర్ జె. అరుణశ్రీ మాట్లాడుతూ, ప్రజల భాగస్వామ్యంతో గ్రామాలు, పట్టణాల్లో విస్తృత పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహించినట్లు తెలిపారు. నీటి కనెక్షన్ల డిజిటలైజేషన్, పెండింగ్ ఫైళ్ల పరిష్కారం, వాటర్ హార్వెస్టింగ్ నిర్మాణాల ఏర్పాటులో జిల్లా రాష్ట్ర స్థాయిలో గుర్తింపు పొందినట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ కొప్పుల వెంకట్ రెడ్డి, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# గిరిజన ఆశ్రమ గురుకుల పాఠశాలలో పరిశుభ్రత, నిర్వహణలో నిర్లక్ష్యం సహించేది లేదు

**- 24 గంటల్లో పూర్తిస్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టాలి**

**- ఇందిరమ్మ ఇండ్ల సర్వేను సమర్థవంతంగా నిర్వహించాలి - జిల్లా కలెక్టర్ అంకిత్**





కొత్తగూడెం బ్యూరో జూన్ 25(విజన్ ఆంధ్ర) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వాపురం మండలంలో జిల్లా కలెక్టర్ అంకిత్ బుధవారం విస్తృతంగా పర్యటించి పాఠశాలల నిర్వహణ, ఇందిరమ్మ ఇండ్ల సర్వే పురోగతిని క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా అశ్వాపురం మండలం గొందిగూడెం గిరిజన ఆశ్రమ గురుకుల బాలుర పాఠశాలను భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠతో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. కంప్యూటర్ ల్యాబ్, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల, పాఠశాల ఆవరణను పరిశీలించారు. కంప్యూటర్ ల్యాబ్‌లో కంప్యూటర్లు దుమ్ము, ధూళితో అపరిశుభ్రంగా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నాలుగు నెలల క్రితం ఇదే అంశంపై సూచనలు చేసినప్పటికీ పరిస్థితిలో మార్పు లేకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం అందించేందుకు లక్షల రూపాయల వ్యయంతో ఏర్పాటు చేసిన కంప్యూటర్ ల్యాబ్‌ను సక్రమంగా నిర్వహించకపోవడం బాధాకరమన్నారు. సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి కంప్యూటర్ ఇన్‌స్పెక్టర్ కాంట్రాక్టును రద్దు చేయాలని ఆదేశించారు. అనంతరం ప్రధానోపాధ్యాయుని గది, వంటశాలను పరిశీలించిన కలెక్టర్ విద్యార్థులకు వడ్డించేందుకు సిద్ధం చేసిన ఆహారాన్ని తనిఖీ చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన మెనూ ప్రకారం భోజనం అందించడం లేదని గుర్తించి హాస్టల్ వార్డెన్‌ను వివరణ కోరారు. విద్యార్థుల సంఖ్య ఎంత ఉన్నప్పటికీ ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని స్పష్టం చేశారు. వసతి గృహాల్లో కూడా పరిశుభ్రత లోపాలను గుర్తించిన కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రధానోపాధ్యాయుని గది మినహా పాఠశాల మొత్తం నిర్వహణలో లోపాలు ఉన్నాయని పేర్కొన్నారు. పాఠశాల ఆవరణ, తరగతి గదులు, వసతి గృహాలు, వంటశాల తదితర ప్రాంతాల్లో 24 గంటల్లో పూర్తిస్థాయిలో పరిశుభ్రత చర్యలు చేపట్టి నివేదిక సమర్పించాలని అధికారులను ఆదేశించారు. పరిశుభ్రత లోపాలు, మెనూ అమలులో నిర్లక్ష్యంపై హాస్టల్ వార్డెన్‌కు మెమో జారీ చేయాలని ఆదేశించారు. అనంతరం కొత్తూరు మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించిన కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడి విద్యాభ్యాసం, మధ్యాహ్న భోజన నాణ్యత, హాజరు నమోదు తదితర అంశాలపై వివరాలు తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరును ప్రతిరోజూ యాప్‌లో నమోదు చేయాలని ఉపాధ్యాయులకు సూచించారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు మెరుగైన వసతి, పారిశుద్ధ్య సౌకర్యాలు కల్పించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. తదుపరి అశ్వాపురం మండలం ఎలకలగూడెం గ్రామంలో జరుగుతున్న ఇందిరమ్మ ఇండ్ల సర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఇంటింటి సర్వే, దరఖాస్తుల పరిశీలన, యాప్ ద్వారా నమోదు ప్రక్రియను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఇందిరమ్మ ఇండ్ల సర్వేను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు. అర్హులైన ప్రతి కుటుంబాన్ని గుర్తించి ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు వివరాలను నమోదు చేయాలని సూచించారు. అర్హత కలిగిన ఏ ఒక్క కుటుంబం కూడా సర్వేకు దూరం కాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. యాప్‌లో నమోదు చేసే వివరాలు ఖచ్చితంగా ఉండేలా ఎప్పటికప్పుడు ధృవీకరణ చేపట్టాలని సూచించారు. సర్వే పురోగతిని ఎంపీడీవో కలెక్టర్‌కు వివరించారు. అశ్వాపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల కోసం మొత్తం 3,448 దరఖాస్తులు ఎల్1 స్థాయిలో ఉండగా, వాటిలో 2,075 దరఖాస్తుల సర్వే పూర్తయినట్లు తెలిపారు. ఇప్పటివరకు 409 గుడిసెలను గుర్తించినట్లు వివరించారు. మిగిలిన దరఖాస్తుల సర్వేను త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు కొనసాగుతున్నట్లు తెలిపారు. ఈ పర్యటనలో ఎంపీడీవో, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# పాత పెన్షన్ విధానాన్ని అమలు చేయాలి

**- ఉపాధ్యాయుల డిమాండ్లను సత్వరమే పరిష్కారించాలి.**

**- ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్.**




భూపాలపల్లి జిల్లా 24 జూన్ (విజన్ ఆంధ్ర) : జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో ఈరోజు ఏర్పాటు చేసిన ౹ా౼ఖూ మండల అధ్యక్ష ,ప్రధాన కార్యదర్శుల అత్యవసర సమావేశం జిల్లా అధ్యక్షులు రేగూరి సుభాకర్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిలుగా ఉపాధ్యాయ ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి హాజరై రాష్ట్రంలోని ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం తక్షణమే కార్యాచరణ ప్రకటించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి మాట్లాడుతూ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఎంతోకాలంగా ఎదురుచూస్తున్న సీపీఎస్ (జూూ) విధానాన్ని రద్దు చేసి,మానిఫెస్టో లో రూపొందించిన విధంగా పాత పెన్షన్ విధానం (౹ూూ)ను అమలు చేసేలా ప్రభుత్వం స్పష్టమైన కార్యాచరణను ప్రకటించాలని కోరారు. అదేవిధంగా, రాష్ట్రంలోని ఉపాధ్యాయులు మరియు ఉద్యోగులకు అందుబాటులో ఉండే విధంగా హెల్త్ కార్డుల సేవలను వెంటనే వినియోగంలోకి తీసుకురావాలని ప్రభుత్వాన్ని కోరారు. ఉద్యోగ, ఉపాధ్యాయ వర్గాలకు రావలసిన పెండింగ్‌లో ఉన్న ఐదు డీఏలను (ణముఖీఅవంం ౼ాశ్రీశ్రీశీఘుఅవెం) తక్షణమే మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే, పీఆర్సీ (౹ా=జ) కమిషన్ నివేదికను వెంటనే తెప్పించుకుని, కనీసం 50 శాతం ఫిట్‌మెంట్‌తో కొత్త పీఆర్సీని ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్రవ్యాప్తంగా ఉద్యోగులు, ఉపాధ్యాయులకు సంబంధించిన పెండింగ్ బిల్లులన్నింటినీ నెలకు రూ.1,500 కోట్ల చొప్పున ప్రత్యేక నిధులు కేటాయించి తక్షణమే విడుదల చేయాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సుంకరి బిక్షం గౌడ్ మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల పట్ల ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వాలని , లేదంటే సంఘ పక్షాన ఉద్యమ కార్యాచరణ ప్రకటించడానికి సిద్ధమని తెలిపారు.గురుకుల సమయ సారినిని మార్పించాలని,మోడల్ స్కూల్ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని,ఖ+దీఎ ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని జిల్లా అధ్యక్షులు రేగూరి సుభాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. భూపాలపల్లి ,మలహార్ రావ్,ఘనపురం,మండలంలో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బ్యాడ్ క్లైమేట్ అలవెన్సులు మంజూరు చెయ్యాలని జిల్లా ప్రధాన కార్యదర్శి కుసునపు కిరణ్ కుమార్ డిమాండ్ చేశారు.. ఈ కార్యక్రమంలో ఆడిట్ కమిటీ చైర్మన్ సోమిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి , మండల తిరుపతి రెడ్డి, నకిరెడ్డి మహేందర్, వేం యాకుబ్ రెడ్డి, కోకిల శ్రీరంగం, దేవులపల్లి సత్యనారాయణ, విజయ భాస్కర్, సామల పట్టాభి లతో పాటుగా జిల్లాలోని 12 మండలాల అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు,జిల్లా రాష్ట్ర బాధ్యులు పాల్గొన్నారు.

# గోద్రెజ్ ఆగ్రోవెట్ హిట్‌వీడ్ మ్యాక్స్‌పై ఆఫర్

హైదరాబాద్, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : పత్తి రైతులు సకాలంలో కలుపు నివారణ చర్యలు చేపట్టేందుకు ప్రోత్సహించేందుకు గోద్రెజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ తమ సెలెక్టివ్ హెర్బిసైడ్ 'హిట్‌వీడ్ మ్యాక్స్'పై క్యాష్‌బ్యాక్ ఆఫర్‌ను ప్రకటించినట్లు గోద్రేజ్ ఆగ్రోవెట్ లిమిటెడ్ క్రాప్ కేర్ బిజినెస్ సీఈఓ రాజవేలు ఎన్.కె బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ ఈ పథకం కింద ఉత్పత్తిని కొనుగోలు చేసిన రైతులు క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయడం లేదా మిస్డ్ కాల్ ద్వారా ప్రోమో కోడ్ పొందడం ద్వారా హామీతో కూడిన క్యాష్‌బ్యాక్ రివార్డులను నేరుగా తమ బ్యాంకు ఖాతాల్లో పొందవచ్చని తెలిపారు. హిట్‌వీడ్ మ్యాక్స్ పత్తి పంటలో మొలకెత్తిన తర్వాత ఉపయోగించే హెర్బిసైడ్ అని, ఇది గడ్డి, వెడల్పాటి ఆకుల కలుపు మొక్కలను సమర్థవంతంగా నియంత్రిస్తుందని తెలిపారు. కలుపు మొక్కలు 2, 3 ఆకుల దశలో ఉన్నప్పుడు ప్రతి పంపుకు 70 మిల్లీలీటర్ల చొప్పున పిచికారీ చేయాలని సూచించారు.

# ప్రత్యేక అధికారి ఇలంబర్తికి స్వాగతం పలికిన జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా



నిర్మల్ జిల్లా, జూన్ 24(విజన్ ఆంధ్ర); "ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక" సమీక్ష కార్యక్రమంలో పాల్గొనేందుకు జిల్లాకు వచ్చిన ప్రత్యేక అధికారి ఇలంబర్తికి జిల్లా కలెక్టర్ భవేశ్ మిశ్రా బుధవారం అటవీ శాఖ వసతి గృహంలో పూల మొక్కను అందజేసి మర్యాదపూర్వకంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా డీఎఫ్‌వో సుశాంత్ సుఖదేవ్ బోబడే, అదనపు కలెక్టర్ (రెవెన్యూ) కిషోర్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణమే మన అందరి బాధ్యత

**- జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ ఐపిఎస్.**




భూపాలపల్లి జిల్లా: 24 జూన్ ( విజన్ ఆంధ్ర ) : భూపాలపల్లి జిల్లాలో మాదక ద్రవ్యాల వినియోగం అక్రమ రవాణాపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు 2కే రన్ నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమాన్ని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ , జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, ఐపీఎస్ జెండా ఊపి 2 కె రన్ ను ప్రారంభించారు. ఈ సందర్భంగా "డ్రగ్స్‌కు నో చెప్పండి ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మిద్దాం" అనే సందేశాన్ని యువతకు అందించారు. ర్యాలీలో పాల్గొన్న అధికారులు, విద్యార్థులు, యువత మరియు ప్రజలు మాదక ద్రవ్యాల నిర్మూలనకు సంబంధించిన నినాదాలు చేస్తూ ముందుకు సాగారు. మాదక ద్రవ్యాల వల్ల కలిగే అనర్థాలు, యువతపై వాటి దుష్ప్రభావాలు, కుటుంబాలు మరియు సమాజంపై పడే ప్రభావం గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, మాదక ద్రవ్యాల నిర్మూలనలో ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి తమ లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత భూపాలపల్లి జిల్లా నిర్మాణానికి ప్రజలందరూ సహకరించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, సిబ్బంది, విద్యార్థులు, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు మరియు విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ఘనంగా సేవాలాల్ సేన వ్యవస్థాపక అధ్యక్షులు భూక్య సంజీవ నాయక్ జన్మదిన వేడుకలు:



మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 25 (విజన్ ఆంధ్ర) : నేడు మానుకోట జిల్లా కేంద్రంలోని సేవలాల్ సేన కార్యాలయంలో సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు భూక్యా సంజీవ్ నాయక్ జన్మదిన వేడుకలను జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సేవా లాల్ సేన జిల్లా అధ్యక్షులు గుగులోతు నందులాల్ నాయక్ అధ్యక్షతన ఘనంగా పుట్టిన రోజు వేడుకలు జరుపుకున్నారు.ఈ వేడుకలకు అతిధులుగా సేవా లాల్ సేన రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సేవాలాల్ వెంకన్న నాయక్,జాతీయ కోర్ కమిటీ సభ్యులు ధరావత్ మోతిలాల్ నాయక్ పాల్గొని మాట్లాడుతూ సంజీవ్ నాయక్ బంజారా జాతిలో పుట్టడం మన అదృష్టం అని ,తండా పంచాయతీలు,సేవా లాల్ జయంతి నీ అధికారికంగా నిర్వహించడానికి కృషి చేసిన నాయకుడు అని అన్నారు.జాతి కోసం పరితపించే నాయకుడు అని అన్నారు.ఆయన జాతికి ఎన్నో సేవలు అందించారని అన్నారు. ఈ వేడుకలలో రాష్ట్ర కార్యదర్శి జర్పుల బాలు నాయక్ ,జిల్లా ప్రధాన కార్యదర్శి బాదావత్ రాంబాబు నాయక్,మహిళా సేన జిల్లా అధ్యక్షురాలు భూక్యా స్రవంతి నాయక్, జిల్లా కార్యదర్శి బానోతు నరేందర్ నాయక్ ,కార్మిక సేన కార్ యూనియన్ అధ్యక్షులు బానోత్ ప్రసాద్ నాయక్,పాల్గొన్నారు.

## వీఎస్ఆర్ నగర్ పాఠశాలలో కంప్యూటర్ ను ప్రారంభించిన గ్రామ సర్పంచ్ గొడుగు రేణుక కమలాకర్




బచ్చన్నపేట, జూన్24(విజన్ ఆంధ్ర): బచ్చన్నపేట మండలంలోని వీఎస్ ఆర్ నగర్ పాఠశాలకు ఇన్ఫోసిస్ కంప్యూటర్ సొల్యూషన్ హైదరాబాద్ వారు బహుకరించిన కంప్యూటర్ ను గ్రామసర్పంచ్ గొడుగు రేణుక కమలాకర్ ప్రారంభించారు.ఈ సందర్భంగా సర్పంచ్ రేణుక మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులకు సేవ చేయాలని, అందరికీ కంప్యూటర్ పరిజ్ఞానం అందించాలనే లక్ష్యంతో మన గ్రామ పాఠశాలకు కంప్యూటర్ ను బహుకరించిన ఇన్ఫోసిస్ సంస్థ కు ధన్యవాదములు తెలిపారు.అనంతరం ప్రధానోపాధ్యాయులు దాస్యం కృష్ణ మాట్లాడుతూ మా పిల్లలకు చిన్నప్పటి నుండే విద్యతో పాటు, కంప్యూటర్ నాలెడ్జి ని అందించాలనే ఉద్దేశం తో మేము అడగగానే వెంటనే స్పందించి మా పాఠశాలకు కంప్యూటర్ ని బహుకరిశీచిన ఇన్ఫోసిస్ ప్రాజెక్ట్ మేనేజర్ రాపాక స్వాతి ,రాపాక నాగరాజులకు ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ వార్డ్ సభ్యులు గొడుగు మహాలక్ష్మి , చవాన్ జైహింద్, అంగన్వాడీ టీచర్ హాజీరా, ఉపాధ్యాయులు పొన్నాల రాజేందర్ కుమార్ విద్యార్థులు పాల్గొన్నారు.

## విద్యార్థులకు రుచికరమైన భోజనం అందించాలి

**- డిఆర్డిఓ వెంకట్ రాములు**



నారాయణపేట, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రతినిత్యం రుచికరమైన భోజనాన్ని అందించాలని డిఆర్డిఓ వెంకట్రాములు ఉపాధ్యాయులకు సూచించారు. నారాయణపేట మండల పరిధిలోని జాజాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ను బుధవారం సందర్శించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మధ్యాహ్న భోజన పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తుందని అందులో భాగంగానే ప్రతి విద్యార్థికి రుచికరమైన భోజనాన్ని అందించేందుకు ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆయన పాఠశాల హెచ్ఎం కు సూచించారు. మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని తెలిపారు.అంతేకాకుండా మధ్యాహ్న భోజన ఏజెన్సీ సభ్యులు ప్రతినిత్యం కూరగాయలను శుభ్రంగా కడిగి వాటిని వండి భోజనాన్ని తయారు చేయాల్సిందిగా సూచించారు అనంతరం ఆయన ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్ తో పాటు విద్యార్థుల హాజరు రిజిస్టర్ను తనిఖీ చేశారు.ఈ కార్యక్రమంలో డిపిఎం మాసన్న ఏపీఎం నారాయణ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భారతి భాను ప్రకాష్ నిర్మల నర్సింలు శిరీష పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం...

బోడుప్పల్,జూన్ 24( విజన్ ఆంధ్ర ప్రతినిధి) : నేడు చిలుకానగర్ విద్యుత్ డివిజన్ పరిధి హేమా నగర్ ఫీడర్,మల్లికార్జున నగర్ ఫీడర్ పరిధిలోని ఆయా ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను తాత్కాలికంగా నిలిపివేయనున్నట్లు చిల్కానగర్ విద్యుత్ శాఖ ఏఈ వినయ్ కుమార్ రెడ్డి తెలిపారు. హేమా నగర్ ఫీడర్ పరిధిలో ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 1:00 గంటల వరకు సాయి భవాని నగర్, గాయత్రి హిల్స్, మల్లయ్య నగర్, వాసవి నగర్, అనుశ్రీ నగర్, నార్త్ బాలాజీ హిల్స్, సప్తగిరి కాలనీ, తిరుమల మెడోస్, హేమా నగర్, లక్ష్మీగణపతి కాలనీ, సాన్వి హైట్స్ ప్రాంతాలలో ,మల్లికార్జున నగర్ ఫీడర్ పరిధిలో మధ్యాహ్నం 2:00 గంటల నుంచి సాయంత్రం 5:30 గంటల వరకు నాయిడ్‌గూడ, చిల్కానగర్, బొడ్డురాయి ప్రాంతం, మల్లికార్జున నగర్, శివాలయం ప్రాంతం, ప్రభుత్వ పాఠశాల పరిసరాలు, న్యూ రాంనగర్, కుమ్మరికుంట, మర్రిచెట్టు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుందని వినియోగదారులు ముందస్తు ఏర్పాట్లు చేసుకొని విద్యుత్ శాఖకు సహకరించాలని ఏఈ వినయ్ కుమార్ రెడ్డి కోరారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు

**- జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ హామీ**

**- TUWJ (IJU) నాయకులతో చర్చలు సఫలం**



కామారెడ్డి బ్యూరో జున్ 24 (విజన్ఆంధ్ర) : జిల్లాలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందజేస్తామని జిల్లా కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ జర్నలిస్టు ప్రతినిధు లకు హామీ ఇచ్చారు. అక్రిడిటేషన్ కార్డుల జారీలో జిల్లా సమాచార పౌరసం బంధాల అధికారి (DPRO) నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ.. టీయుడబ్ల్యూజే (ఐజేయు) ఆధ్వ ర్యంలో బుధవారం జర్నలిస్టులు ధర్నాకు సిద్ధమ య్యారు. ఈ నేపథ్యంలో యూనియన్ ప్రతినిధులతో కలెక్టర్ ప్రత్యేకంగా సమావేశమై చర్చలు జరిపారు.

**కలెక్టర్ దృష్టికి డిపిఆర్వో సమస్యలు**

డిపిఆర్వో వల్ల తాము ఎదుర్కొంటున్న ఇబ్బందులను జర్నలిస్టులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. జిల్లాలో ఆమోదం పొందిన 273 అక్రిడిటేషన్ కార్డులలో కొన్నింటిని మాత్రమే పంపిణీ చేసి, మిగతా కార్డుల జారీకి డిపిఆర్వో లేనిపోని కొర్రీలు పెడుతున్నారని వివరించారు. బస్ పాసుల విషయంలోనూ ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ, జర్నలిస్టుల పట్ల అనుచిత వ్యాఖ్యలు చేస్తున్నారని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. సదరు డిపిఆర్వోను తక్షణమే ఇక్కడి నుంచి బదిలీ చేయాలని, లేదా సంబంధిత శాఖకు సరెండర్ చేయాలని డిమాండ్ చేశారు.

**సానుకూలంగా స్పందించిన కలెక్టర్**


జర్నలిస్టుల సమస్యలపై కలెక్టర్ సానుకూలంగా స్పందించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ.. అక్రిడిటేషన్ కార్డుల జారీ విషయంలో జర్నలిస్టులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అర్హులైన ప్రతి ఒక్కరికీ కార్డులు అందుతాయని హామీ ఇచ్చారు. అలాగే డిపిఆర్వో వైఖరిపై విచారణ జరిపి తగిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.అక్రిడిటేషన్ కార్డుల ప్రక్రియను పర్యవేక్షించి, వెంటనే కార్డులు జారీ చేయాల్సిందిగా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఎస్.వి. గిరిని కలెక్టర్ ఆదేశించారు. అక్రిడిటేషన్ కమిటీ సభ్యులతో చర్చించి, అర్హులైన వారందరికీ త్వరితగతిన కార్డులు అందేలా చూడాలని సూచించారు. కలెక్టర్ నుంచి స్పష్టమైన హామీ లభించడంతో జర్నలిస్టులు హర్షం వ్యక్తం చేశారు.

**భారీగా తరలివచ్చిన జర్నలిస్టులు**

ఈ చర్చల కార్యక్రమంలో TUWJ (IJU) జిల్లా అధ్యక్షుడు వి. రజినీకాంత్, కార్యదర్శి తోట రాజేష్, ఎలక్ట్రానిక్ మీడియా అధ్యక్షుడు పట్నం శ్రీనివాస్, కార్యదర్శి సుధాకర్ గౌడ్, ఉపాధ్యక్షులు ముదాం శంకర్ పటేల్, కార్యదర్శులు, ఈసీ సభ్యులు పాల్గొన్నారు. కామారెడ్డి, ఎల్లారెడ్డి, బాన్సువాడ, జుక్కల్ నియోజకవర్గాల నుంచి జర్నలిస్టులు భారీ సంఖ్యలో తరలివచ్చారు.

# గుడిసె వాసులకు జనగణన చేయండి

**-సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి**



రంగారెడ్డి/అబ్దుల్లాపూర్ మేట్, జూన్ 23 (విజన్ఆంధ్ర ప్రతినిధి): రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం నియోజకవర్గం, అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, మల్కాజిగిరి కార్పొరేషన్, నాగోల్ సర్కిల్ అబ్దుల్లాపూర్ మెట్టు మండలం, రావి నారాయణ రెడ్డి కాలనీ ఫెజ్ 3, కుంట్లూరు రెవిన్యూ పరిధిలోని సర్వే నంబర్ 215 నుండి 224 వరకు గల వంద ఎకరాల భూదాన భూమిలో 2022 నుండి నేటి వరకు నాలుగేండ్లుగా నివాసం ఉంటున్న 7000 వేల కుటుంబాలని భారత ప్రభుత్వం చేపట్టిన జనగణలో లెక్కించలని సిపిఐ జాతీయ నాయకులు, మాజీ ఎమ్మెల్యే చాడ వెంకట్ రెడ్డి జిఎచ్ఎంసి కమిషనర్ కి వినతి పత్రం అందచేశారు. ఈ సందర్బంగా చాడ వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. భూదాన భూముల్లో నివాసం ఉంటున్న గుడిసె వాసులంత ఎస్సి, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాల ప్రజలేనని, వారికీ ఉండటానికి కనీసం గూడు లేని నీరుపేదలని వారికీ కనీసం మౌలిక వసుతులు లేకున్నా కూడా చిన్న చిన్న పిల్లలతో వారిని చదివిస్తూ నివాసం ఉంటున్నారని తెలియజేశారు. భారత రాజ్యాంగం ప్రకారం దేశ పౌరులందరికి కనీస సౌకర్యాలు కల్పించాల్సిన ప్రభుత్వాలు సౌకర్యాలు కల్పించక పొగ కనీసం మనుషులుగా కూడా గుర్తించటం లేదని మండిపడ్డారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభం అయినా జనగణలో గుడిసెవాసులని చేర్చుకోకుండా ప్రభుత్వం వారికీ అన్యాయం చేసే కుట్ర జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వే చేస్తున్న ఎన్యూమరేటర్లకి వెంటనే ఆదేశాలు ఇచ్చి ఆ పేద ప్రజలందరిని జనాభా లెక్కల్లో చేర్చాలన్నారు. సుమారు ముప్పై వేల మంది నివాసం ఉండే గుడిసెల్లో సర్వే చేయకపోతే అది పారదర్శకత లేని సర్వే అవుతుందని మండి పడ్డారు. జనగణలో మమ్మల్ని లెక్కించకుంటే మేమేక్కడ పోవాలని గత అయిదేండ్లుగా ఇక్కడే నివాసం ఉంటున్నామని గుడిసె వాసులు ఆవేదన వ్యక్తం చేసారు. తక్షణమే జనగణలో చేర్చి భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కూడా నమోదు చేయాలనీ వారికీ కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేసారు. ఈ కార్యక్రమంలో భారత కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఆందోజు రవీంద్రచారీ, సిపిఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు ముత్యాల యాదిరెడ్డి పాల్గొన్నారు.

# సిసి రోడ్లు నిర్మించడమే లక్ష్యంగా కృషి

**- సీసీ రోడ్లు యూజీడి నిర్మించాలి**

**- అర్హులైన లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్లు ఇవ్వాలి**

**- ఆసరా పింఛన్లు ఇప్పించాలి**

**- ఐరన్ పోల్స్ తొలగించి సిమెంట్ పోల్స్ వేయించాలి**

**- ఒకటవ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ళ అనంత్ రెడ్డి**



వికారాబాద్ జిల్లా ప్రతినిధి జూన్ 24 ( విజన్ ఆంధ్ర ) : వార్డు అభివృద్ధి చెందడంలో అంతర్గత రహదారి వ్యవస్థ కీలక పాత్ర పోషిస్తుందని ఒకటవ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ళ అనంత్ రెడ్డి అన్నారు. సీసీ రోడ్లతోపాటు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపట్టవలసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. బుధవారం వికారాబాద్ మునిసిపల్ పరిధిలో గల ఒకటవ వార్డు కౌన్సిలర్ పట్లోళ్ళ అనంత్ రెడ్డి విజన్ ఆంధ్ర జిల్లా ప్రతినిధి మాచన్నగారి గైబులు ముదిరాజ్ తో మాట్లాడారు. అంతర్గత రహదారి వ్యవస్థ పటిష్టం చేసేందుకు అహర్నిశలు కృషి చేస్తానని ఆయన ధీమా వ్యక్తం చేశారు. హనుమాన్ మందిర్ నుండి ఊరడమ్మ గుడి వరకు, ఎస్సీ కాలనీలో ముత్తెరగల్ల నందు ఇంటి నుండి పోచమ్మ గుడి వరకు, బీసీ గల్లీలో నడివుడ్ల బావి నుండి పోరాడి ప్రభాకర్ ఇంటి వరకు నారాయణపూర్ మెయిన్ రోడ్డు నుండి మజీద్ వరకు సిసి రోడ్లు నిర్మాణం చేపట్టాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. నారాయణగారి మల్ రెడ్డి ఇంటి నుండి బ్యాగరి అనంతరాములు ఇంటి వరకు అండర్ గ్రౌండ్ డ్రైనేజీ నిర్మాణం చేపడతామని ఆయన స్పష్టం చేశారు. ఒకటవ వార్డులో గల్లీ గల్లీకి సిసి రోడ్లు నిర్మించాల్సి ఉందని ఆయన చెప్పారు. వార్డులో ఇంతకుముందు 25 ఇందిరమ్మ ఇండ్లు లబ్ధిదారులకు వచ్చినవని ఆయన గుర్తు చేశారు. అందరూ లబ్ధిదారులు 100% ఇందిరమ్మ ఇండ్లను నిర్మించుకున్నారని ఆయన పేర్కొన్నారు. వార్డుకు ఇంకా 75 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు కావలసి ఉన్నదని ఆయన స్పష్టం చేశారు. ముందుగా ఆసరా పెన్షన్లు వచ్చినవి కాకుండా ఇంకా 100 రావల్సి ఉన్నదని ఆయన అన్నారు. రోజువారి కార్యక్రమాలలో భాగంగా పారిశుద్ధ్య పనులు ఎప్పటికప్పుడు పూర్తి చేయిస్తున్నామని ఆయన వెల్లడించారు. ఐరన్ పోల్స్ ఉన్నచోట వాటిని తొలగించి సిమెంట్ పోల్స్ వేయించాల్సిన ఆవశ్యకత ఉందని ఆయన పేర్కొన్నారు. 10 సిమెంట్ పోల్స్ వేయిస్తే సరిపోతుందని అన్నారు. ప్రజాభిప్రాయం మేరకు వార్డులో మూడు కొత్త బోర్లు వేయించాల్సి ఉన్నదని ఆయన తెలిపారు. వార్డులో ద్వాక్రాభవనం అంగన్వాడి భవనం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో అదనపు గదులు నిర్మించాల్సి ఉన్నదని ఆయన తెలిపారు. నీటి సమస్య తీర్చేందుకు మిషన్ భగీరథతో పాటు నాలుగు బోర్లు నాలుగు బావులు పని చేస్తున్నాయని ఆయన చెప్పారు. పాడైన బోర్లు మరమ్మతులు చేయించే కంటే కొత్త బోర్లు వేయించడం మేలని ఆయన ఆకాంక్షించారు. సంబంధిత మున్సిపల్ అధికారులు రాజకీయ ప్రతినిధులు మానవీయ కోణంలో ఆలోచించి ఒకటవ వార్డు అభివృద్ధి కొరకు సహకరించాలని ఆయన కోరారు.

# ఓటరు జాబితా రూపకల్పనలో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

**- జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ .**




భూపాలపల్లి జిల్లా: 24 జూన్ ( విజన్ ఆంధ్ర ) భూపాలపల్లి పట్టణ కేంద్రంలో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్‌పై కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించేందుకు ఇల్లందు క్లబ్ హౌస్ నుండి కలెక్టరేట్ కార్యాలయం వరకు 2కే రన్ నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జిల్లా ఎన్నికల అధికారి రాహుల్ శర్మ, ఎస్పి సంకీర్త్ జెండా ఊపి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు హక్కు వజ్రాయుధమని తెలిపారు. స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత ఎన్నికలు నిర్వహణకు ఓటరు జాబితా సమగ్రంగా , పారదర్శకంగా రూపొందించేందుకు భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్–2026)లో అర్హులైన ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా ఖచ్చితత్వంపై ఎన్నికలు నిర్వహణ ఆధారపడి ఉంటుందని తెలిపారు. ఎన్నికల సంఘం చేపట్టిన ఈ ప్రత్యేక కార్యక్రమాన్ని అర్హులైన ప్రతి ఓటరు తమ ఓటు హక్కును నమోదుచేసుకోవాలని సూచించారు. అలాగే ఇప్పటికే నమోదు చేసుకున్న ప్రజలు https://voters.eci.gov.in లో తమ పేర్లు ను తనిఖీ చేసుకోవాలని, అవసరమైతే సవరణలు, మార్పులు, చేర్పులు చేయడానికి అవకాశం ఉన్నట్లు తెలిపారు. ఎన్నికల సంఘం నిర్దేశించిన షెడ్యూల్ ప్రకారం జూన్ 25 నుంచి జూలై 24 వరకు బూత్ లెవల్ ఇంటింటికి వస్తారని ప్రజలు ఎన్యూమరేషన్ ఫారాలు నింపి ఇవ్వాలని అన్నారు. పారదర్శకమైన, సమగ్రమైన, తప్పులులేని ఓటరు జాబితా రూపకల్పనలో ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరమని స్పష్టం చేశారు. మరణించిన వ్యక్తుల వివరాలు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు మారిన వారి వివరాలు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించేందుకు (సర్) కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ఈ ప్రక్రియకు ప్రజలు పూర్తి సహకారం అందించాలని సూచించారు. మృతి చెందిన వ్యక్తుల పేర్లు, ఒకటి కంటే ఎక్కువ చోట్ల నమోదైన డూప్లికేట్ ఓట్లను గుర్తించి తొలగించడం ద్వారా మరింత ఖచ్చితమైన ఓటరు జాబితాను రూపకల్పన చేసేందుకు ఈ కార్యక్రమం దోహదపడుతుందని అన్నారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు అర్హత కలిగిన ప్రతి పౌరుడికి ఓటు హక్కు కల్పించడమే ముఖ్యల క్ష్యమని స్పష్టం చేశారు. అర్హులైన ఏ ఒక్క ఓటరు కూడా ఓటరు జాబితా నుంచి తొలగిపోకుండా అలాగే అర్హులైన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలని తెలిపారు. ఓటర్ల నమోదు, సవరణలు, అభ్యంతరాలు, క్లెయిమ్స్‌కు సంబంధించిన వివరాలకు సంబంధించి బూత్ లెవెల్ అధికారులను సంప్రదించి తెలుసుకోవాలని అన్నారు. అర్హులకు ఓటు హక్కు కల్పించడం ఎంత ముఖ్యమో అనర్హులను ఓటరు జాబితా నుండి తొలగించడం కూడా అంతే ముఖ్యమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఎఎస్పీ నరేష్ కుమార్, డీఆర్వో వసంత కుమారి, ఆర్డిఓ హరికృష్ణ, శిక్షణా డిప్యూటీ కలెక్టర్ నవీన్ రెడ్డి, మున్సిపల్ కమిషనర్ ఉదయ్ కుమార్, క్రీడల శాఖ అధికారి చిత్రా రఘు, ఎన్నికల విభాగం డిటి అబ్బాస్, కౌన్సిలర్ అప్పం కిషన్, అన్ని శాఖల జిల్లా అధికారులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## సస్టైనబిలిటీ ర్యాంకింగ్స్‌లో అమృతకు ప్రపంచ 37వ స్థానం




హైదరాబాద్, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : అమృత విశ్వవిద్యాలయం టైమ్స్ హయ్యర్ ఎడ్యుకేషన్(ది) సస్టైనబిలిటీ ఇంపాక్ట్ రేటింగ్స్–2026లో ప్రపంచవ్యాప్తంగా 37వ ర్యాంకు సాధించిందని యూనివర్సిటీ వైస్ ఛాన్సలర్, డీన్ ప్రొ.డా.మనీషా వి.రమేష్ బుధవారం నగరంలో విడుదల చేసిన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఛాన్సలర్ మాతా అమృతానందమయి దేవి తోకలసి ఆమె మాట్లాడుతూ పరిశ్రమ, ఆవిష్కరణలు, మౌలిక సదుపాయాలు (ఎస్.డీ.జీ–9) విభాగంలో భారతదేశంలో నంబర్–1 స్థానాన్ని దక్కించుకుందని తెలిపారు. నాణ్యమైన విద్య, లింగ సమానత్వం, పేదరిక నిర్మూలన, స్వచ్ఛమైన నీరు, పారిశుధ్యం, సరసమైన, స్వచ్ఛమైన ఇంధనం విభాగాల్లో ప్రపంచ టాప్–25లో నిలిచిందని చెప్పారు. ఇండోనేషియాలోని జకార్తాలో జరిగిన గ్లోబల్ సస్టైనబుల్ డెవలప్‌మెంట్ కాంగ్రెస్–26లో ఈ ఫలితాలను ప్రకటించారని తెలిపారు.

## వైభవంగా కొనసాగిన కాసింసాబ్ పీర్లసవారివేడుకలు.



నారాయణపేట, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : నారాయణపేట మండలం పరిధిలోని జాజాపూర్ లో మొహరం వేడుకల్లో భాగంగా పీర్ల పండుగ ఉత్సవాలు ఎంతో ఘనంగా కొనసాగుతున్నాయి.బుధవారం తెల్లవారుజామున కాసింసాబ్ సవారి ఉత్సవాలు ఎంతో వైభవంగా కొనసాగాయి. మంగళవారం పీర్లకు తమ తమ మొక్కుబడులను చెల్లించుకునేందుకు గ్రామీణ ప్రాంతాల నుండి వేలాదిగా భక్తులు తరలివచ్చి పీర్ల కు ప్రత్యేక పూజలు చేశారు.ఈ సందర్భంగా భక్తులు పీర్ల పండుగ ఉత్సవాల్లో భాగంగా పీర్ల మసీదు వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి మేకలను గొర్లను బలి ఇచ్చి తమ తమ మొక్కుబడులను తీర్చుకున్నారు తెల్లవారుజామున కాసిం సవారి గ్రామ పురవీధుల గుండా తిరుగుతూ పేర్లకు నీరు పోసి తమ తమ భక్తిని చాటుకున్నారు.పీర్లను మసీదులో ప్రతిష్ఠించిన అనంతరం తమ తమ మొక్కుబడులను తీర్చుకొన్నారు ఈ కార్యక్రమంలో భక్తులు మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ధరల పట్టిక బోర్డులు లేని స్కానింగ్ సెంటర్లు

**- భూపాలపల్లి జిల్లాలో స్కానింగ్ సెంటర్ల దందా సామాన్యుడి నడ్డి విరుస్తున్న రేట్లు.**

**- తక్షణమే డిఎం & హెచ్ ఓ. స్పందించాలి.**

భూపాలపల్లి జిల్లా 24 జూన్ (విజన్ ఆంధ్ర ) : జిల్లాలోని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్లు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి ఇష్టారాజ్యంగా ధరలు వసూలు చేస్తున్నాయి. దీంతో వైద్య పరీక్షల కోసం వచ్చే పేద, మధ్యతరగతి ప్రజలు తీవ్రంగా నష్టపోతున్నారు. ప్రభుత్వం నిర్ణయించిన ధరల పట్టిక సూచిక బోర్డు పై పెట్టాలని నిబంధనలు ఉన్నా అవన్నీ పక్కకు పెట్టి ఇష్టరాజ్యాంగ వసూలు చేస్తున్నారు. కొన్ని ప్రైవేట్ స్కానింగ్ సెంటర్ల దోపిడీతో సామాన్య ప్రజలు సతమతమవుతున్నారు. ఇప్పటికైనా అధికారులు కలెక్టర్, జిల్లా వైద్య శాఖ అధికారులు స్పందించి ఎదో నామ మాత్రపు తనికీలు చేసి వారి రికార్డులు పరిశీలించడం కాకుండా ఒక కమిటీని నియమించి అందులో పోలీస్ అధికారులను నియమించి తనిఖీ లు చేసి దోపిడీకి పాల్పడుతున్న సెంటర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

# వనపర్తిలో ట్రాఫిక్ సమస్యల పరిష్కారానికి క్షేత్రస్థాయి పరిశీలన

- వాహనదారులు నిబంధనలు తప్పనిసరిగా పాటించాలి
- జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా



వనపర్తిజిల్లా ప్రతినిధి, జూన్ 24 (విజన్ ఆంధ్ర) : వనపర్తి పట్టణంలో పెరుగుతున్న ట్రాఫిక్ రద్దీ సమస్యలను పరిష్కరించి, ప్రజలకు సురక్షితమైన, సౌకర్యవంతమైన రాకపోకలను కల్పించేందుకు జిల్లా పోలీసు యంత్రాంగం ప్రత్యేక చర్యలు చేపట్టింది. జిల్లా ఎస్పీ సునిత రెడ్డి ఆదేశాల మేరకు బుధవారం జిల్లా అదనపు ఎస్పీ రాజేష్ మీనా క్షేత్రస్థాయిలో విస్తృత పరిశీలన నిర్వహించారు. వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్‌లతో కలిసి పట్టణంలోని ప్రధాన కూడళ్లలో పర్యటించారు.

**ప్రధాన కూడళ్ల పరిశీలన**

అదనపు ఎస్పీ బృందం వనపర్తి పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా, ఓల్డ్ యూకో బ్యాంక్ టర్నింగ్, గాంధీచౌక్, పాలిటెక్నిక్ జంక్షన్ తదితర ట్రాఫిక్ రద్దీ ఎక్కువగా ఉండే ప్రాంతాలను సందర్శించారు. వాహనాల రాకపోకలకు అంతరాయం కలుగుతున్న స్థలాలను నిశితంగా పరిశీలించారు. ట్రాఫిక్ జాంకు దారితీస్తున్న కారణాలను స్థానిక అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రహదారుల విస్తరణ, పార్కింగ్ నియంత్రణ, ట్రాఫిక్ నిర్వహణలో చేయాల్సిన మార్పులు, హెచ్చరిక బోర్డుల ఏర్పాటు, ట్రాఫిక్ సిబ్బంది కేటాయింపు వంటి అంశాలపై అధికారులతో సమగ్రంగా చర్చించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ట్రాఫిక్ వ్యవస్థను మరింత సమర్థవంతంగా తీర్చిదిద్దేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అదనపు ఎస్పీ రాజేష్ మీనా మాట్లాడుతూ, వాహనదారులు తమ భద్రతతో పాటు ఇతరుల ప్రాణాలను కూడా దృష్టిలో ఉంచుకొని ట్రాఫిక్ నియమాలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. రహదారులపై ఏర్పాటు చేసిన ట్రాఫిక్ సిగ్నల్స్, సూచిక బోర్డులు, జీబ్రా క్రాసింగ్‌లను గౌరవించాలని, ట్రాఫిక్ సిబ్బంది సూచనలను అనుసరించాలని కోరారు. కార్యక్రమంలో వనపర్తి డీఎస్పీ గిరిబాబు, డీసీఆర్బీ డీఎస్పీ బాలాజీ నాయక్, వనపర్తి పట్టణ ఎస్సై హరిప్రసాద్, ట్రాఫిక్ ఎస్సై సురేందర్ మరియు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సూర్యాపేట మున్సిపాలిటీలో పోస్టింగ్ పై మోజెందుకు..?



- పోస్టింగ్ కోసం విశ్వ ప్రయత్నాలు..?
- సూర్యాపేటకే మళ్లీ ఎందుకు

- పోస్టింగ్ పై మున్సిపల్ లో చర్చ కొత్తవారికి ఛాన్స్ ఎప్పుడు
- ఒకే చోట ఎందుకింత ఆసక్తి
- మున్సిపల్ వర్గాల్లో జోరుగా చర్చ..
- ఒకే చోట పదేపదే పోస్టింగ్‌లకు చెక్ పెట్టాలని డిమాండ్

**సూర్యాపేట జూన్ 24:(విజన్ ఆంధ్ర)**

సూర్యాపేట మున్సిపాలిటీలో శానిటరీ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేసిన అధికారి తిరుమలగిరికి బదిలీ కావడంతో, తిరిగి సూర్యాపేటలోనే పోస్టింగ్ పొందేందుకు విశ్వ ప్రయత్నాలు చేస్తున్నట్లు సమాచారం. ఇప్పటికే వివిధ స్థాయిల్లో పలువురు ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులను సంప్రదిస్తూ తన బదిలీని సూర్యాపేటకు మళ్లించే ప్రయత్నాలు కొనసాగిస్తున్నారని ప్రచారం జరుగుతోంది. ప్రస్తుతం ఈ అంశం మున్సిపల్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఒకవేళ అలాంటి ప్రతిపాదనలు ఉన్నట్లయితే ప్రభుత్వం అమలు చేస్తున్న బదిలీ నిబంధనలను పరిపాలన అవసరాలకు అనుగుణంగానే జరుగుతున్నాయా అని అంశంపై ఉద్యోగులు స్పష్టత కోరుతున్నారు. బదిలీలు పారదర్శకంగా నిబంధనలకు లోబడి జరగాలని పలువురు అభిప్రాయపడుతున్నారు. దీంతో "సూర్యాపేట పోస్టింగ్‌లో ఉన్న ప్రత్యేకత ఏమిటి..? ఇంత పట్టుదలకు కారణమేంటి..? అనే ప్రశ్నలు ఉద్యోగులు, ప్రజల్లో వ్యక్తమవుతున్నాయి. మరోవైపు, కొందరు ఉద్యోగులు మాత్రం సాధారణ పరిపాలనా కారణాలు, వ్యక్తిగత అవసరాలు లేదా కుటుంబ పరిస్థితుల వల్లే తిరిగి సూర్యాపేటకు రావాలనుకుంటున్నారని అభిప్రాయపడుతున్నారు. అయితే మరికొందరు మాత్రం దీనిపై పారదర్శకత ఉండాలని, ఒకే చోట పోస్టింగ్ కోసం ఇంతగా ప్రయత్నాలు జరగడం వెనుక కారణాలపై స్పష్టత రావాలని కోరుతున్నారు. ప్రభుత్వ శాఖల్లో బదిలీలు, పోస్టింగ్‌లు పారదర్శకంగా ఉండాలని, ఒకే చోట పదేపదే పోస్టింగ్‌లు ఇవ్వకుండా కొత్త అధికారులకు అవకాశం కల్పించాలని ఉద్యోగ వర్గాలు, ప్రజలు కోరుతున్నారు. ఏళ్ల తరబడి ఒకే ప్రాంతంలో పనిచేయడం వల్ల పరిపాలనా వ్యవస్థపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంటుందని, కొత్త అధికారులు వస్తే కొత్త ఆలోచనలు, మెరుగైన పనితీరు, పారదర్శకత పెరిగే అవకాశం ఉంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ఇతరైన ఉద్యోగులకు అవకాశాలు తగ్గుతున్నాయని, అందువల్ల బదిలీల్లో సీనియారిటీ, అర్హత, ప్రభుత్వ నిబంధనలను పాటిస్తూ కొత్త అధికారులకు ప్రాధాన్యం ఇవ్వాలని, ఒకే వ్యక్తి కోసం ప్రత్యేక ప్రయత్నాలు లేదా పైరవీలు ఉండకూడదని ఉద్యోగులు కోరుతున్నారు. ఇది ఇలా ఉండగా ప్రభుత్వ శాఖల్లో డిప్యూటేషన్ పై వెళ్ళిన కొందరు ఉద్యోగులు తిరిగి అదే కార్యాలయాలకు అదే పోస్టులకు రావడం చర్చనీయాంశంగా మారింది. డిప్యూటేషన్ విధానం తాత్కాలిక అవసరాల కోసం మాత్రమే ఉద్దేశింపబడినప్పటికీ కొందరు ఉద్యోగులు పదేపదే అదే స్థానాలకు రావడం వల్ల పారదర్శకతపై ప్రశ్నలు తలెత్తుతున్నాయని ఉద్యోగ సంఘాలు పేర్కొంటున్నాయి.




# మరో జవహర్‌నగర్‌గా బోడుప్పల్...?

- గుట్టలను తలపిస్తున్న చెత్త కుప్పలు
- కాలనీల్లో దుర్వాసనతో దోమలు, ఈగలు దండయాత్ర
- వర్షాకాలంలో వ్యాధుల ముప్పుపై ప్రజల ఆందోళన
- అధికారులు, ప్రజాప్రతినిధుల నిర్లక్ష్యంపై మండిపాటు.
- పారిశుధ్యంపై సర్కిల్ ఘోర వైఫల్యం.!




*బోడుప్పల్ సర్కిల్‌లో పారిశుధ్య నిర్వహణ ఘోరంగా విఫలమైంది. డంపింగ్ యార్డులో చెత్త కొండల్లా పేరుకుపోయి గుంటలను తలపిస్తున్నా అధికారులు మాత్రం నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారు. ప్రజారోగ్యానికి ముప్పు పొంచి ఉన్నా పట్టించుకోని అధికారుల నిర్లక్ష్యంపై చెత్త గుట్టలు పెరుగుతున్నాయి... దుర్వాసన విస్తరిస్తోంది... వ్యాధుల ముప్పు ముంచుకొస్తోంది... అయినా అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోతే బోడుప్పల్ సర్కిల్ ప్రజల ఆరోగ్యానికి బాధ్యత ఎవరిది.....? అంటూ స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.*







**బోడుప్పల్,జూన్ 23(విజన్ ఆంధ్ర ప్రతినిధి) :** మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్‌లో పారిశుధ్య వ్యవస్థ పూర్తిగా గాడి తప్పినట్లు కనిపిస్తోంది. డంపింగ్ యార్డులో పేరుకుపోయిన చెత్త కుప్పలు చిన్నపాటి కొండలను తలపిస్తుండగా, చుట్టుపక్కల కాలనీలు దుర్వాసనతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కార్పొరేషన్ హోదా వచ్చినా ప్రజలకు కనీస పారిశుధ్య వసతులు అందించడంలో అధికారులు విఫలమయ్యారనే

“ మర్శలు వ్యక్తమవుతున్నాయి. దేవేందర్‌నగర్, ంబేద్కర్‌నగర్, రాజీవ్‌నగర్, సాయినగర్, ఆర్ఎన్ఎస్, న్నపూర్ణ కాలనీల ప్రజలు దుర్గంధం, ఈగలు, దోమల మధ్య జీవనం సాగిస్తుండగా, వర్షాకాలం సమీపిస్తున్న నేపథ్యంలో అంటువ్యాధుల ముప్పు మరింత పెరుగుతోంది. అయినప్పటికీ అధికార యంత్రాంగం స్పందించకపోవడంపై స్థానికులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చెత్త కొండలుగా మారిన డంపింగ్ యార్డు బోడుప్పల్ డంపింగ్ యార్డు పరిస్థితి రోజురోజుకూ ఆందోళనకరంగా మారుతోంది. ప్రతిరోజూ తరలిస్తున్న చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించకపోవడంతో గుట్టలను తలపించే స్థాయిలో పేరుకుపోతోంది. డంపింగ్ యార్డు మొత్తం చెత్త కొండలతో నిండిపోవడంతో చుట్టుపక్కల ప్రాంతాలు కాలుష్య కేంద్రాలుగా మారుతున్నాయి. కోట్ల రూపాయల బడ్జెట్‌తో పారిశుధ్య కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని గొప్పలు చెప్పే అధికారులు ఈ పరిస్థితిని ఎందుకు పట్టించుకోవడం లేదనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి.

**దుర్వాసనతో నరకయాతన.....**

డంపింగ్ యార్డు ప్రభావం సమీప కాలనీలపై తీవ్రంగా పడుతోంది. ముఖ్యంగా దేవేందర్‌నగర్, అంబేద్కర్‌నగర్, రాజీవ్‌నగర్, సాయినగర్, ఆర్ఎన్ఎస్, అన్నపూర్ణ కాలనీల ప్రజలు భరించలేని దుర్వాసనతో ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం నుంచి రాత్రి వరకు దుర్గంధం వ్యాపిస్తుండటంతో ఇళ్లలో ప్రశాంతంగా ఉండలేని పరిస్థితి నెలకొంది. చిన్నారులు, వృద్ధులు, అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నవారు మరింత ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**వర్షాకాలంలో వ్యాధుల ముప్పుపై ఆందోళన.....**

వర్షాకాలం ప్రారంభమైతే చెత్త కుప్పల మధ్య నిలిచే నీరు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారే ప్రమాదం ఉంది. డెంగ్యూ, మలేరియా, వైరల్ జ్వరాలు, చర్మవ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. వ్యాధులు ప్రబలిన తర్వాత చర్యలు తీసుకోవడం కంటే ముందస్తుగా చెత్త తొలగింపు, ఫాగింగ్, పారిశుధ్య చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉందని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.

**హోదా మారిన ... సమస్యలు మాత్రం యథాతథం**

బోడుప్పల్ మున్సిపాలిటీ నుంచి కార్పొరేషన్‌గా ఎదిగింది. ప్రస్తుతం మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్‌లో కీలక సర్కిల్‌గా ఉంది. అయినప్పటికీ పారిశుధ్య పరిస్థితుల్లో మాత్రం ఎలాంటి మార్పు కనిపించడం లేదని ప్రజలు వాపోతున్నారు. హోదాలు పెరిగినా సమస్యలు తగ్గలేదని, ప్రజలకు అందాల్సిన మౌలిక వసతులు ఇంకా అందుబాటులోకి రాలేదని విమర్శిస్తున్నారు.

**స్పందించని అధికారులు... మౌనంగా నాయకులు**

డంపింగ్ యార్డు సమస్యపై పలుమార్లు ఫిర్యాదులు చేసినప్పటికీ శాశ్వత పరిష్కారం కనిపించడం లేదని స్థానికులు చెబుతున్నారు. పరిశీలనలు, హామీలు తప్ప కార్యాచరణ కనిపించడం లేదని ఆరోపిస్తున్నారు. ఎన్నికల సమయంలో ప్రజల మధ్య తిరిగే నాయకులు ఇప్పుడు ఈ సమస్యపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నిస్తున్నారు.

**మరో జవహర్‌నగర్ కాకముందే...**

డంపింగ్ యార్డు సమస్యను తక్షణమే పరిష్కరించకపోతే బోడుప్పల్ కూడా మరో జవహర్‌నగర్ తరహా చెత్త సంక్షోభాన్ని ఎదుర్కొనే ప్రమాదం ఉందని స్థానికులు హెచ్చరిస్తున్నారు. చెత్తను శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించడం, దుర్వాసన నియంత్రణ చర్యలు చేపట్టడం, ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ప్రత్యేక కార్యాచరణ అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.

## చెత్తను తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి



“డంపింగ్ యార్డులో చెత్త రోజురోజుకూ పేరుకుపోతోంది. దుర్వాసనతో పాటు దోమలు, ఈగలు విపరీతంగా పెరిగి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పారిశుధ్య నిర్వహణలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. వెంటనే చెత్తను తొలగించి ప్రజారోగ్యాన్ని కాపాడాలి.

**- అబ్రహం లింకన్,సాయినగర్ కాలనీవాసి.**

## పారిశుద్ధ్య నిర్వహణ సక్రమంగా లేదు



డంపింగ్ ప్రదేశం దగ్గరగా ఉండటంతో మా ఇళ్లలో ఈగలు, దోమలు విపరీతంగా పెరిగాయి. చెత్త పేరుకుపోవడం వల్ల రాత్రిళ్లు బయటికి రావడం కూడా కష్టంగా మారింది. పారిశుద్ధ్య నిర్వహణను సక్రమంగా చేయాలి.

**- దయ్యాల అలివేలు,గృహిణి**

# రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులకు రూ.1.20 కోట్ల జీవిత బీమా..!

- ప్రీమియం చందా కట్టనక్కర్లేదు,
- ప్రమాదం జరిగితే బీమా వర్తింపు,



మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా జూన్ 24 (విజన్ ఆంధ్ర ప్రతినిధి): ఉద్యోగ సంఘాల హర్షం, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. సహజ మరణం లేదా ప్రమాదవశాత్తు మరణం సంభవించినప్పుడు రూ. 1.20 కోట్ల జీవిత బీమా రక్షణ కల్పించే ఎంప్లాయీస్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్‌ను ప్రవేశపెడుతోంది. ప్రభుత్వ నిర్ణయంపై ఉద్యోగ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి. రేపే ప్రారంభం..! ఎంప్లాయీస్ లైఫ్ ఇన్సూరెన్స్ స్కీమ్‌లో ఉద్యోగులు, పెన్షనర్లు ఎలాంటి ప్రీమియం, చందా, ఇతర చెల్లింపులేవీ కట్టాల్సిన అవసరం లేదు. ఈ బీమా పథకాన్ని ముఖ్యమంత్రి ఏ.రేవంత్‌రెడ్డి ఈనెల 25న రవీంద్రభారతిలో మధ్యాహ్నం 2.30 గంటలకు ప్రారంభించనున్నారు. ఈ బీమా పథకం అమలుకు సంబంధించి రాష్ట్ర ప్రభుత్వం వివిధ బ్యాంకులతో అవగాహన(ఎంఓయూ) కుదుర్చుకోనుంది. రాష్ట్రంలోని ఉద్యోగులు, పెన్షనర్ల కుటుంబాలకు ఆర్థిక భద్రత కల్పించడమే ఈ పథకం ప్రధాన ఉద్దేశ్యమని అధికారులు తెలిపారు.

# ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిసిన జిల్లా రవాణా అధికారి

వనపర్తి జిల్లా ప్రతినిధి, జూన్ 24 విజన్ ఆంధ్ర : వనపర్తి జిల్లా పోలీసు కార్యాలయంలో జిల్లా రవాణా అధికారి (డీటీఓ) సురేష్ కుమార్ జిల్లా ఎస్పీ సునిత రెడ్డిని బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా డీటీఓ సురేష్ కుమార్ ఎస్పీకి పూల మొక్కను అందజేసి శు భాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలోని రవాణా, ట్రాఫిక్ నియంత్రణ, వాహనాల తనిఖీలు మరియు శాఖల మధ్య సమన్వయం తదితర అంశాలపై వారు కొద్దిసేపు చర్చించారు. ఈ క్రమంలో జిల్లా రవాణా శాఖ అధికారికి ఎస్పీ సునిత రెడ్డి తన అభినందనలు మరియు శుభాకాంక్షలు తెలియజేశారు.

EDITED,PRINTED, PUBLISHED AND OWNED BY J.NARENDER PRINTED AT SREE DATTA SAI GRAPHICS,# H.NO.1-1-651/8. GANDHINAGAR.HYDERABAD-500020.TELANGANA STATE,PUBLISHED AT J.N.PUBLICATIONS,H.NO.2-1-340/A/4,G.H.M.C NO 12, NEAR FEVER HOSPITAL, BESIDE SBI ATM CENTRE, O.U.ROAD, NALLAKUNTTA MAIN ROAD, HYDERABAD-500044, TELANGANA STATE. RNI.NO.70731/1999 EDITOR : J.NARENDER, CELL:9440897445, Mail visionandhra1999@gmail.com.